www.mudranews.in
సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in | @mudranews
హైదరాబాద్
శనివారం, 31.01.2026
సంపుటి:13
సంచిక: 102
పేజీలు: 12
వెల: రూ. 5
Published From: Hyderabad



- డైవర్షన్ వ్యూహంతో మున్సిపల్ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్లాన్
- కేసీఆర్‌కు నోటీసులతో డైవర్ట్ అయిన బీఆర్ఎస్
- ఎన్నికల ఎజెండా మారిన రాజకీయ వాతావరణం
- గ్రౌండ్‌లో కాంగ్రెస్, డిఫెన్స్‌లో బీఆర్ఎస్
- మున్సిపల్ ఎన్నికలపై దృష్టి పెట్టలేని పెద్దలు
- ట్యాపింగ్ చర్చలతో ప్రజా సమస్యలు గల్లంతు
- సిట్ నోటీసుల సుడిగుండంలో ప్రతిపక్షం
- మున్సిపల్ ఎన్నికల ముందు వ్యూహాల యుద్ధం
- డైవర్షన్ ట్రాప్ నుంచి బయటపడగలదా బీఆర్ఎస్?
- రాజకీయ చదరంగంలో పైచేయి ఎవరిది?

# డైవర్షన్ పాలిట్రిక్స్

## మున్సిపల్ పోరులో ఫోన్ ట్యాపింగ్ కేసు హీట్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగిన వేళ, అధికార కాంగ్రెస్ , ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మధ్య సాగుతున్న రాజకీయం ఒక ఆసక్తికరమైన మలుపు తీసుకుంది. రాష్ట్ర రాజకీయాల్లో ప్రస్తుతం డైవర్షన్ అనే పదం మార్మోగిపోతోంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేయడం వెనుక ప్రభుత్వ ఉద్దేశ్యం కేవలం చర్చను మళ్లించడమేనని బీఆర్ఎస్ గట్టిగా నమ్ముతోంది. అయితే, ఇక్కడే ఒక విచిత్రమైన పరిస్థితి నెలకొంది. ఇది డైవర్షన్ అని ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు కూడా, చివరకు అదే అంశంపై చర్చించేలా కాంగ్రెస్ తన వ్యూహాన్ని అమలు చేయడంలో సఫలమైంది. సిట్ నోటీసులు, విచారణలు, అరెస్టుల చుట్టూనే రాజకీయం తిరుగుతుండడంతో..

మిగతా 02లో

- మహాజాతరలో మూడో రోజు భక్తుల వెల్లువ
- సమ్మక్క—సారలమ్మ గద్దెల వద్ద కిలోమీటర్ల క్యూలు
- జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేసిన భక్తులు
- బంగారం, బెల్లం మొక్కులతో అమ్మవార్లకు కానుకలు
- పొరుగు రాష్ట్రాల నుంచి భారీగా తరలి వచ్చిన జనసంద్రం
- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సహా ప్రముఖుల దర్శనం
- సెల్‌ఫోన్ సిగ్నల్ లేక డిజిటల్ లావాదేవీలకు ఆటంకం
- ట్రాఫిక్ నియంత్రణలో గ్రూప్-వన్ ట్రైనీ అధికారుల సేవలు
- ఆర్టీసీ 4 వేల ప్రత్యేక బస్సులతో భక్తులకు సౌకర్యం
- నేడు వన ప్రవేశంతో జాతర ముగింపు ఘట్టం







# మొక్కుల మేడారం

శుక్రవారం లక్షకుపైగా దర్శించుకున్న భక్తులు



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
మేడారం.. భక్తిపారవశ్యంతో పులకరించింది. మహాజాతరలో మూడో రోజైన శుక్రవారం సమ్మక్క, సారలమ్మతో పాటు పగిడిద్దరాజు,గోవిందరాజును లక్షలాది మంది భక్తులు దర్శించుకున్నారు. వనదేవతల నామస్మరణ.. జయజయధ్వానాలతో మేడారం మార్మోగుతోంది. లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు తనివితీరా మొక్కులు చెల్లించుకొని తన్మయత్వం పొందుతున్నారు. సామాన్యులే కాదు పలు రంగాల ప్రముఖులు పలు పార్టీల నేతలు వనదేవతల దర్శనాలకు తరలి వస్తున్నారు. ప్రజలకు ప్రజా ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రోటోకాల్స్ సిబ్బంది విశేష సేవలు అందిస్తున్నారు. గద్దెలపై కొలువుదీరిన అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు తండోప తండాలుగా తరలిరాగా జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు.. వనదేవతలకు

మిగతా 02లో

## మళ్లీ రెండేళ్లకు..

నేడు మేడారం జాతర ముగింపు

వనదేవతల వీడ్కోలు, భక్తుల భావోద్వేగం!



## ఏపీకి తెలంగాణ నీటి హక్కులు

మాజీ మంత్రి హరీశ్ రావు



- పథకం ప్రకారమే ఏపిలోని పోలవరం - నల్లమలసాగర్ కు సర్కార్ సహకారం
- అందుకు సుప్రీంకోర్టులో చెల్లని రిట్ పిటిషన్ దాఖలు
- బనకచర్ల, నల్లమలపేర్లు మరినా జలదోపిడి ఆగలేదు

03



## హైదరాబాద్ బ్రాండ్

- 2035 నాటికి మరో రికార్డు
- అత్యంత వేగంగా అభివృద్ధి చెందిన నాలుగో నగరం
- కేంద్ర సర్వేలో వెల్లడి

02

## మహాత్ముడికి నివాళి



- బాపు ఘాట్ లో గాంధీ సమాధి వద్ద సర్వమత ప్రార్థనలు
- పాల్గొన్న గవర్నర్, మంత్రులు, ఉన్నతాధికారులు

03

## ప్రశంసలే గాని.. నిధులేవీ?

ఏపీ, తెలంగాణను మెచ్చుకున్న ఆర్థిక సర్వే

- ఫండ్స్ పై ముందే కేంద్రం చేతులెత్తేసిందా?
- ఆర్థిక సర్వేలో మెచ్చుకోలు.. బడ్జెట్‌లో నిధులపై మౌనం
- ద్రవ్యోల్బణం తగ్గుదలపై కేంద్రం కితాబులు
- మిషన్ కాకతీయ, కాళేశ్వరం ప్రాజెక్టులకు గుర్తింపు
- తెలంగాణను 'న్యూ బౌల్ ఆఫ్ ఇండియా'గా పేర్కొన్న రిపోర్ట్



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
ఆంధ్రప్రదేశ్,తెలంగాణ రాష్ట్రాలను ఎకనామిక్ సర్వేలో కేంద్రం మెచ్చుకుంది. అంతే.. రెండు తెలుగు రాష్ట్రాలకు ఇదే సంబురంగా మారింది. కానీ, ఇది నిజమైన ప్రశంసేనా అనే సందేహాలు కలుగుతున్నాయి. ఎందుకంటే.. కేంద్రం ఇచ్చే నిధుల విషయంలో ఈ రెండు రాష్ట్రాలకూ ఇప్పటివరకూ పెద్దగా ప్రయోజనాలేవీ కలిగించట్లేదు. దీంతో ఏపీ, తెలంగాణకు కేంద్రం బడ్జెట్‌లో షాక్ ఇవ్వబోతోందా? అనే అనుమానాలు కలుగుతున్నాయి.
తెలుగు రాష్ట్రాల విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ పరిస్థితి ఆర్థికంగా ఏమాత్రం బాగోలేదు. ప్రత్యేక హోదా వస్తుంది అనుకుంటే.. అప్పట్లో సీఎంగా ఉన్న చంద్రబాబు ప్రత్యేక ప్యాకేజీకి ఓకే చెప్పడంతో ప్రత్యేక హోదా అటకెక్కింది. పోనీ ప్యాకేజీ అయినా వచ్చిందా అంటే అదీ లేదు. అటు తెలంగాణకి కూడా అన్యాయం జరుగుతోంది. తెలంగాణ నుంచి భారీగా

మిగతా 02లో

## భారత్‌పై దాడికి కుట్ర.!?



- పాక్ సైన్యంలో అసంతృప్తి ప్రభావం
- చల్లార్చేందుకు భారత్‌పై కుయుక్తులు
- నిఘా వర్గాల అంచనా?

భారత్‌పై త్వరలో పాకిస్తాన్ దాడి చేయబోతోందా.. పుల్వామా తరహా దాడిని మించి దాడి చేయాలని కుట్ర చేస్తోందా.. దాడి ఎక్కడ చేయాలో ప్లాన్ చేస్తోందా అంటే అవుననే అంటున్నారు పాకిస్తాన్ సైన్యంలోని పరిణామాలను గమనిస్తున్న విశ్లేషకులు. పాక్ సైన్యంలో తీవ్ర అస్థిరత పెరుగుతోంది. ఇందుకు ప్రధాన కారణం ఇజ్రాయెల్ తరపున పాలస్తీనాకు వెళ్లి హమాస్ ఉగ్రవాదులను మట్టు పెట్టాలని ఒత్తిడి చేయడమే. అమెరికా ఆదేశాలతో ఇంటర్నేషనల్ స్టెబిలైజేషన్ ఫోర్స్‌లో పాల్గొనాలని, హమాస్‌పై చర్యలు తీసుకోవాలని ఒత్తిడి పెరుగుతోంది. సౌదీతో కలిసి పనిచేయబోతున్నామని ముదుగా చెప్పి.. హమాస్‌కు వ్యతిరేకంగా పనిచేయించే ఆలోచన ఆరణంగా సైనికుల్లో ఆగ్రహం, అసంతృప్తి చేకెత్తిస్తున్నాయి. ప్రతినెలా సైనికుల మనోభావాలు సేకరించే నివేదికలు, దర్బార్ సమావేశాల్లో ఈ ఆందోళనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పాలస్తీనియన్లకు వ్యతిరేకంగా పనిచేయడం తమ సంస్కృతికి విరుద్ధమని సైనికులు భావిస్తున్నారు. దీన్ని డైవర్ట్ చేసేందుకు భారత్ పై దాడికి పాక్ సైన్యం కుట్ర చేస్తున్నట్టు నిఘావర్గాలు భావిస్తున్నాయి.

10



## రేవంత్ రెడ్డికి హార్వర్డ్ సర్టిఫికెట్

- వర్సిటీలో పొలిటికల్ కోర్సు పూర్తిచేసిన సీఎం
- ఐదు రోజుల పాటు తరగతులకు హాజరు
- శిక్షణ మెరుగైన పాలనకు ఉపయోగమన్న ముఖ్యమంత్రి

10

## ఇక ప్రచారం

- మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ముగింపు
- ఒక్కరోజే 7,403 నామినేషన్లు దాఖలు
- 2,996 వార్డులు – 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో పోరు

03



**టీ20 వరల్డ్ కప్ 2026 ప్రత్యేకతలు**

**వేగవంతమైన ఫార్మాట్ :**

ప్రతి జట్టుకు కేవలం 20 ఓవర్లు మాత్రమే ఉండటంతో మ్యాచ్‌లు చాలా ఫాస్ట్‌గా సాగుతాయి. తక్కువ సమయంలో ఎక్కువ ఎంటర్‌టైన్‌మెంట్ ఇవ్వడం టీ20 ప్రత్యేకత.

# డైవర్షన్ పాలి'ట్రిక్స్'

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ యంత్రాంగం మొత్తం ఇప్పుడు ఆ కేసును ఎదుర్కోవడంలోనే నిమగ్నమైపోయింది.

**బీఆర్ఎస్ మౌనం - కాంగ్రెస్ దూకుడు**

ఫిబ్రవరి 11న రాష్ట్రవ్యాప్తంగా 123 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ఎన్నికలు జరగనున్నాయి. వాస్తవానికి ఈ సమయానికి బీఆర్ఎస్ తన శ్రేణులను క్షేత్రస్థాయిలో సమాయత్తం చేయాలి. కానీ, పార్టీ అధినేత కేసీఆర్ నుండి ద్వితీయ శ్రేణి నేతల వరకు అందరి దృష్టి ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్ కేసుపైనే ఉంది. మరోవైపు, కాంగ్రెస్ మాత్రం చాలా నిశ్శబ్దంగా, పక్కా ప్రణాళికతో అడుగులు వేస్తోంది. ఇప్పటికే ఇన్‌చార్జుల నియామకం, క్షేత్రస్థాయి సర్వేలు పూర్తి చేసిన రేవంత్ రెడ్డి సర్కార్, బీఆర్ఎస్‌ను ఈ కేసులో బిజీగా ఉంచి, తాము గ్రౌండ్ లెవల్‌లో క్లీన్ స్వీప్ చేయాలనే ప్లాన్‌తో ఉన్నట్లు కనిపిస్తోంది.

**ట్యాపింగ్ వేడిలో అదృశ్యమైన ప్రజా సమస్యలు**

ఎన్నికల సమయంలో చర్చకు రావాల్సిన స్థానిక సమస్యలు, అభివృద్ధి పనులు ఇప్పుడు ఎక్కడా వినిపించడం లేదు. కాంగ్రెస్ విసిరిన ట్యాపింగ్ అస్త్రం బీఆర్ఎస్ చేతిలో ఉన్న ఇతర ఆయుధాలను నిర్వీర్యం చేసింది. సింగరేణి బొగ్గు కుంభకోణం లేదా ప్రభుత్వ వైఫల్యాల గురించి బీఆర్ఎస్ మాట్లాడదామనుకునే లోపే, సిట్ నోటీసులు వచ్చి చర్చా వేదికను మార్చేస్తున్నాయి. ఫలితంగా, బీఆర్ఎస్ డిఫెన్సివ్ మోడ్‌లోకి వెళ్లక తప్పడం లేదు. ఇది పరోక్షంగా కాంగ్రెస్‌కు ఎన్నికల ప్రచారంలో ఒక అడ్వాంటేజ్‌గా మారుతోంది.

**సవాల్‌గా మారిన ప్రస్తుత రాజకీయం**

కేసీఆర్‌కు నోటీసులు అందడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఒక రకమైన ఆందోళన మొదలైంది. ఎన్నికలకు కేవలం రెండు వారాల ముందు పార్టీ అధినేత విచారణను ఎదుర్కోవాల్సి రావడం క్యాడర్ నైతిక బలాన్ని దెబ్బతీసే అవకాశం ఉంది. రాజకీయంగా దీనిని వేధింపులు అని ప్రచారం చేసినా, విచారణ ఎదుర్కోవడం అనేది అనివార్యంగా మారింది. ఈ పరిస్థితుల్లో బీఆర్ఎస్ అగ్ర నాయకత్వం కేవలం ఫోన్ ట్యాపింగ్ కేసుకే పరిమితం కాకుండా, ఎన్నికల వ్యూహాలను ఎలా సమన్వయం చేసుకుంటుందనేది ఇప్పుడు పెద్ద ప్రశ్న.

**విజయం ఎవరిని వరిస్తుంది?**

రాజకీయంగా చూస్తే, కాంగ్రెస్ ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్నట్లుగా వ్యవహరిస్తోంది. అటు పాత కేసుల ద్వారా బీఆర్ఎస్ ప్రతిష్టను దెబ్బతీయడం, ఇటు ఎన్నికల వేళ ప్రతిపక్షాన్ని ఆత్మరక్షణలో పడేయడం ద్వారా మున్సిపల్ పోరులో పైచేయి సాధించాలని చూస్తోంది. బీఆర్ఎస్ గనుక ఈ ట్రాప్ నుండి త్వరగా బయటపడి, ఎన్నికల ఎజెండాను మార్చలేకపోతే, మున్సిపల్ ఫలితాలు ఆ పార్టీకి కోలుకోలేని దెబ్బ అయ్యే ప్రమాదం ఉంది. డైవర్షన్ అని తెలిసినా, ఆ ఉచ్చులో పడకుండా తప్పించుకోవడం ఇప్పుడు బీఆర్ఎస్ ముందున్న అసలైన సవాల్.






## ప్రశంసలే గానీ.. నిధులేవీ?

(మొదటి పేజీ తరువాయి)

పన్నులను తీసుకుంటున్న కేంద్రం.. తిరిగి తెలంగాణకు ఆర్థిక సాయం చేసే విషయంలో, నిధులు ఇచ్చే విషయంలో దూరం పెడుతోంది. అఫ్‌కోర్స్ ఇందులో రాజకీయ కారణాలు కూడా ఉన్నాయి. ఈ రెండు రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో లేదు. ఏపీలో కూటమిలో భాగస్వామిగా ఉన్నా.. అంతంతమాత్రమే. తాము అధికారంలో ఉన్న రాష్ట్రాలు అభివృద్ధి చెందేలా బీజేపీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఈ క్రమంలో ఆర్థిక సర్వేలో ఏపీ, తెలంగాణను మెచ్చుకోవడం, అంతా బాగుందని చెప్పడం ద్వారా.. "మీకు కేంద్రం సాయం చెయ్యాల్సిన అవసరం లేదు" అనే సంకేతాలను ఇస్తున్నట్లు కనిపిస్తోంది. ఆర్థిక సర్వేలో ఏపీ, తెలంగాణ పరిస్థితి బాలేదు అని చెప్పి ఉంటే.. వెంటనే ఈ రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు.. బడ్జెట్‌లో తమకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని కోరతాయి. అందువల్ల కేంద్రం తెలివిగా.. ఈ రెండు రాష్ట్రాల పరిస్థితులూ బాగున్నాయి అని చెప్పడం ద్వారా.. బడ్జెట్ కంటే ముందే.. చేతులు దులుపుకుంటున్నట్లు కనిపిస్తోంది.

**మీరే బెటర్**

లోక్‌సభలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేని గనిస్తే.. 2026-27 ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీ వృద్ధి రేటు 6.8 నుంచి 7.2 శాతం మధ్య ఉంటుందని కేంద్రం అంచనా వేసింది. ఈ సర్వేలో తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌కి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చింది. రెండు రాష్ట్రాల్లో ద్రవ్యోల్బణం జాతీయ సగటు కంటే 1.72 శాతం తక్కువగా నమోదైందని తెలిపింది. తెలంగాణలో ద్రవ్యోల్బణం 8.61 శాతం నుంచి 0.20శాతానికి తగ్గగా.. ఆంధ్రప్రదేశ్‌లో 7.57శాతం నుంచి 1.39శాతానికి తగ్గిందని తెలిపింది. తెలంగాణలో సాగుకి అనుకూలమైన భూమి విస్తీర్ణం 2014-23 మధ్య 1.31 కోట్ల ఎకరాలుగా ఉండగా.. ఇప్పుడు 2.21 కోట్ల ఎకరాలకు పెరిగిందని సర్వే తెలిపింది. ఇందుకు మిషన్ కాకతీయ ద్వారా చెరువుల్ని పునరుద్ధరించడం, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగు నీరు కల్పించడం కారణమని కేంద్రం మెచ్చుకుంది. ఈ కారణంగా తెలంగాణ.. దేశంలోనే న్యూ బౌల్ ఆఫ్ ఇండియా (కొత్త ధాన్యపు గిన్నె)గా మారిందని రిపోర్ట్ తెలిపింది. 2025-26లో అకాల వర్షాలు, ప్రకృతి విపత్తుల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ధాన్య దిగుబడి తక్కువగా నమోదైందని సర్వే తెలిపింది.

**ఏపీలో కొత్త నగరాలకు ప్రశంస**

దేశంలో వస్తున్న కొత్త నగరాల జాబితాలో అంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని కేంద్రం చేర్చింది. దీన్ని గ్రీన్ సిటీగా నిర్మిస్తుండటాన్ని మెచ్చుకుంది. ఏపీ ప్రభుత్వం వ్యాపార సంస్కరణల్లో టాప్‌లో ఉందనీ, సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులు త్వరగా ఇస్తోందని చెప్పింది. 6,900 గ్రామాల్లో 81 లక్షల భూ కమతాలకు రీసర్వే చెయ్యడం, 86 వేల సరిహద్దు వివాదాల్ని పరిష్కారించడం, ప్రపంచ స్థాయి బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు వంటి అంశాల్ని ఆర్థిక సర్వే గొప్పగా చెప్పింది. ఈ సర్వే ప్రకారం.. హైదరాబాద్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో 4వ స్థానంలో నిలిచింది. 2035 నాటికి హైదరాబాద్ జీడీపీ 201.4 బిలియన్ డాలర్లకు చేరుకోవచ్చనీ, మున్సిపల్ బాండ్ల జారీలో దేశంలో నంబర్ వన్‌గా ఉందని ఆర్థిక సర్వే తెలిపింది. హైదరాబాద్-వరంగల్ మధ్య రీజినల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని సర్వే సూచించింది. ఐటీ, ఫైనాన్స్ సేవల్లో తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు కలిసి 40 శాతం వాటా కలిగి ఉండగా, ఏఐ స్టార్టప్‌లలో తెలంగాణ 7 శాతం వాటా కలిగి ఉందని రిపోర్ట్ తెలిపింది.

**బడ్జెట్ లో ఏమైనా ఉంటుందా..?**

మొత్తంగా అంతా బాగుంది అని రిపోర్టులో చెప్పారు కాబట్టి.. బడ్జెట్‌లో తెలుగు రాష్ట్రాలకు ప్రాధాన్యం ఉంటుందా అనే సందేహా కలుగుతోంది. మరోవైపు ఈ రిపోర్టులో కాళేశ్వరం, మిషన్ కాకతీయలను కేంద్రం మెచ్చుకోవడం ద్వారా.. బీఆర్ఎస్‌కి ప్లస్ అయ్యింది. ఇటీవల బీజేపీ, బీఆర్ఎస్ మధ్య రహస్య పొత్తు ఉందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈ ఆరోపణలకు బలం ఇస్తున్నట్లుగా ఆర్థిక సర్వే ఉంది అని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. మరోవైపు తమ హయాంలో ఉన్న ప్రాజెక్టులు ఎంత గొప్పవో ఆర్థిక సర్వే బయటపెట్టిందని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. ఇలా ఈ రిపోర్ట్.. చర్చగా మారింది.

# హైదరాబాద్ బ్రాండ్

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

అభివృద్ధి విషయంలో మన హైదరాబాద్ నగరం దూసుకుపోతోంది. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న భారతీయ నగరాల్లో భాగ్యనగరం నాలుగో స్థానం దక్కించుకుంది. 2035 నాటికి మన భాగ్యనగరం జీడీపీ 201.4 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని తాజాగా కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే అంచనా వేసింది. మున్సిపల్ బాండ్ల జారీలోనూ హైదరాబాద్ అగ్రస్థానంలో నిలిచి, మన నగరం భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తోంది. విజయవాడ కూడా టాప్ టెన్ లో చోటు దక్కించుకుంది.ముందు మూడు స్థానాల్లో సూరత్, ఆగ్రా, బెంగళూరు నగరాలు ఉన్నాయి.

హైదరాబాద్ నగరం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న భారతీయ నగరాలలో హైదరాబాద్ నాలుగో స్థానంలో నిలిచింది. 2035 నాటికి భాగ్యనగరం జీడీపీ 8.47% వార్షిక వృద్ధితో 201.4



బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. పార్లమెంట్‌లో గురువారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే 2025-26 ప్రకారం..సెప్టెంబరు 2025 వరకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ దేశంలోనే అత్యధికంగా రూ.500 కోట్ల మున్సిపల్ బాండ్లను జారీ చేసి, ఈ విషయంలో అగ్రస్థానంలో నిలిచింది. ఈ సర్వే ప్రకారం.. 2018లో 50 బిలియన్ డాలర్లుగా ఉన్న హైదరాబాద్ జీడీపీ, 2035 నాటికి 201.4 బిలియన్ డాలర్లకు చేరుకుంటుంది. సూరత్, ఆగ్రా, బెంగళూరు నగరాలు మాత్రమే హైదరాబాద్ నగరం కంటే వేగంగా అభివృద్ధి చెందుతాయని, వాటి వృద్ధి రేట్లు వరుసగా 9.17%, 8.58%, 8.50%గా ఉంటాయని అంచనా వేసింది. అలాగే, ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ కూడా వేగంగా అభివృద్ధి చెందుతున్న మొదటి పది నగరాలలో ఒకటిగా నిలుస్తుందని ఆర్థిక సర్వే పేర్కొంది. దీని జీడీపీ వృద్ధి రేటు 8.17%గా ఉంటుందని అంచనా వేసింది. 2018లో 5.6 బిలియన్ డాలర్లుగా ఉన్న విజయవాడ ఆర్థిక వ్యవస్థ.. 2035 నాటికి 21 బిలియన్ డాలర్లకు చేరుకుంటుంది. ఇక, మున్సిపల్ బాండ్ల సమీకరణలో హైదరాబాద్ తర్వాత రూ.400 కోట్ల బాండ్లను జారీ చేసి అహ్మదాబాద్ రెండో స్థానంలో నిలిచింది.

**హైదరాబాద్ ఆర్థిక వృద్ధి..**

2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారాలనే తెలంగాణ రాష్ట్రం లక్ష్యానికి అనుగుణంగా ఉంది. ఈ లక్ష్యాన్ని సాధించడంలో భాగ్యనగరం కీలక పాత్ర పోషిస్తుంది. తెలంగాణ పారిశ్రామిక రంగంలో కూడా బలమైన పునాదిని కలిగి ఉంది. భారతదేశ మొత్తం తయారీ రంగ ఉపాధిలో దాదాపు 5% వాటాను తెలంగాణ కలిగి ఉంది. ఇది జాతీయ పారిశ్రామిక రంగంలో రాష్ట్రానికి పెరుగుతున్న ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. తయారీ రంగంతో పాటు, సేవల రంగంలో కూడా తెలంగాణ గణనీయమైన కృషి చేస్తోంది. ముఖ్యంగా సమాచార సాంకేతికత (IT), ఆర్థిక సేవలు, వృత్తిపరమైన సేవలు వంటి అధిక ఉత్పాదకత కలిగిన రంగాలలో రాష్ట్రం ముందుంది. భారతదేశంలోని మొత్తం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) స్టార్టప్‌లలో దాదాపు 7% హైదరాబాద్‌లో ఉన్నాయి. ఇది హైదరాబాద్‌ను టెక్నాలజీ, ఆవిష్కరణల కేంద్రంగా నిలబెడుతుంది.

**ద్రవ్యోల్బణం తక్కువే**

ఇక, ద్రవ్యోల్బణం విషయానికి వస్తే తెలుగు రాష్ట్రాల్లో జాతీయ సగటు కంటే తక్కువ ఉన్నట్టు ఆర్థిక సర్వే వివరించింది. జాతీయ సగటు 1.73 శాతం కాగా.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో దీని కంటే 0.20 శాతం తక్కువగా ఉన్నట్టు తెలిపింది.

# కేసీఆర్‌కు మళ్లీ నోటీసులు

**మాజీ సీఎం మెడకు ఫోన్ ట్యాపింగ్ ఉచ్చు**

**నేడు మరోసారి నోటీసులు ఇవ్వనున్న సిట్**

**న్యాయనిపుణులతో దర్యాప్తు బృందం భేటీ**

**ప్రశ్నలు సిద్ధం చేసుకున్న అధికారులు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

రాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తోన్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం.. మాజీ సీఎం కేసీఆర్ మెడకు చుట్టుకున్నట్లు తెలుస్తున్నది. ఇప్పటికే ఈ వ్యవహారంలో పలువురు పోలీసు మాజీ ఉన్నతాధికారులు, మంత్రులు, నాయకులను విచారించిన సిట్ అధికారులు.. తుది దశలో కేసీఆర్ ను విచారించేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో ఈ నెల 29న హైదరాబాద్ లోని నంది నగర్ లో ఎన్న కేసీఆర్ ఇంటికి వెళ్లిన అధికారులు.. ఈ నెల 30న విచారణకు సిద్ధంగా ఉండాలని కోరారు. కానీ అదే రోజు రాత్రి విచారణను వాయిదా వేయాలని కేసీఆర్.. సిట్ అధికారులకు లేఖ రాశారు. మున్సిపల్ ఎన్నికలు, నామినేషన్ల పర్వం కొనసాగున్న వేళ నేడు విచారణకు హాజరు కాలేనని లేఖలో పేర్కొన్నారు. తనకు కాస్త సమయం కావాలని కోరారు. ఎర్రవెల్లిలోని ఫామ్‌హౌజ్‌లోనే విచారణ చేసుకోవచ్చని తెలిపారు. బాధ్యత గల పౌరుడిగా విచారణకు సహకరిస్తానని అన్నారు. దీంతో కేసీఆర్ కు సిట్ అధికారులు మినహాయింపు ఇస్తారనే ప్రచారం జరిగింది. కానీ అనూహ్యంగా సిట్ అధికారులు శుక్రవారం సాయంత్రం న్యాయ నిపుణులతో భేటీ అయ్యారు. ఇందులో కీలక అంశాలపై చర్చలు జరిపారు. మరోవైపు కేసీఆర్‌ను ఎక్కడ విచారణ జరపాలనే అంశంపై ఇప్పటికే ఒక అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. న్యాయ సలహాల తర్వాత కొత్త తేదీతో నేడు రెండోసారి నోటీసులు ఇవ్వడానికి నిర్ణయించినట్లు సమాచారం.

**'సిట్' ప్రశ్నాస్త్రం**

కేసీఆర్ ను విచారించేందుకు సిద్ధమవుతోన్న సిట్... ఆయన్ను అడగాల్సిన ప్రశ్నలు సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది. ఈ కేసులో ప్రధాన సూత్రధారి ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును రిటైర్ అయిన తర్వాత మళ్లీ అదే స్థానంలో ఓఎస్డీగా ఎలా నియమించారు? రిటైరైన అధికారికి ఇంటెలిజెన్స్ విభాగం బాధ్యతలు ఎందుకు అప్పగించారు? రాధాకిషన్‌రావు రిటైరైన తర్వాత కూడా ఏళ్ల తరబడి కొనసాగడానికి కారణాలేమిటి? ఇవి పోలీసు ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయాలా? లేక మీరు చెబితేనే వారు ఆదేశాలిచ్చారా?' తదితర ప్రశ్నలు కేసీఆర్‌కు సంధించేందుకు సిద్ధమయ్యారు. కేసీఆర్ విచారణ తర్వాత తుది ఛార్జ్‌షీట్ దాఖలు చేయనున్నారు. దీనికి ముందే మరోసారి కేటీఆర్, హరీశ్, సంతోష్‌ను సిట్ విచారించొచ్చని తెలుస్తోంది.



# మొక్కుల మేడారం

(మొదటి పేజీ తరువాయి)

పసుపు, కుంకమలు, గాజులు, చీర సారెలను సమర్పిస్తున్నారు. బంగారాన్ని కానుకగా సమర్పించి మొక్కు లు చెల్లించుకుంటున్నారు. భక్తులందరూ మేడారంలోని జంపన్నవాగు, చిలకలగుట్ట, నార్లపూర్ తదితర ప్రాంతాల్లోని చెట్ల కింద విడిది చేస్తున్నారు. బెల్లం మొక్కులే కాదు.. ఎదుర్కోళ్ళ ఆచారం కూడా ఉంది. అందుకే అమ్మవారికి కోడిని సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్నారు భక్తులు. మేడారం పరిసరాల్లో ఎటు చూసినా ఆధ్యాత్మిక శోభ కనిపిస్తోంది. 8 కిలోమీటర్ల దూరం వరకు భక్తులు కనిపిస్తున్నారు. తెలంగాణలోని అన్ని ప్రాంతాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలు ఏపీ, ఛత్తీస్గఢ్ మహారాష్ట్రాల నుంచి భక్తులు తరలి వస్తున్నారు.అనూహ్యంగా పెరిగిన భక్తులతో మేడారంలోని ప్రధాన దారులన్నీ వాహనాలతో కిక్కిరిసి పోయాయి. లక్షలాది మంది భక్తులు కోళ్లు, మేకలు బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ జాతరలో కోయ ధరలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. జాతకాలు చెప్పడంతో పాటు తాయత్తులు కడుతున్నారు. గాలి ధూళి సోకకుండా మూలికలు ఇస్తున్నారు. శుక్రవారం దేశంలోని అనేకమంది మంత్రులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు వన దేవతల ఆశీస్సులు పొందారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, మంత్రి 'సీతక్క కుటుంబ సమేతంగా అమ్మవార్ల దర్శనం చేసుకున్నారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సైతం అమ్మవారి దర్శనం చేసుకున్నారు. వీరితో పాటు ఎంపీ బలరాం నాయక్, పినపాక ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్, భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ ,పొలిటికల్ ఎకనామిక్ అడ్వైజర్ నళిని రఘురాం, రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా అమ్మ వార్లకు మొక్కులు చెల్లించారు. జాగృతి అధ్యక్షురాలు కవిత వనదేవతలను దర్శించుకున్నారు. అక్కడే మకాం వేసిన మంత్రి సీతక్క ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ.... భక్తులను పలకరిస్తున్నారు. మేళారం జాతరకు రద్దీ పెరగడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సెల్ ఫోన్ సిగ్నల్స్ లేకపోవడంతో కనెక్టివిటీకి ఇబ్బంది అవుతుందని వాపోతున్నారు. మరోవైపు డిజిటల్ లావాదీవీల పైన సిగ్నల్ ఎఫెక్ట్ పడింది. ఏటీఎంలో అందుబాటులో లేకపోవడం డిజిటల్ లావాదేవీలు జరగకపోవడంతో వ్యాపారులు భక్తులను నగదు కొరత వేధిస్తోంది. పకడ్బందీ నిఘా వ్యవస్థతో మహాజాతర కొనసాగుతోంది. లక్షలాదిగా తరలి వస్తున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి సిసీ కెమెరాలను అనుక్షణం పర్యవేక్షిస్తున్నారు పోలీస్ ఉన్నతాధికారులు. కాగా ఈ జాతరలో గ్రూప్ వన్ ట్రైనీ ఆఫీసర్లు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. భక్తుల రద్దీ నియంత్రణ గద్దల వద్ద పర్యవేక్షణ ట్రాఫిక్ విధుల్లో గ్రూప్ వన్ ట్రైనీ ఆఫీసర్లు భాగమయ్యారు. స్థానిక పోలీసులు ఆర్టిసి రెవెన్యూ విభాగాలతో సమన్వయం చేసుకుంటూ మహాజాతర నిర్వహణ ఎలా జరుగుతుందో ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నారు. మరోవైపు వనజాతరలో ఆర్టీసీ కీలక పాత్ర పోషిస్తోంది. జాతరకు తరలి వెళ్లే భక్తుల కోసం 4వేల ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

నేడు వనంలోకి దేవతలు..

మేడారం సమ్మక్క సారలమ్మ జాతర చివరి అంకానికి చేరుకున్నది. మూడు రోజుల పాటు కన్నులపండువగా జరిగిన ఈ జాతరలో కోటిన్నర మందికి పైగా భక్తులు వనదేవతలను దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. గత రెండు రోజుల పాటు భక్తులకు దర్శనం ఇచ్చిన సమ్మక్క సారలమ్మ ప్రత్యేక పూజల తర్వాత నేడు వన ప్రవేశం చేయనున్నారు. సమ్మక్కను చిలుకల గుట్టకు, సారలమ్మను కన్నెపల్లికి తరలించనున్నారు. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దేవతల వన ప్రవేశంతో జాతర నేటిలో ముగియనుంది.

## మళ్లీ రెండేళ్లకు..

**ముద్ర, మేడారం:** ఈ ఏడాది మేడారం సమ్మక్క సారలమ్మ జాతర జనవరి 28 నుంచి 31 వరకూ.. వనదేవతలు గద్దెలపైకి రావడంతో భక్తుల రద్దీ పెరిగింది. బారీగా బారులు తీరి అమ్మలను దర్శించుకుంటున్నారు. మూడో రోజు మొత్తం భక్తులు మొక్కులు చెల్లిస్తారు. ఇక నాలుగో రోజు వనదేవతలు తిరిగి అడవిలోకి వెళ్లడంతో జాతర ముగుస్తుంది. దీనిని వనప్రవేశం అంటారు. జనవరి 31 శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో వనప్రవేశం జరుగుతుంది. సమ్మక్క చిలకలగుట్టకు, సారలమ్మను కన్నెపల్లికి తిరిగి వెళతారు. పగిడిద్ద రాజు, గోవిందరాజు కూడా తమ స్థానాలకు తిరిగి వెళ్లిపోతారు. చివరి రోజు మొక్కులు చెల్లించి వనదేవతలకు వీడ్కోలు పలుకుతారు..దేవతల వనప్రవేశంతో గద్దెలు ఖాళీ అవుతాయి. జాతర పరిసమాప్తం అవుతుంది. ఈ ఘట్టం అత్యంత భావోద్వేగభరింతగా ఉంటుంది. మళ్లీ రెండేళ్ల వరకూ వేచి చూస్తారు భక్తులు మేడారం జాతర రెండేళ్లకోసారి జరుగుతుంది కాబట్టి 2026 తర్వాత 2028లో జరుగుతుంది. ఏటా మాఘమాసంలో పౌర్ణమి ముందు వచ్చే నాలుగు రోజుల పాటూ జాతరజరుగుతుంది. ఎక్కువగా మేడారం జాతర ఫిబ్రవరి నెలలో ఉంటుంది. పూజారుల సంఘం ముందుగా తేదీలు నిర్ణయిస్తారు. ఈ ఏడాది తెలుగు నెలలు అధికమాసం వచ్చాయి కాబట్టి మళ్లీ జాతర ఎప్పుడు జరుగుతుంది? ఈ జాతర రెండు సంవత్సరాలకు ఒకసారి జరుగుతుంది కాబట్టి, 2026 తర్వాత 2028లో జరుగుతుంది. ఖచ్చితమైన తేదీలు ఇంకా అధికారికంగా ప్రకటించలేదు, కానీ సాధారణంగా మాఘ మాసంలో జనవరి లేదా ఫిబ్రవరిలో ఉంటుంది. పూజారుల సంఘం తేదీలు నిర్ణయిస్తుంది. మునుపటి జాతరలు ఎక్కువగా ఫిబ్రవరిలో జరిగేవి.. ఈ ఏడాది పండుగలన్నీ ముందుగా రావడంతో మేడారం జాతర కూడా జనవరి ఆఖర్లోనే వచ్చేసింది. మళ్లీ 2026లో అధిక మాసం ఉంది.. జ్యేష్ఠం మాసం రెండు సార్లు వస్తుంది.. అధిక జ్యేష్ఠం, నిజ జ్యేష్ఠం...అంటే తెలుగు నెలలు 12 కాకుండా 13 ఉంటాయి.. ఈ లెక్కన మేడారం జాతర 2028లో ఫిబ్రవి ఆఖర్లో వచ్చే అవకాశం ఉంది. మేడారం జాతరలో కోయ గిరిజన సంస్కృతి ప్రత్యేకంగా కనిపిస్తుంది. కోయ తెగవారు డప్పులు వాయిస్తూ నృత్యాలు చేస్తారు. భక్తులు పసుపు, ఎరుపు రంగు దుస్తులు ధరిస్తారు. మహిళలు ఒడిబియ్యం పోస్తారు. జాతరలో జంపన్నవాగు పవిత్రమైనది. ఇది గోదావరికి ఉపనది. మేడారం వచ్చే భక్తులంతా ఇక్కడ స్నానాలు చేసి వనదేవతలను దర్శించుకుంటారు. తెలంగాణ కుంభమేళాగా పిలిచే మేడారం జాతర కోసం ప్రభుత్వం జాతరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తుంది. భద్రత కోసం ముందస్తు ఏర్పాట్లు చేస్తుంది. ఆర్థికపరంగా కూడా జాతరకు ప్రాముఖ్యత ఉంది. స్థానికులకు ఉపాధి కల్పిస్తుంది. జాతరలో మొక్కులు చెల్లించడం ప్రధానం. కొందరు కాలినడకన వస్తారు. మరికొందరు మూడు రోజుల పాటూ అక్కడే గుడారాలు ఏర్పాటు చేసుకుని వంటావార్పు చేసుకుంటారు.

**నేడు మేడారం జాతర ముగింపు**
**వనదేవతల వీడ్కోలు, భక్తుల భావోద్వేగం!**

మేడారం సమ్మక్క సారలమ్మ జాతర భారతదేశంలో అతిపెద్ద గిరిజన పండుగగా ప్రసిద్ధి చెందింది. తెలంగాణ రాష్ట్రం మలుగు జిల్లా మేడారం గ్రామంలో జరిగే ఈ జాతరను దక్షిణ భారత కుంభమేళా అని పలుస్తారు. ఈ పండుగ గిరిజనుల ఐక్యతకు, వారి సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెబుతుంది. 1996 మేడారం జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించారు. ఇప్పుడు ఇది యునెస్కో హెరిటేజ్ గుర్తింపునకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. భక్తుల ఉత్సాహం, దేవ తల ఆశీస్సులు, సంస్కృతి సమ్మేళనం అద్భుతం.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
31.01.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**టీ20 వరల్డ్ కప్ 2026 ప్రత్యేకతలు**

ప్రపంచ స్థాయి పోటీ : వివిధ దేశాల టాప్ క్రికెట్ జట్లు ఒకే వేదికపై తలపడతాయి. ఫ్యాన్స్‌కు నిజమైన గ్లోబల్ క్రికెట్ ఫెస్టివల్ అనుభూతి కలుగుతుంది.



## ఫైర్ సేఫ్టీపై దూకుడు పెంచిన హైడ్రా

- **రెండో రోజూ జీహెచ్ ఎంసీలో తనిఖీలు**
- **ఆరు దుకాణాలను సీజ్ చేసిన అధికారులు**

**ముద్ర, హైదరాబాద్:**

వరుస అగ్ని ప్రమాదాల నేపథ్యంలో ఫైర్ సేఫ్టీపై రెండో రోజూ శుక్రవారం కూడా జీహెచ్ఎంసీ, హైడ్రా, ఫైర్, విద్యుత్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేశారు. నిబంధనలను పట్టించుకోకుండా షాపులు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకున్నారు. సెల్లార్లను గోదాములుగా మార్చడాన్ని అధికారులు సీరియస్‌గా పరిగణిస్తున్నారు. కెమికల్, పెయింట్ డబ్బాలు నిలువ ఉంచడం, ఫర్నీచర్ తయారీ సామగ్రీతో పరిసరాలు నిండి ఉండడాన్ని అధికారులు గమనించారు. భవన అనుమతులు, ఫైర్ ధ్రువీకరణ పత్రాలు(ఫైర్ ఎన్‌వోసీలు) లేకపోవడాన్ని పలు భవనాల్లో గుర్తించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు మానవ ప్రమేయం లేకుండా.. ఆటోమేటిక్‌గా పని చేసే వాటర్ స్ప్రింక్లర్లు, స్మోక్ డిటెక్టర్లు లేకపోవడం.. ఫైర్ ఎక్స్టింగ్విషర్లు కానరాని పరిస్థితుల నేపథ్యంలో నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న 6 షాపులను అధికారులు సీజ్ చేశారు. షాపులుంటున్న భవనాలను గోదాములుగా మార్చరాదని చెబుతూ వస్తోంది. గోదాములు వేరే చోట పెట్టుకుని.. షాపుల్లో ఫర్నీచర్ ప్రదర్శన, అమ్మకాలు మాత్రమే ఉండేలా చూడాలని హైడ్రా చెబుతూ వస్తోంది.

**ఆరు ఫర్నీచర్ షాపులను సీజ్**

గచ్చిబౌలిలోని లుకింగ్ గుడ్ ఫర్నీచర్ షాప్ బిల్డింగ్ ను అధికారులు సీజ్ చేసిన అధికారులు. సెల్లార్లల్లో అగ్నిప్రమాదానికి ఆస్కారం ఉండే నిలువలు ఉంచినట్టు నిర్ధారించారు. పెయింట్ డబ్బులు, పరుపులు, బ్యాటరీలు, పెద్ద మొత్తంలో నిలువ ఉంచినట్టు గుర్తించారు. అనుమతి లేని భవనం తోడు ఫైర్ అనుమతులు కూడా లేని పరిస్థితి. సెల్లార్ల ర్యాంపులు మూసేసి స్టాక్ తో నింపినట్టు గుర్తించి చర్యలు తీసుకున్నారు. ఇదే పరిస్థితి కొంపల్లి క్రాస్ రోడ్స్ లోని అను ఫర్నిచర్ షో రూంలో కూడా నెలకొంది. కూకట్‌పల్లితో పాటు అత్తాపూర్‌లోని పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వేలో ఉన్న రోయల్ ఓక్ ఫర్నీచర్ షాపులు కూడా నిలువలు ప్రమాదకరంగా సెల్లార్లలో నింపేయడంతో అధికారులు సీజ్ చేశారు. ఉప్పల్ నాగోల్‌లోని బాంటియా ఫర్నీచర్ షోరూం, నాచారంలోని అను ఫర్నీచర్ షోరూంను సీజ్ చేసి బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈ షాపుల పరిసరాలు ఫైర్ సేఫ్టీ లేని ప్రాంతంగా పేర్కొంటూ బోర్డులు పెట్టారు.




# ముగిసిన నామినేషన్లు

- **నేడు పరిశీలన**
- **ఫిబ్రవరి 3న తుది జాబితా**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ గురువారంతో ముగిసింది. రాష్ట్ర వ్యాప్తంగా అభ్యర్థులు రిటర్నింగ్ అధికారుల వద్ద తమ నామినేషన్లు దాఖలు చేయగా, సాయంత్రం 5 గంటల వరకు కార్యాలయాల్లో ఉన్న అభ్యర్థుల పత్రాలను అధికారులు స్వీకరించారు. శుక్రవారం ఒక్కరోజే మొత్తం 7,403 నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ల పరిశీలన శనివారం జరగనుంది రాష్ట్ర వ్యాప్తంగా 2,996 వార్డులు, డివిజన్లకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లు ప్రజల తీర్పుకు వెళ్లనున్నాయి. ఫిబ్రవరి 1న అప్పీళ్లు స్వీకరించగా, వాటిపై ఫిబ్రవరి 2న అధికారులు తుది నిర్ణయం తీసుకోనున్నారు. అభ్యర్థుల ఉపసంహరణకు ఫిబ్రవరి 3 చివరి తేదీగా నిర్ణయించారు. అదే రోజు రిటర్నింగ్ అధికారులు తుది అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నారు.

**పోలింగ్ ఫిబ్రవరి 11న..**

మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ఫిబ్రవరి 11న జరగనుండగా, ఓట్ల లెక్కింపు ఫిబ్రవరి 13న నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల ఫలితాలు రాష్ట్రంలోని మున్సిపల్ రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపనున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికలు జరగనున్న పురపాలికల్లో మొత్తం 52,43,023 మంది ఓటర్లు ఉన్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. ఇందులో 26,80,014 మంది మహిళా ఓటర్లు., 25,62,369 మంది పురుషులు. 640 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నారు.



పట్టణ ప్రాంతాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లు సంఖ్యలో ముందుండటం ఈసారి ప్రత్యేకంగా ఆకర్షిస్తోంది. మున్సిపాలిటీలలో ఆదిలాబాద్ మున్సిపాలిటీలో అత్యధికంగా 1,43,655 మంది ఓటర్లు ఉండగా, అమరచింత మున్సిపాలిటీలో కేవలం 9,147 మంది ఓటర్లు మాత్రమే ఉండటం విశేషంగా మారింది.

# పరిహారమేదీ?

- **మృతులు, క్షతగాత్రుల పరిహారం, దర్యాప్తు కోరుతూ పిటీషన్**
- **'సిగాచీ' కంపెనీ, ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



గతేడాది జులై ఒకటో తేదిన సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి ఫార్మా కంపెనీ ప్రమాదంలో చనిపోయిన, గాయాలపాలైన వారికి పరిహారం అందజేత విషయంలో జరుగుతోన్న జాప్యంపై రాష్ట్ర హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఈ ప్రమాదంలో 56 మంది మృతి చెందగా, మరో ఎనిమిది మంది ఆచూకీ లభించలేదు. 28 మంది తీవ్ర గాయాలతో బయటపడ్డారు. అయితే మృతుల కుటుంబాలు, క్షతగాత్రులకు పరిహారం అందించడంతో పాటు, దర్యాప్తు కోసం సిట్ ఏర్పాటు చేయాలని హైదరాబాద్ కు చెందిన బాబురావు హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టు విచారణ జరిపింది. పరిహారం ఎంత ఇస్తామని చెప్పారు, ఎంత ఇస్తున్నారు, ఎప్పుడు ఇస్తారు అంటూ మండిపడింది. పరిహారం పంపిణీకి సంబంధించిన అంశాలపై కంపెనీ వివరణ ఇవ్వాలని, దానికి సంబంధించిన వివరాలను తెలియజేయాలని ఆదేశించింది. కంపెనీ ప్రకటించిన పరిహారంతో పాటు, చట్టప్రకారం అందాల్సిన పరిహారం వివరాలను సమర్పించాలని ఈపీఎఫ్ హైదరాబాద్ రీజినల్ కమిషనర్, ఈఎస్ఐ డైరెక్టర్, రాష్ట్ర ఔషధ నియంత్రణ మండళ్లను సుమోటో ప్రతివాదులుగా చేర్చి నోటీసులు జారీ చేసింది.



## దానంపై విచారణ వాయిదా

- **మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో 18న నిర్వహిస్తామన్న స్పీకర్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల కేసు విచారణ వాయిదా పడింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచి తర్వాత కాంగ్రెస్ లో చేరిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి దాఖలు చేసిన అనర్హత పిటిషన్లపై విచారణకు వచ్చే నెల 18న వాయిదా వేసినట్లు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ వెల్లడించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత కేసులో సుప్రీంకోర్టు విధించిన గడువు నేటితో ముగియనుండటంతో స్పీకర్ విచారణను వేగవంతం చేశారు. ఈ క్రమంలో గతంలో ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొన్న మెజారిటీ ఎమ్మెల్యేల పిటిషన్లను కొట్టేసిన స్పీకర్.. శుక్రవారం దానం నాగేందర్ ను విచారించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆయనకు నోటీసులు ఇచ్చారు. దీంతో దానం నాగేందర్ తన లీగల్ టీంతో అసెంబ్లీకి చేరుకోగా, పాడి కౌశిక్ రెడ్డి సైతం తన తరపు న్యాయవాదులతో అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో మున్సిపల్ ఎన్నికలు ఉన్నందున విచారణ వాయిదా వేయాలని ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పీకర్ ను కోరారు. దీంతో విచారణను వచ్చే నెల 18న వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. కాగా ఈ వ్యవహారంలో ముందు నుంచే తన వాణి వినిపిస్తున్న దానం... ఇప్పటికీ తాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనేనని చెప్పారు. ఇప్పటి వరకు తాను బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయలేదని, ఇప్పటికీ ఆ పార్టీలోనే కొనసాగుతున్నానని పేర్కొన్నారు. 2024 మార్చిలో తాను కాంగ్రెస్ సమావేశానికి హాజరైంది కేవలం వ్యక్తిగత హోదాలోనే తప్ప పార్టీ మారినట్లుగా కాదని తెలిపారు. ఈ క్రమంలో విచారణకు ముందే దానం స్పీకర్‌కు ఓ అఫిడవిట్ సమర్పించారు. చివరకు ఫిరాయింపు కేసు విషయంలో స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోననే చర్చ జరుగుతున్నది.

## ఫీజు రీయింబర్స్ మెంట్ పై జాప్యం దేనికి?

- **ప్రభుత్వాన్ని వివరణ కోరిన హైకోర్టు**
- **విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దు**
- **ప్రైవేట్ కాలేజీల తీరుపై హైకోర్టు సీరియస్**
- **సమస్య పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయండి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సాకుతో విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను నిలిపివేస్తున్న ప్రైవేటు కాలేజీల తీరుపై హైకోర్టుతీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఫీజులు రాలేదన్న కారణంతో విద్యార్థులను వేధించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు.. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. ఫీజు చెల్లించని కారణంగా సర్టిఫికెట్లు ఇవ్వని కాలేజీలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ హైకోర్టులో పలు విద్యార్థి సంఘాలు పిటీషన్ దాఖలు చేశాయి. శుక్రవారం వారి పిటిషన్లపై విచారణ చేపట్టిన కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. అసలు సర్కారు నుంచి రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఎన్ని..? వాటిని ఎప్పుడు చెల్లిస్తారు అనే అంశాలపై రెండు వారాల్లో పూర్తి వివరణ ఇవ్వాలని హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ ధర్మాసనం ప్రభుత్వాన్నిఆదేశించింది. ఫీజు బకాయిల కోసం విద్యార్థుల సర్టిఫికెట్లను తాకట్టు పెట్టుకునే హక్కు ఏ విద్యా సంస్థకూ లేదని కోర్టు తేల్చి చెప్పారు. సర్టిఫికెట్లు ఇవ్వకపోతే విద్యార్థుల భవిష్యత్తు, ఉద్యోగ అవకాశాలు దెబ్బతింటున్నాయని కోర్టు వ్యాఖ్యానించింది. కాలేజీల వేధింపులకు గురవుతున్న విద్యార్థులు తమ ఫిర్యాదులను చెప్పుకునేందుకు, తక్షణ పరిష్కారం కోసం ఓ ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం తరపు న్యాయవాదికి సూచించారు.



# మహాత్ముడికి నివాళి

- **బాపు ఘాట్ లో సర్వమత ప్రార్థనలు**
- **నివాళులర్పించిన గవర్నర్ మంత్రులు, ఉన్నతాధికారులు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం లంగర్ హౌస్ బాపు ఘాట్ లో గాంధీ సమాధి వద్ద సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు హర్కర వేణుగోపాల్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ గాంధీ సమాధి వద్ద పూల గుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సర్వమత ప్రార్థనలో పాల్గొని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ బోధించిన అహింస, సత్యం, సమానత్వ విలువలు నేటి సమాజానికి మరింత అవసరమని పేర్కొన్నారు. గాంధీజీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం అందరి బాధ్యత అన్నారు.



ఈ కార్యక్రమంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి, అడిషనల్ డీజీ మహేష్ భగవత్, అడిషనల్ సీపీ తాఫ్సీర్ ఇక్బాల్ , జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్, గోల్కొండ జోనల్ కమిషనర్ ముకుంద రెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యులు వి హనుమంతరావు, పర్యాటక, ఆర్ అండ్ బి , మెడికల్, జిహెచ్ఎంసి, విద్యుత్, విద్యా శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## వనదేవతలను దర్శించుకున్న గవర్నర్

**ముద్ర, మేడారం:**

మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మలను తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, సతీ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారిని మంత్రి సీతక్క గిరిజన సంప్రదాయాలతో ఆహ్వానించారు. మేడారం జాతర దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా నిలిచిన విధానాన్ని వారికి వివరించారు. వనదేవతలకు వారు ముక్కులు చెల్లించారు. గౌరవ చిహ్నంగా సాంప్రదాయ చీరలను అమ్మవార్లకు సమర్పించారు.



# మారింది పేర్లే..

- **ఏపీ జల దోపిడి ఆగలేదు**
- **తెలంగాణకు తీరని అన్యాయం**
- **మాజీ మంత్రి హరీశ్ రావు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

తెలంగాణ నీటి హక్కులను మొత్తంగా ఆంధ్రప్రదేశ్‌కు అప్పగించే ప్రయత్నం జరుగుతోందని మాజీ మంత్రి హరీష్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ సీఎం కేసీఆర్ నీటిని ఒడిసి పట్టుకుంటే.. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి ఆ నీటిని ఏపీకి జారవిడుస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రాంతం వాడే తెలంగాణకు ద్రోహం చేస్తున్నాడని కాళోజీ ముందే ఊహించి చెప్పినట్లే.. సీఎం హోదాలో రేవంత్ రెడ్డి రాష్ట్ర నీటిని ఆంధ్రాకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. పక్కా పథకం ప్రకారమే పోలవరం నల్లమల సాగర్ కు రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తోందన్న హరీశ్ రావు ఇందులో భాగంగానే సుప్రీంకోర్టులో చెల్లని రిట్ పిటిషన్ వేసి వాపస్ తెచ్చుకున్నారని ఎద్దేవా చేశారు. ఒక వేళ ఆ తప్పు జరిగితే తెలంగాణ నీటి చరిత్రలో నేడు ఒక బ్లాక్ డే గా మిగిలిపోతుందని వ్యాఖ్యానించారు. శుక్రవారం తెలంగాణ భవన్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. శుక్రవారం డిల్లీలో జరుగుతున్న నీటి పారుదల శాఖ సమావేశం సాక్షిగా రేవంత్ ప్రభుత్వం రాష్ట్రానికి మరణ శాసనం రాయబోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కమిటి వేసి ఏపీ జల దోపిడీకి రెడ్ కార్పెట్ వేశారన్నారు. టెండర్ చివరి తేదీ అయిపోయాక సుప్రీం కోర్టుకు వెళ్లి నల్లమల సాగర్ ప్రాజెక్టుకు పరోక్షంగా అంగీకారం తెలిపారని విమర్శించారు. పస లేని రిట్ వేసి పరిపూర్ణంగా నల్లమల సాగర్ కు మద్దతు ప్రకటిస్తే.. దానిని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వాపస్ తెచ్చుకున్నాడన్నారు. మంత్రి ఉత్తమ్ అప్రూవల్ తోనే లెటర్ వెళ్లినపుడు ఎలాంటి హామీ లేకుండా మీటింగ్ కు ఎందుకు వెళ్లారని మీడియా ముఖంగా నిలదీశారు. దీనిపై కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి నోరు విప్పాలన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
శనివారం 31.01.2026



మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

తెలంగాణ విద్యా రంగం నేడు కార్పొరేట్ విద్యా రాబందుల కబంధహస్తాల్లో చిక్కుకొని విలవిలలాడుతోంది. విద్యార్థుల ప్రాణాలు గాలిలో కలిసిపోతుంటే, రక్తాన్ని ఫీజుల రూపంలో జుర్రుకుంటున్నాయన్నది బహిరంగ రహస్యం. మంత్రి గారు అన్నట్లుగా 'బట్టీ' పద్ధతి అనేది విద్యార్థుల మేధస్సును గొంతు నులిమి

### అపవిత్ర పొత్తు.. పాలనాపరమైన గందరగోళం

కార్పొరేట్ సంస్థలకు మరియు ప్రభుత్వానికి మధ్య ఉన్న 'అపవిత్ర పొత్తు' (Unholy Alliance) వల్లనే ఇలాంటి గందరగోళ ప్రకటనలు బయటకు వస్తున్నాయి. ఎన్నికల సమయంలో విరాళాలు ఇచ్చే కార్పొరేట్ శక్తుల మెడలు వంచే ధైర్యం పాలకులకు లేనందువల్లే, ఇలాంటి మాటలగారడీతో ప్రజలను మభ్యపెడుతున్నారు. ప్రభుత్వమే స్వయంగా కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ, ప్రజల ముందు నీతులు వల్లించడం అత్యంత సిగ్గుచేటు. మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలు ప్రభుత్వంలోని అంతర్గత విభేదాలను కూడా బయటపెడుతున్నాయి. విద్యాశాఖ మంత్రిగా ఉన్న వ్యక్తి సమర్థుడు కాదని కోమటిరెడ్డి భావిస్తున్నారా? లేక ముఖ్యమంత్రి నాయకత్వంలో విద్యా వ్యవస్థ బాగుపడదని ఆయనకు నమ్మకం పోయిందా?

కుతుందో సమాధానం చెప్పాలి.

**మేధావుల వెట్టిచాకిరీ.. ప్రభుత్వ వైఫల్యం**

పీహెచ్‌డీలు చేసిన మేధావులు కూడా ఉద్యోగాలు లేక ఈ నరకకూపాల్లో వెట్టిచాకిరీ చేస్తున్నారంటే, అది ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో మరియు విద్యా రంగంలో ఉపాధిని కల్పించడంలో ఎంతగా విఫలమైందో చాటి చెబుతోంది. ప్రభుత్వం తన పరిధిలోని లెక్చరర్ పోస్టులను భర్తీ చేయకుండా, ఉన్నత విద్యావంతులను కార్పొరేట్ రాబందుల చేతికి చిక్కేలా చేస్తోంది. ఒకవైపు ప్రభుత్వం "మన ఊరు – మన బడి" వంటి పథకాలతో గొప్పలు చెప్పుకుంటూనే, మరోవైపు కార్పొరేట్ సంస్థల ఫీజుల దోపిడీని అదుపు చేయడానికి

# విద్యా మాఫియాకు
# సర్కారు ఊడిగం..!

వెంకగారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్
9848559863



## మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలు ఆవేదనలా? అధికార దాహమా?



కనీసం ఒక్క జీవో (G.O.) కూడా జారీ చేయలేక చేతులెత్తేస్తోంది. మంత్రి తన సొంత నిధులతో ఒక మోడల్ స్కూల్ కట్టినంత మాత్రాన రాష్ట్రంలోని లక్షలాది మంది పేద విద్యార్థుల సమస్య తీరిపోదు. అది కేవలం ఒక వ్యక్తిగత ఇమేజ్ కోసం చేసే ప్రయత్నం తప్ప, విధానపరమైన మార్పును తీసుకురాదు.

**బాధ్యతాయుతమైన పలాయనం.. విద్యా వైకల్యం**

అసలు విద్యాశాఖ మంత్రి బాధ్యతలు తీసుకోవడమే సమస్యకు పరిష్కారం అనుకుంటే, ప్రస్తుత కేబినెట్‌లో విద్యాశాఖ నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మంత్రి పరోక్షంగా ఒప్పుకున్నట్లే కదా! ఒక పక్క ప్రభుత్వ కాలేజీల్లో కనీసం ల్యాబ్ సౌకర్యాలు లేక, టాయిలెట్లు లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతుంటే, వాటిని బాగు చేయడం చేతకాని పాలకులు కార్పొరేట్ స్కూళ్లను మూసేస్తామని చెప్పడం కేవలం రాజకీయ విన్యాసం మాత్రమే. మూసివేత అనేది ఒక ప్రత్యామ్నాయం కాదు, అది కేవలం అసమర్థతను కప్పిపుచ్చుకునే సాకు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయకుండా ప్రైవేట్ సంస్థలను తిట్టడం అంటే.. చేతులు కాలాక ఆకులు పట్టుకోవడమే. ఈ ప్రకటనల వెనుక ఉన్న అసలు ఉద్దేశం విద్యారంగం మీద ప్రేమ కాదు, ప్రజల దృష్టిని మళ్లించే ఎత్తుగడ మాత్రమే

పాలకులు మాత్రం కేవలం ప్రసంగాలకే పరిమితమవుతున్నారు. ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలోని విద్యా వ్యవస్థ వైకల్యాన్ని బట్టబయలు చేయడమే కాకుండా, ప్రభుత్వ అసమర్థతను కళ్లకు కట్టాయి. "నాకు విద్యాశాఖ మంత్రిగా ఛాన్స్ వస్తే కార్పొరేట్ స్కూల్స్ అన్నింటినీ మూసేయిస్తా" అని ఆయన అనడం వినడానికి బాగానే ఉన్నా, అది ముమ్మాటికీ బాధ్యతల నుండి పలాయనం చిత్తగించడమే. ఒక కేబినెట్ మంత్రిగా ఉండి, వ్యవస్థలో దారుణాలు జరుగుతున్నాయని తెలిసి కూడా "శాఖ మారితేనే మారుస్తా" అనడం ప్రజలను వెర్రి వెంగళప్పలను చేయడమే అవుతుంది. ప్రభుత్వం అనేది ఒక సమిష్టి బాధ్యత. సమస్య తెలిసినప్పుడు క్యాబినెట్ లో గట్టిగా నిలదీయలేని మంత్రి, కేవలం పబ్లిసిటీ కోసం ఇలాంటి ప్రకటనలు చేయడం ఆయన రాజకీయ అసహాయతను లేదా పదవీ కాంక్షను సూచిస్తోంది.

**ర్యాంకుల ఫ్యాక్టరీలు.. మృత్యు కుహరాలు**

రాష్ట్రంలో నారాయణ, శ్రీచైతన్య వంటి విద్యా వ్యాపార సామ్రాజ్యాలు విద్యార్థుల

చంపేసే ఒక నెమ్మదైన విషప్రయోగం. లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తూ, పశువుల పాకల వంటి గదుల్లో విద్యార్థులను బంధించి, కేవలం ర్యాంకుల కోసం వారిని ఆత్మహత్యల వైపు ప్రేరేపిస్తుంటే సర్కారు ఎందుకు నిద్రపోతోంది? ఏటా పదుల సంఖ్యలో విద్యార్థులు ఫ్యాన్లకు ఉరితాళ్లతో వేలాడుతున్నా, అవే సంస్థలకు ప్రభుత్వం ఏటా అనుమతులు ఎలా మంజూరు చేస్తోంది? ఒకవైపు ఆ సంస్థల యజమానులను 'దొంగల'తో పోల్చిన మంత్రి, అదే సమయంలో ప్రభుత్వం వారికి ఎందుకు వత్తాసు పలు

### ప్రజల కళ్లలో దుమ్ము తుడిచే ప్రయత్నం

ఈ అస్పష్టత వల్ల అటు తల్లిదండ్రులు ప్రైవేట్ స్కూళ్ల ఫీజులు భరించలేక, ఇటు ప్రభుత్వ స్కూళ్లపై నమ్మకం లేక రెంటికీ చెడ్డ రేవడిలా మారుతున్నారు. ప్రభుత్వం తన ద్వంద్వ వైఖరిని వీడితే తప్ప ఈ విద్యా వైకల్యం నుంచి రాష్ట్రానికి విముక్తి లభించదు. ఒక వైపు కార్పొరేట్ మాఫియాను తిడుతూనే, మరోవైపు వారికి సకల సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వానికే చెల్లింది. ఈ రాజకీయ నాటకాలకు స్వస్తి పలికి, విద్యార్థుల ప్రాణాలకు విలువిచ్చేలా స్పష్టమైన విద్యా విధానాన్ని అమలు చేయాలి. లేదంటే, రాబోయే రోజుల్లో ఈ గందరగోళం విద్యా వ్యవస్థను పూర్తిగా అగాధంలోకి నెట్టడం ఖాయం. మంత్రి వ్యాఖ్యల వెనుక ఉన్న అసలు రహస్యం ప్రజలకు తెలుసు, అది ఆవేదన కాదు.. కేవలం తన రాజకీయ ఉనికిని చాటుకునే ప్రయత్నం మాత్రమే.

# మారుతున్న కాలం..
# క్షీణిస్తున్న ఆరోగ్యం!



మానవ నాగరికత పరిణామ క్రమంలో మనం సాధించిన సాంకేతిక పురోగతి అపారం. అరచేతిలోకి ప్రపంచం వచ్చింది, అంతరిక్షంలోకి అడుగులు పడ్డాయి. కానీ, ఈ క్రమంలో మనిషి తన ఉనికికి మూలమైన 'ఆరోగ్యాన్ని' మాత్రం పణంగా పెడుతున్నాడు. ఒకప్పుడు శతాయుష్షు అనేది సహజ సిద్ధమైన వరం. కానీ నేడు అరవై ఏళ్లు దాటడమే అద్భుతంగా మారుతోంది. "ఆరోగ్యమే మహాభాగ్యం" అన్న సూక్తి కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితమవుతోందా? అన్న అనుమానం కలగక మానదు. శారీరక దౌర్బల్యం, మానసిక ఒత్తిడి నేటి ఆధునిక మానవుడిని నీడలా వెంటాడుతున్నాయి.

**ఆహార విప్లవం - విషతుల్యమవుతున్న పళ్లెం**

ఒకప్పుడు మనం ఏం తినాలో ప్రకృతి నిర్ణయించేది. ఇప్పుడు మనం ఏం తినాలో కార్పొరేట్ ప్రకటనలు నిర్ణయిస్తున్నాయి. ఇది ఆహారపు అలవాట్లలో వచ్చిన అతిపెద్ద వైఫల్యం. శుద్ధి చేసిన ఆహారం పీచు పదార్థం లేని మైదా, అధిక చక్కెరలు, ప్రాసెస్ చేసిన నూనెలు మన జీర్ణవ్యవస్థను ధ్వంసం చేస్తున్నాయి. మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులు వయసుతో సంబంధం లేకుండా చుట్టుముడుతున్నాయి. ప్యాక్ చేసిన ఆహార పదార్థాలలో నిల్వ ఉండటానికి వాడే ప్రిజర్వేటివ్స్ మెల్లమెల్లగా మన శరీరంలోని అంతర్గత అవయవాలను నిర్వీర్యం చేస్తున్నాయి. స్థూలకాయం నేడు ఒక ప్రపంచ స్థాయి మహమ్మారిగా మారింది.

**యాంత్రిక జీవనం - కరువైన శ్రమ**

సాంకేతికత మన పనిని సులభతరం చేసింది. కానీ మన శరీరాలను సోమరిగా మార్చేసింది. గంటల తరబడి కంప్యూటర్ల ముందు కూర్చోవడం, కదలిక లేని జీవనశైలి వల్ల వెన్నునొప్పి, గుండె సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయి. శరీరానికి చెమట పట్టేలా శ్రమించడం అనేది విలాసంగా మారిపోయింది. వ్యాయామం అంటే కేవలం జిమ్‌లకు వెళ్లడమే కాదు, ప్రకృతిలో నడవడం, యోగా చేయడం వంటి సహజమైన పద్ధతులను మనం విస్మరిస్తున్నాం. రాత్రిపూట స్మార్ట్ ఫోన్ల వినియోగం మన నిద్ర చక్రం పై తీవ్ర ప్రభావం చూపుతోంది. గాఢ నిద్ర లేకపోవడం వల్ల మెదడు మొద్దుబారిపోవడమే కాకుండా, శరీర రోగనిరోధక శక్తి క్రమంగా క్షీణిస్తోంది.

**పరిష్కార మార్గం: మేలుకోక తప్పదు!**

మనం పోగొట్టుకున్న ఆరోగ్యాన్ని తిరిగి పొందాలంటే మూలాల్లోకి వెళ్లక తప్పదు. చిరుధాన్యాలు, ఆకుకూరలు, స్వచ్ఛమైన నీటిని మన ఆహారంలో ప్రధాన భాగం చేసుకోవాలి. వ్యాధి వచ్చాక వైద్యం చేయించుకోవడం కంటే, రాకుండా జాగ్రత్త పడటం ఉత్తమం. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. కాలుష్యాన్ని తగ్గించడం, పచ్చదనం మధ్య సమయాన్ని గడపడం వల్ల శరీరానికి సరిపడా ప్రాణవాయువు అందుతుంది.

ఆరోగ్యం అనేది మార్కెట్లో కొనుక్కునే వస్తువు కాదు.. అది మనం రోజూ పాటించే క్రమశిక్షణ వల్ల లభించే ఫలితం. ఆసుపత్రుల సంఖ్య పెరగడం అభివృద్ధికి సూచిక కాదు, ఆసుపత్రులకు వెళ్లే అవసరం లేని సమాజం ఉండటమే నిజమైన అభివృద్ధి. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు ఎన్ని అవగాహన కార్యక్రమాలు చేపట్టినా, వ్యక్తిగత బాధ్యత లేనిదే ఆరోగ్యం సాధ్యం కాదు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందన్న సత్యాన్ని గ్రహించి, సమాజం కోసం నేడే సరైన అడుగు వేద్దాం.

### మానసిక ఆరోగ్యం అదృశ్య సంక్షోభం

ఆరోగ్యం అంటే కేవలం శరీరం బాగుండటమే కాదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వచనం ప్రకారం, మానసిక ప్రశాంతత లేనిదే ఆరోగ్యం సంపూర్ణం కాదు.పోటీ ప్రపంచంలో విపరీతమైన ఒత్తిడి, ఒంటరితనం, ఆందోళన నేటి యువతను కుంగదీస్తున్నాయి.సామాజిక మాధ్యమాల మాయలో పడి నిజమైన మానవ సంబంధాలను కోల్పోతున్నాం. మనిషితో మనిషి మాట్లాడటం తగ్గడం వల్ల మానసిక సమస్యలు తీవ్రమవుతున్నాయి.



డా.కౌశల్ గోవర్ధన
ఏం.బి.బి.ఎస్, (ఎం.డి, ఇంటర్నల్ మెడిసిన్)
వైస్ చైర్మన్
శ్రీ రామానుజ సేవా ట్రస్ట్,
డా.ధనుంజయ హాస్పిటల్,
హైదారాబాద్

# కంప్యూటర్‌పై పని చేస్తున్నారా?.. అలా కూర్చుంటే సమస్యే!

ఆఫీస్ పని అయినా, వర్క్ ఫ్రమ్ హోమ్ అయినా ప్రస్తుతం చాలా మంది గంటల కొద్దీ కంప్యూటర్ల ముందే గడుపుతున్నారు. అయితే ఎక్కువ సమయం ఒకే పొజిషన్‌లో కూర్చోవడం, కూర్చునే విధానం సరిగా లేకపోవడం వల్ల దీర్ఘకాలంలో పలు ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశముందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా మెడ నొప్పి, వెన్నునొప్పి, కంటి ఒత్తిడి, చేతి మణికట్టు నొప్పులు వంటి సమస్యలు ఎక్కువవుతున్నట్లు చెబుతున్నారు.

కంప్యూటర్ ముందు కూర్చునే సమయంలో వెన్నెముక నిటారుగా ఉండేలా చూసుకోవాలని సూచిస్తున్నారు. కుర్చీకి సరైన బ్యాక్ సపోర్ట్ ఉండటం అవసరమని, పాదాలు నేలపై సమంగా ఉండేలా కూర్చోవాలని అంటున్నారు. అలాగే కంప్యూటర్ స్క్రీన్ కళ్ల స్థాయిలో ఉండటం వల్ల మెడపై ఒత్తిడి తగ్గుతుందని పేర్కొంటున్నారు.



టైపింగ్ చేసే సమయంలో చేతులు ఎక్కువగా వంగకుండా, మణికట్టులు సూటిగా ఉండేలా ఉంచాలని నిపుణులు సూచిస్తున్నారు. కీబోర్డ్, మౌస్‌ను శరీరానికి దగ్గరగా ఉంచడం వల్ల భుజాలకు ఒత్తిడి తగ్గుతుందని చెబుతున్నారు. అవసరమైతే రిస్ట్ ప్యాడ్ ఉపయోగించుకోవచ్చని పేర్కొంటున్నారు.

అలాగే ప్రతి గంటకు కనీసం ఐదు నిమిషాల విరామం తీసుకోవడం మంచిదని, కళ్లకు విశ్రాంతి ఇవ్వడానికి 20-20-20 నియమాన్ని పాటించాలని సూచిస్తున్నారు. తగినంత నీరు తాగడం, చిన్న స్ట్రెచింగ్ వ్యాయామాలు చేయడం ద్వారా అలసట తగ్గుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

చిన్నచిన్న జాగ్రత్తలు తీసుకుంటే కంప్యూటర్ పనితో వచ్చే ఆరోగ్య సమస్యలను చాలా వరకు నివారించవచ్చని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

# అరణ్య గర్భాన అస్తిత్వ సమరం..!

## ప్రపంచ ఆధ్యాత్మిక పటంలో ఆసియా ఖండపు మహా అద్భుతం మేడారం!

భారతీయ సాంస్కృతిక వైభవానికి రెండు ధృవతారలు ప్రయాగ్ కుంభమేళా మరియు మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర. ఉత్తర భారతాన త్రివేణి సంగమ తీరాన ఉప్పొంగే కుంభమేళా వైదిక ధర్మానికి, మోక్ష మార్గానికి పరాకాష్ఠ అయితే, దండకారణ్య అంతర్భాగంలో ప్రతిధ్వనించే మేడారం జాతర అణచివేతపై గెలిచిన అస్తిత్వ ఘోష. ప్రపంచవ్యాప్తంగా అనేక మతపరమైన ఉత్సవాలు జరుగుతున్నప్పటికీ, ఎటువంటి రాజ్యాంగబద్ధమైన ఆహ్వానాలు లేదా ప్రచార ఆర్భాటాలు లేకుండా, కేవలం జనపదాల మౌఖిక ప్రచారం ద్వారా కోట్ల మందిని ఏకం చేసే మేడారాన్ని "ఆసియా ఖండపు అతిపెద్ద జన విస్ఫోటనం" గా నేడు ప్రపంచ సాక్షిగా ఉద్ఘాటించాల్సిన అవసరం ఉంది. ఇది కేవలం ఒక పండుగ కాదు, ఇది ఆసియా ఖండపు మూలవాసుల పోరాట పటిమకు, ప్రకృతి ఆరాధనకు నిలువెత్తు సాక్ష్యం. నాగరికత ముసుగులో నేటి ప్రపంచం తన మూలాలను మర్చిపోతున్న వేళ, మేడారం గడ్డ మనిషికి, ప్రకృతికి మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని మళ్లీ గుర్తు చేస్తోంది.

కుంభమేళా పురాణాల్లోని అమృత బిందువుల కోసం సాగిన అన్వేషణకు ప్రతీక అయితే, మేడారం జాతర ఈ మట్టి మీద చిందిన నెత్తురు చుక్కల నుండి ఉద్భవించిన వీర చరిత్ర. 13వ శతాబ్దంలో కాకతీయ సామ్రాజ్యపు నిరంకుశ పన్నుల విధింపును ధిక్కరించి, తమ ప్రజల ప్రాణాలను, ఆత్మగౌరవాన్ని కాపాడటం కోసం రణరంగంలో వీరమరణం పొందిన వనితలు సమ్మక్క, సారలమ్మలు. వారి త్యాగం ఒక మతానికో, ఒక కులానికో పరిమితమైనది కాదు; అది సమస్త మానవాళి అన్యాయంపై చేసిన తిరుగుబాటుకు సంకేతం. కుంభమేళాలో మోక్షం కోసం గంగమ్మ ఒడిలో మునకలు వేస్తే, మేడారంలోని జంపన్న వాగులో స్నానం చేయడం అంటే తమ పూర్వీకుల ధైర్యాన్ని ఒంటబట్టించుకోవడమే. కుంభమేళా ఆధ్యాత్మిక అంతర్మథనం అయితే, మేడారం సామాజిక చైతన్య స్ఫూర్తి. ఈ చారిత్రక నేపథ్యమే మేడారాన్ని ప్రపంచంలోని ఇతర పండుగలకు భిన్నంగా నిలబెడుతోంది. దైవత్వం అనేది ఆకాశం నుండి ఊడిపడలేదు, అది సామాన్య ప్రజల కష్టాల నుండి, వారి పోరాటం నుండి ఉద్భవించిందని మేడారం నిరూపిస్తుంది.

మేడారం జాతర ప్రత్యేకత ఏమిటంటే, ఇక్కడ ప్రకృతిని మించిన దైవం లేదు. ఆధునిక ప్రపంచం పర్యావరణ పరిరక్షణ గురించి నేడు సిద్ధాంతాలు వల్లిస్తుంటే, మేడారం జాతర శతాబ్దాలుగా ప్రకృతితో మమేకమై ఎలా జీవించాలో ఆచరణాత్మకంగా చూపిస్తోంది. ఇక్కడ రాతి విగ్రహాలు ఉండవు, భారీ గోపురాలు ఉండవు. అడవిలోని చెట్ల కింద గద్దెలే దైవ స్వరూపాలు. భక్తులు సమర్పించే 'బంగారం' (బెల్లం) వెనుక ఉన్న తాత్వికత అద్భుతమైనది. తమ కష్టార్జితాన్ని, ప్రకృతి ప్రసాదించిన తీపిని దైవానికి అంకితం ఇవ్వడం ద్వారా గిరిజన జీనవశైలిలోని నిరాడంబరతను చాటిచెబుతారు. ఇది ఆసియా ఖండపు ప్రాచీన తెగల సామాజిక సంప్రదాయానికి నిలువెత్తు సాక్ష్యం. కోయ పూజారుల ఆధ్వర్యంలో అత్యంత నిగూఢంగా సాగే ఈ జాతర, ఆసియాలోని గిరిజన అస్తిత్వానికి ఒక తలమానికం. ఈ జాతరలో వినిపించే డప్పు వాయిద్యాలు, గిరిజన నృత్యాలు కేవలం వినోదం కోసం కాదు, అవి ఒక జాతి యొక్క జీవన లయను ప్రతిబింబిస్తాయి.

ఈ జాతర ప్రాముఖ్యత కేవలం భక్తికి మాత్రమే పరిమితం కాలేదు. ఇది ఒక సామాజిక విప్లవం. ఆసియా ఖండంలో గిరిజన తెగల ఉనికిని, వారి పోరాట పటిమను చాటిచెప్పే ఇంత పెద్ద కార్యక్రమం మరొకటి లేదు. కుంభమేళాలో సాధువులు, పీఠాధిపతులు ఎలాగైతే ఆధ్యాత్మిక దిశానిర్దేశం చేస్తారో, మేడారంలో సామాన్య గిరిజన పూజారులు ప్రకృతితో ఎలా మమేకమై జీవించాలో లోకానికి చాటిచెబుతారు. ఒకవైపు ఆధునికత ప్రపంచాన్ని చుట్టేస్తున్నా, నేటికీ కోట్లాది మంది ప్రజలు తమ మూలాలను వెతుక్కుంటూ



అడవి బాట పట్టడం ఆసియా ఖండపు సాంస్కృతిక బలాన్ని సూచిస్తుంది. ఇది కేవలం ఒక మతానికి సంబంధించినది కాదు, మానవజాతి చరిత్రలో అణచివేతపై గెలిచిన ధైర్యానికి సంబంధించినది. ఇన్ని కోట్ల మంది ప్రజలు ఎలాంటి గొడవలు లేకుండా, ప్రకృతి ఒడిలో ప్రశాంతంగా గడపడం అనేది ప్రపంచ దేశాలకు ఒక గొప్ప పాఠం.

ప్రయాగ్ కుంభమేళాకు యునెస్కో (UNESCO) వంటి అంతర్జాతీయ సంస్థల గుర్తింపు లభించినట్లే, మేడారం జాతరను కూడా "ఆసియా ఖండపు అమూర్త సాంస్కృతిక వారసత్వ సంపద" గా గుర్తించాలి. అప్పుడు మాత్రమే ఆసియాలోని గిరిజన తెగల చరిత్రకు, వారి అరుదైన ఆచారాలకు అంతర్జాతీయ స్థాయిలో గౌరవం లభిస్తుంది. భిన్నత్వంలో ఏకత్వానికి నిజమైన అర్థం మేడారంలో కనిపిస్తుంది. కులమతాల భేదం లేకుండా కోట్ల మంది ప్రజలు ఒకే వరుసలో నిలబడటం సామాజిక ప్రజాస్వామ్యానికి పరాకాష్ఠ. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాల ప్రజలు కూడా గర్వంగా జరుపుకునే ఈ పండుగ, భారతదేశపు అసలైన గుండె చప్పుడు. నేటి యాంత్రిక జీవనంలో మానవ సంబంధాలు మృగ్యమౌతున్న వేళ, మేడారం వంటి జాతరలు మనుషులను మళ్లీ మట్టికి, మమకారానికి చేరువ చేస్తున్నాయి.

ములుగు జిల్లాలోని ఈ దట్టమైన అరణ్యం కేవలం చెట్ల సమూహం కాదు, అది కోట్లాది మంది ఆశలకు, నమ్మకాలకు నిలయం. మేడారం జాతరను ఆసియా ఖండపు అద్భుతంగా ప్రపంచం గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది. అంతర్జాతీయ పర్యాటక రంగంలో ఈ జాతరను చేర్చడం ద్వారా గిరిజన కళలు, వారి వైద్య విధానాలు, జీవన శైలి ప్రపంచానికి పరిచయం అవుతాయి. ఇది కేవలం ఒక ఉత్సవం కాదు, తరతరాలుగా ప్రవహిస్తున్న భారతీయ జీవన స్రవంతి. మట్టిని ప్రేమించే మనస్తత్వం, అన్యాయాన్ని ఎదిరించే పౌరుషం ఉన్నంత కాలం సమ్మక్క-సారలమ్మల గాథ ఆసియా ఖండం గర్వించే మహా చరిత్రగా నిలిచిపోతుంది. అరణ్య గర్భాన ఉద్భవించిన ఈ జనసముద్రం, మానవ నాగరికతకు ఒక గొప్ప పాఠం. ప్రయాగ్ కుంభమేళా భారతదేశపు ఆధ్యాత్మిక ఆత్మ అయితే, మేడారం జాతర భారతదేశపు పోరాట పటిమకు దర్పణం. ఈ రెండు మహా సంగమాలు ఈ దేశపు భిన్నత్వాన్ని ఒకే దారంతో కట్టి ఉంచుతాయి. ఆసియా ఖండపు అస్తిత్వ ఘోషగా మేడారం ఎప్పటికీ చరిత్ర పుటల్లో వెలుగుతూనే ఉంటుంది

- వెంకగారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ 9848559863

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
31.01.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



టీ20 వరల్డ్ కప్ 2026 ప్రత్యేకతలు

స్టార్ ప్లేయర్ల షో:అంతర్జాతీయ స్థాయి బ్యాట్స్‌మెన్, బౌలర్లు తమ ప్రతిభను చాటుకునే పెద్ద స్టేజ్ ఇది. ఒక్క ఇన్నింగ్స్‌తోనే హీరోలు మారిపోతారు.

# ఎన్నికల సిబ్బందికి పక్కాగా ఏర్పాట్లు చేయండి

- - కలెక్టర్ ఆదర్శ సురభి

**ముద్ర, వనపర్తి:**

మున్సిపాలిటీ ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి అవసరమైన సామగ్రి పంపిణీతో పాటు ఓట్ల లెక్కింపు ప్రక్రియకు పక్కా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ ఆత్మకూరు, అమరచింత మున్సిపల్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారులు ప్రచురించిన ఎన్నికల నోటీస్ ఫారం-1ను ఆయన పరిశీలించారు.



**- నామినేషన్లకు చివరి రోజు..**

నామినేషన్ల స్వీకరణకు శుక్రవారమే చివరి రోజని కలెక్టర్ తెలిపారు. ఇంకా నామినేషన్ వేయాల్సిన అభ్యర్థులు సాయంత్రం 5 గంటల లోపు కేంద్రాలకు వచ్చి నామినేషన్లు దాఖలు చేయాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణ సమయంలో ఎన్నికల నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, స్వీకరించిన నామినేషన్ల వివరాలను ఎప్పటికప్పుడు 'టి-పోల్' వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులకు ఆదేశించారు.

**పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ..**

మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. హెల్ప్‌డెస్క్‌లో నామినేషన్లు దాఖలు చేయడానికి వచ్చే వారికి అవసరమైన సమాచారాన్ని అందించాలని, ఓటర్ జాబితాను కూడా అందుబాటులో ఉంచాలని సూచించారు.

**- కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్‌రూమ్ తనిఖీ**

ఆత్మకూరు పురపాలికకు సంబంధించి ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, అమరచింత పురపాలికకు సంబంధించి అమరచింత ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న ఎన్నికల సామగ్రి పంపిణీ, సేకరణ మరియు ఓట్ల లెక్కింపు కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ కోసం ఫిబ్రవరి 9వ తేదీ సాయంత్రం లోగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

**భద్రత, వసతులపై ప్రత్యేక దృష్టి**



రూట్ల వారీగా టెంట్లు ఏర్పాటు చేసి, వార్డు ఒక్కో టేబుల్ చొప్పున ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. విశాల ప్రదేశంలో సులభంగా అర్థమయ్యే విధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలో అవసరమైన అన్ని వసతులు కల్పించాలని, పటిష్టమైన బారికేడ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కళాశాలలోని స్ట్రాంగ్‌రూమ్‌ను స్వయంగా పరిశీలించిన కలెక్టర్, భద్రతా పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ యాదయ్య, డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఇతర రెవెన్యూ మరియు మున్సిపల్ అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

**నామినేషన్ల స్క్రూటినీ పకడ్బందీగా నిర్వహించాలి**

మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం సాయంత్రంతో ముగియగా శనివారం స్క్రూటినీ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రణాళికలు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అథారిటీ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ ఛాంబర్ నుండి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ప్రత్యేక అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. స్క్రూటినీ సందర్భంగా ఎలాంటి విషయాలను పరిశీలించాలి, గదిలోకి ఎంతమందిని అనుమతించాలి అనే విషయాలను వివరించారు. స్క్రూటినీ సందర్భంగా తిరస్కరణకు గురైన అభ్యర్థులు ఫిబ్రవరి ఒకటవ తేదీన ఆర్డీఓ కు అప్పీల్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.



## మహాత్మా గాంధీకి ఘనంగా నివాళులు

**ముద్ర, మెహదీపట్నం:**

జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి పురస్కరించుకొని ప్రముఖులు నివాళులర్పించారు. దక్షిణ భారతదేశంలో లంగర్ హౌస్ ప్రాంతంలో ఉన్న బాపూజీ ఏకైక సమాధి వద్ద గవర్నర్ విష్ణుదేవ్ వర్మ పుష్ప గుచ్ఛాలు సమర్పించారు. అనంతరం బాపూ ధ్యాన మందిరానికి వెళ్లి అక్కడ నిర్వహించిన సర్వమత ప్రార్థనలో పాల్గొన్నారు. తదుపరి బాపూ ఘాట్ ప్రాంగణంలో ఉన్న గాంధీజీ విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. అక్కడే దేశవ్యాప్త సామూహిక మౌనంలో పాల్గొన్నారు. మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళ్లు అర్పించిన వారిలో డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, వి.హనుమంతరావు, కలెక్టర్ హరిచందన, మహేష్ భగవత్, ఉస్మాన్ హాజ్రి, చంటిబాబు తదితరులు ఉన్నారు.



## పెండింగ్ ప్రజా సమస్యలను పరిష్కరించండి

- - కార్పొరేటర్ శ్రావణ్

**ముద్ర, మల్కాజిగిరి :**

మల్కాజిగిరి పరిధిలోని ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కార్పొరేటర్ శ్రావణ్, మల్కాజిగిరి డిప్యూటీ కమిషనర్ సుల్తానాకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జీహెచ్ఎంసీ మల్కాజిగిరి కార్యాలయంలో డీసీతోపాటు స్థానిక నాయకులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా కార్పొరేటర్ శ్రావణ్ మాట్లాడుతూ.. సర్కిళ్ల పునర్విభజన అనంతరం శానిటేషన్ పనితీరు పూర్తిగా దెబ్బతిందన్నారు. శానిటేషన్‌పై పూర్తిస్థాయిలో దృష్టిసారించి, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించాలని డిప్యూటీ కమిషనర్‌ను కోరారు. వీధి దీపాలకు సంబంధించి పాత అధికారి బదిలీ కావడంతో, నూతన ఏఈ కవితతో సమన్వయం చేసుకోవాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులతో కలిసి విద్యుత్ స్తంభాల తరలింపు, నూతన వీధి దీపాల పనితీరుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సర్కిల్ పరిధిలో దోమల బెడద తీవ్రంగా ఉన్నప్పటికీ ఫాగింగ్ ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయిందని వెంటనే పునరుద్ధరించాలని కోరారు. ఈ సమావేశంలో లక్ష్మణ్, జైకృష్ణ, నందు, మురళి, సంతోష్, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.



## నాయి బ్రాహ్మణుల సంక్షేమం కోసం కృషి చేస్తా

**- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి**



**ముద్ర, కాప్రా :**

నాయి బ్రాహ్మణుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా నాయి బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గ సభ్యులకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాయి బ్రాహ్మణ సామాజిక వర్గం సమాజంతో ముడిపడి ఉన్న గొప్ప సేవ అని ప్రశంసించారు. సంఘానికి సంబంధించిన ఏవైనా అవసరాలు తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కారం చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాసులు రెడ్డి, వంజరి ప్రవీణ్ కరిపే, గుమ్మడి జంపాల్ రెడ్డి, నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాచమల్ల బాలకృష్ణ, హెచ్‌బీ కాలనీ అధ్యక్షుడు రామకృష్ణ, కార్యదర్శి శేఖర్, కోశాధికారి దశరథ తదితరులు పాల్గొన్నారు.

## చెక్‌పోస్ట్ వద్ద రూ.4 లక్షల నగదు పట్టివేత

**ముద్ర, నారాయణపేట:**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నారాయణపేట మండలం జలాల్‌పూర్ చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు రూ.4 లక్షల 17వేల 200ల నగదును పట్టుకున్నారు. మున్సిపాలిటీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో నారాయణపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జలాల్‌పూర్ చెక్‌పోస్ట్ వద్ద ఎఫ్ఎస్‌టీ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం వాహనాల తనిఖీలు చేపట్టింది. ఈ తనిఖీల్లో యాదగిరి నుంచి నారాయణపేటకు వస్తున్న మహమ్మద్ యూనస్ వద్ద రూ.2 లక్షల 17వేల 200 నగదు, అలాగే అశోక్‌నగర్‌కు చెందిన నాగిరెడ్డి వద్ద రూ. 2లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నగదును కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ సెల్‌కు అప్పగించినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో పెద్ద మొత్తంలో నగదు, మద్యం, ఇతర విలువైన వస్తువులను తరలించడం ఎన్నికల నియమావళికి విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు.



## నేరాలపై ఉక్కుపాదం.. సైబరాబాద్ పోలీసుల వ్యూహం ఫలితం

**ముద్ర, శేరిలింగంపల్లి :**

సైబరాబాద్ పోలీసుల పటిష్ట పోలిసింగ్, నిరంతర నిఘా కారణంగా చైన్ స్నాచింగ్‌లు, ద్విచక్ర వాహనాల దొంగతనాలు, ఆలయాల్లో చోరీలు వంటి నేరాలు గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది గణనీయంగా తగ్గినట్లు సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డి తెలిపారు. నేరస్థులను కట్టడి చేయడంలో ప్రత్యేక వ్యూహంతో చేపట్టిన నిరంతర నిఘా ఆశించిన ఫలితాలను ఇచ్చిందని తెలిపారు. సైబరాబాద్ పరిధిలో వాహనాల అపహరణ జరిగిన వెంటనే కేసులు నమోదు చేసి, సాంకేతిక ఆధారాల విశ్లేషణతోపాటు పాత నేరస్తులపై నిఘా ఉంచి వారి కదలికలను గుర్తించి తక్షణమే అరెస్టులు చేస్తున్నట్లు డీసీపీ వివరించారు. ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, ఇతర రాష్ట్రాలకు వెళ్లి అంతర్రాష్ట్ర దొంగల ముఠాలను చాకచక్యంగా అదుపులోకి తీసుకుంటున్నట్లు తెలిపారు.



**మచ్చుకు కొన్ని కేసులు :**

కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడిన అంతర్రాష్ట్ర దొంగల ముఠాను కర్ణాటక రాష్ట్రంలోని బీదర్‌లో అరెస్ట్ చేశారు. దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 15కిలోల వెండి దొంగతనానికి పాల్పడిన అంతర్రాష్ట్ర ముఠాను రాజస్థాన్‌లో పట్టుకున్నారు. పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడిన ఢిల్లీకి చెందిన ముఠాను నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో అరెస్ట్ చేశారు. చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఖజానా జ్యువెలరీస్ దోపిడీ కేసులో పూణే(మహారాష్ట్ర), ఉత్తరప్రదేశ్, గుజరాత్, ఢిల్లీ, బీహార్ తదితర రాష్ట్రాల్లో గాలించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. జీడిమెట్లలో జరిగిన ఏటీఎం దొంగతనానికి సంబంధించిన అంతర్రాష్ట్ర ముఠాను హర్యానాలోని మేవాడ్ ప్రాంతంలో అరెస్ట్ చేశారు. కేపీహెచ్‌బీ పరిధిలో ఓ ఆలయంలో జరిగిన చోరీ కేసులోనూ అంతర్రాష్ట్ర ముఠాను పట్టుకుని దేవాలయానికి చెందిన సొత్తును రికవరీ చేశారు. అంతర్రాష్ట్ర దొంగలు ఎక్కడ దాక్కున్నా గుర్తించి అరెస్ట్ చేయడమే సైబరాబాద్ పోలీసుల పనితీరుకు నిదర్శనమని డీసీపీ ముత్యం రెడ్డి తెలిపారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని, ఏవైనా అనుమానాస్పద కదలికలు గమనిస్తే వెంటనే డయల్ 100, 112 లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.



## ప్రభుత్వ రంగ సంస్థల బలోపేతంతోనే కార్మికుల భవిష్యత్

- మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

**ముద్ర, కాప్రా :**

ప్రభుత్వ రంగ సంస్థలు ఆర్థికంగా బలోపేతం సాధించినప్పుడే కార్మికుల మనుగడ, సంక్షేమం సాధ్యమవుతుందని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్) మేనేజింగ్ డైరెక్టర్ అనురాగ్ కుమార్ పదవీ విరమణ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈసీఐఎల్ అభివృద్ధికి అనురాగ్ కుమార్ విశేషంగా కృషి చేశారని కొనియాడారు. ఈసందర్భంగా ఉప్పల్ మాజీ శాసనసభ్యుడు, జాతీయ నాయకుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ కంపెనీ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో అనురాగ్ కుమార్‌ను సత్కరించి, సంస్థ అభివృద్ధి, కార్మికుల సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎం. లక్ష్మణ్ గౌడ్, చర్లపల్లి నాదం, బాలకృష్ణ గౌడ్, మహేశ్వర్ రెడ్డి, ఈసీఐఎల్ బీఎంఎస్ కార్మిక సంఘం నాయకుడు సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



## మేళ్ల చెరువు లో హైడ్రా ఫెన్సింగ్

### ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టి పోయడంపై చర్యలు వ్యవసాయ పనులకు ఆటంకం లేకుండా కంచె నిర్మాణం

**ముద్ర, హైదరాబాద్ :**

సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ పరిధిలోని మేళ్ల చెరువులో మట్టి పోయకుండా హైడ్రా అధికారులు చర్యలు చేపట్టారు. 108 ఎకరాల విస్తీర్ణంలోని ఈ చెరువులో పెద్ద ఎత్తున మట్టి పోయడంతో నీటి నిల్వ సామర్థ్యం గణనీయంగా తగ్గిపోయిందని స్థానికులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అలాగే చెరువులోకి వరద నీరు రాకుండా ఇన్‌లెట్ల వద్ద ఎక్కడికక్కడ అడ్డంకులు ఏర్పాటు చేశారు. ఈ అంశంపై మెదక్ ఎంపీ ఎం.రఘునందన్ రావు కూడా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు లిఖితపూర్వకంగా వినతి అందజేశారు. ఫిర్యాదుల నేపథ్యంలో కమిషనర్ క్షేత్రస్థాయి పరిశీలనకు ఆదేశించారు. సంబంధిత శాఖలతో కలిసి నిర్వహించిన పరిశీలనలో వేల లారీల మట్టితోపాటు బండరాళ్లు కూడా చెరువులో నింపినట్లు వెల్లడైంది. 108 ఎకరాల వరకు ఉండాల్సిన చెరువు సగానికిపైగా మట్టితో నిండిపోయినట్లు హైడ్రా గుర్తించింది. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని భూమిలో పంటలు సాగు చేసుకోవచ్చు తప్ప, భూమి స్వరూపాన్ని మార్చరాదన్న నిబంధనలను ఉల్లంఘిస్తూ మట్టి నింపడాన్ని హైడ్రా తీవ్రంగా పరిగణించింది. చెరువులోకి వరద నీరు రాకుండా ఎత్తు పెంచడం, అడ్డుగోడలు నిర్మించడం తీవ్రమైన అంశంగా భావించిన అధికారులు శుక్రవారం ఉదయం వాటిని తొలగించారు. అలాగే చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వచ్చిన దాదాపు 40ఎకరాల భూమిలో మట్టి పోయకుండా వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఈ పనులను మధ్యాహ్నం లోపే పూర్తి చేశారు. ఇదే సమయంలో వ్యవసాయ పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా మార్గం చూపుతూ చర్యలు తీసుకున్నారు.




కేవలం మట్టి పోయకుండా మాత్రమే నియంత్రణ చర్యలు అమలు చేసినట్లు హైడ్రా అధికారులు తెలిపారు.



**టీ-20 వరల్డ్ కప్ 2026 ప్రత్యేకతలు**

**యంగ్ టాలెంట్ కు ఛాన్స్**

కొత్త ఆటగాళ్ల ప్రపంచానికి పరిచయం అయ్యే గొప్ప అవకాశం. చాలా మంది యువ క్రికెటర్లు ఇలాంటి టోర్నీల తోనే స్టార్‌లుగా ఎదుగుతారు.



## ‘చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి’




**ముద్ర, ఆదిలాబాద్:**

ఎస్ టియు (AIJCTO) పిలుపు మేరకు ఫిబ్రవరి 5న ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద జరిగే మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్ టియు టిఎస్ అదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు మూగ శ్రీనివాస్ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఎస్టీయు భవన్ అదిలాబాద్ నందు చలో పార్లమెంట్ కార్యక్రమం సన్నాహక సమావేశాన్ని నిర్వహించిన సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మూగ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు గొడ్డలిపెట్టుగా మారిన టెట్ పరీక్ష రెండు సంవత్సరాల లోపు ఉత్తీర్ణులు కావాలని నిబంధన విద్యా హక్కు చట్టానికి విరుద్ధంగా ఉందన్నారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో టెట్ నిబంధనలను సవరణ చేసి సీనియర్ ఉపాధ్యాయులకు (2009 సంవత్సరం లోపు నియామకమైన వారికి) మినహాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చలో పార్లమెంట్ కార్యక్రమంలో వేలాదిగా ఉపాధ్యాయులు పాల్గొని ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జాదవ్ రవికుమార్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జాదవ్, అశోక్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెజ్జంకి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎం అభ్యర్థులను గెలిపించండి..

**- సిపిఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ పిలుపు**



**ముద్ర, ఆదిలాబాద్:**

ఆదిలాబాద్ పురపాలక ఎన్నికల్లో సుందరయ్య నగర్ 15వ వార్డు రణదీవెనగర్ 18వ వార్డు నుండీ పోటీ చేస్తుందని, రెండు వార్డుల్లో ప్రజా సమస్యలపై నిత్యం పోరాడే అభ్యర్థులను నిలబెట్టామని సిపిఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ తెలిపారు. శుక్రవారం ఆదిలాబాద్ లో ఆయన మాట్లాడుతూ సిపిఎం అభ్యర్థులను ఆదిలాబాద్ మున్సిపాలిటీ పాలక వర్గంలోకి పంపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. లౌకిక భారత రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం ప్రజల ముందున్న తక్షణ కర్తవ్యమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అభ్యర్థులు అన్నమొల్ల పోసాని, జంజర్ల విజయ పార్టీ సీనియర్ నాయకులు లంక రాఘవులు, బండి దత్తాత్రి ,జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పూసం సచిన్, అన్నమొల్ల కిరణ్, నాయకులు కోవే శకుంతల, ఇందుబాయి తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీ పోరాటాలను చెరిపివేయాలనే బీజేపీ కుట్ర

**- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్**

**ముద్ర, కరీంనగర్:**

జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం కరీంనగర్ డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ హాజరై పలువురు నాయకులతో కలిసి గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ మోహన్ దాస్ కరం చంద్ గాంధీ ఈ దేశ స్వాతంత్రం కోసం ఎన్నో ఉద్యమాలు చేపట్టి రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని తరిమి కొట్టడంలో కీలకపాత్ర వహించారని అన్నారు. దేశంలోని ప్రజలందరినీ సంఘటితం చేసి అహింస మార్గంలో స్వాతంత్రాన్ని సాధించిన మహనీయుడు. గాంధీ చేసిన పోరాటాలు, ఉద్యమాలు, త్యాగాలను ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో దేశాలు గుర్తించి ఇప్పటికి



కీర్తిస్తున్నాయని తెలిపారు. కానీ ఈ దేశంలో భారతీయ జనతా పార్టీ మహాత్మా గాంధీ చేసిన పోరాటాలను ప్రజల హృదయాల నుండి చెరిపివేయాలని కుటీల ప్రయత్నాలు చేస్తుందని, ఆ ప్రయత్నాలను బిజెపి మానుకోవాలని అన్నారు. నాడు గాంధీ చేసిన సూచనలు సలహాల మేరకు ఈ దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది ముందంజలో ఉందని అన్నారు.

అనంతరం మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ మాట్లాడుతూ గాంధీ భారత దేశ స్వతంత్ర పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించడమే కాక ఆనాటి అన్ని వర్గాలను కూడాగట్టుకొని ఉప్పు సత్యాగ్రహంతో పాటు బ్రిటిష్ ఉత్పత్తులను నిరాకరించి స్వదేశీ విధానానికి ఆనాడే అంకురార్పణ చేసిన గొప్ప వ్యక్తి అని అన్నారు. 2004లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరు పెడితే నేడు బిజెపి ఆ పేరును జి రామ్ జి అనే పేరుగా మారుస్తుందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ తప్ప ఈ దేశంలో బిజెపి అనే పార్టీ లేదన్నారు. స్వాతంత్ర్య పోరాట నాయకుల విలువలు తెలియని బిజెపి, గాంధీ పేరును తొలగించాలని కుట్ర చేస్తుందన్నారు. ఇప్పటికైనా మహాత్ముని పేరు కొనసాగించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బానోతు శ్రవణ్ నాయక్, కొర్వి అరుణ్ కుమార్, అబ్దుల్ రహమాన్, కంకణాల అనిల్ కుమార్ గుప్తా, కుర్ర పోచయ్య, గాలి అనిల్ కుమార్, మాదాసు శ్రీనివాస్, ఇన్నారెడ్డి, పోతారపు సురేందర్, సిరికొండ శివప్రసాద్, జూపాక సుదర్శన్, సుధాకర్ నాయక్, శిల్ప, జొన్నల రమేష్, సత్తినేని శ్రీకాంత్, కుంట రాజేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ధర్మపురిలో కాంగ్రెస్ జెండా ఎగురాలే..

**- పట్టణంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఎన్నికల ప్రచారం - కాంగ్రెస్ పార్టీలో చేరిన పలువురు నాయకులు**

**ముద్ర, ధర్మపురి:**

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి ధర్మపురి పట్టణాన్ని మరింత అభివృద్ధి చేయడానికి అవకాశం కల్పించాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శుక్రవారం ధర్మపురి పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వాడ వాడలా తిరిగి ఓటర్లను కలిసి మాట్లాడారు.

గడిచిన రెండు సంవత్సరాలుగా ధర్మపురి పట్టణంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని గుర్తు చేశారు. ధర్మపురి పట్టణం మరింత అభివృద్ధి చెందాలంటే మున్సి పాలిటిపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగుర వేయాలని అన్నారు. మొత్తం 15 వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. అనంతరం పట్టణంలో ఏర్పాటు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కార్యాలయాలను మంత్రి పరిశీలించారు.



**కాంగ్రెస్ పార్టీలో చేరికలు..**

ధర్మపురి పట్టణానికి చెందిన ఒడ్డెర యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి ఓల్లెపు శంకర్ రాజు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో ఒడ్డెర యువజన సంఘం ధర్మపురి మండల అధ్యక్షుడు తాపల్ల శంకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. శంకర్ రాజుతో పాటు యువనాయకులు సంపంగి రవి, ఉప్పుల శివ, దండ్ల రాజేశ్, సంపంగిశేఖర్, సంపంగి సంజీవ్, రాజేష్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఈ కార్యక్రమంలో ధర్మపురి మండల, పట్టణ కాంగ్రెస్ నాయకులతో పాటు నియోజకవర్గానికి చెందిన పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## కేసీఆర్ కు సిట్ నోటీసులపై మంత్రి లక్ష్మణ్ కుమార్ కామెంట్స్..

**ముద్ర, జగిత్యాల:**

జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం రాజరాంపల్లిలో శుక్రవారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సమ్మక్క సారమ్మ అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఫోన్ టాపింగ్ విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని అన్నారు. కేసీఆర్ కు సిట్ నోటిసులపై అభ్యంతరం ఉంటే హైకోర్టుకు పోవచ్చునని అన్నారు. పేదలకు ఉపాధి కల్పించే ఉపాధి హామీ పేరు మారిస్తే కేసీఆర్, హరీష్ రావు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు నేనే రాజు.. నేనే మంత్రి అనే విధంగా బీఆర్ఎస్ నాయకులు ప్రవర్తించారని అన్నారు. రెండేళ్లలోనే ప్రజా ప్రభుత్వంపై సోషల్ మీడియా వేదికగా బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు.



# పోలీసులకు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి క్షమాపణలు

**ముద్ర, కరీంనగర్:**

కరీంనగర్ జిల్లా వీణవంకలో సమ్మక్క –సారలమ్మ జాతర సందర్భంగా పోలీసులపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఈ నేపథ్యంలో పోలీసులకు క్షమాపణలు చెబుతున్నట్లు కౌశిక్ రెడ్డి తెలిపారు. తాను ఉద్దేశపూర్వకంగా వ్యాఖ్యలు చేయలేదని, పోలీసుల మనోభావాలు దెబ్బతింటే క్షమించాలని పేర్కొన్నారు.

సీఎం ప్రోద్బలంతో తనపై, తన కుటుంబంపై రాజకీయ కక్ష సాధిస్తున్నారని చెప్పారు. పోలీసులు, అధికారులంటే తనకు ఎంతో గౌరవమని అన్నారు. సమ్మక్క జాతరకు వెళ్తుండగా అడ్డుకుని తీవ్ర ఒత్తిడి చేశారని, ఆ సమయంలో తాను నోరు జారానని, ఉద్దేశపూర్వక మాటలు కావని స్పష్టం చేశారు.

# మారుమూల ప్రాంతాల అభివృద్ధికి కృషి

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా - ఘనంగా అర్జుని గ్రామ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్**



**ముద్ర, ఆదిలాబాద్:**

గాదిగూడ మండలం అర్జుని గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కు గ్రామస్తులు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే గాదిగూడ మండలంలోని రహదారుల పరిస్థితిని మెరుగుపరిచి, ప్రతి గ్రామానికి మెరుగైన రోడ్డు సౌకర్యం కల్పించేందుకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. గ్రామంలో అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటామని, గృహ నిర్మాణ పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.

అనంతరం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆహార పదార్థాలను కలెక్ట ర్ రుచి చూశారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కమలాబాయి, పటేల్ రావుజీ పటేల్, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీ డీవో శ్రీనివాస్, ఎంపిఓ గంగాధర్, ఏం ఈఓ రమేష్, ప్రధానోపాధ్యాయులు మెస్రం శేఖర్, రాయ్ సెంటర్ సార్ మేడి మండాడి దౌలత్ రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.




# ఎస్సీ వర్గాల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి..

**జాతీయ ఎస్సీ కమిషన్ కార్యదర్శి గూడె శ్రీనివాస్**

**ముద్ర, కరీంనగర్:**

జిల్లాలో ఎస్సీ వర్గాల సంక్షేమంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, వారి జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడేలా సమగ్ర చర్యలు తీసుకోవాలని జాతీయ ఎస్సీ కమిషన్ కార్యదర్శి గూడె శ్రీనివాస్ ఆదేశించారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం కరీంనగర్ కు వచ్చిన ఆయన ఆర్ అండ్ బి అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లాలో ఎస్సీ వర్గాల సంక్షేమానికి అమలవుతున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమగ్రంగా చర్చించారు. ఎస్సీలపై జరుగుతున్న వివక్ష, అణచివేత ఘటనలపై ఫిర్యాదు వచ్చిన వెంటనే అధికారులు స్పందించాలని ఆయన సూచించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో వేగవంతమైన విచారణ చేపట్టి బాధితులకు తక్షణ సహాయం అందేలా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. గ్రామ స్థాయి వరకు సంక్షేమ పథకాలు అర్హులైన అందేలా చర్యలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ మరింత పెంచాలని సూచించారు. ఎస్సీ వర్గాల విద్యా ప్రగతి, ఆర్థిక సాధికారత, జీవన ప్రమాణాల మెరుగుదలే



లక్ష్యంగా ప్రభుత్వ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా అమలవుతున్న విద్య, ఉపాధి, గృహ నిర్మాణం, ఆరోగ్యం, సామాజిక భద్రత పథకాల అమలు తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్కాలర్ షిప్ ల పంపిణీ, హాస్టళ్ల వసతులు, స్వయం ఉపాధి యూనిట్లు, ఆర్థిక సహాయం, భూ సమస్యలపై ప్రత్యేకంగా వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి జిల్లాలో ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అట్రాసిటీ కేసులపై తరచూ సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ విచారణ వేగవంతం అయ్యేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీల ఆర్థిక అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని వివరించారు. అంతకుముందు జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు జాతీయ ఎస్సీ కమిషన్ కార్యదర్శి గూడె శ్రీనివాస్ కు ఘన స్వాగతం పలికారు.

ఈ సమావేశంలో జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ సునీల్ కుమార్ బాబు, ఆర్డీవో కె మహేశ్వర్, అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఎస్సీ సంక్షేమ శాఖ ఉపసంచాలకులు నాగైలేశ్వర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అనిల్ ప్రకాష్, ఏసీపీ వెంకటస్వామి సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
31.01.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**టీ20 వరల్డ్ కప్ 2026 ప్రత్యేకతలు**

సిక్సర్లు – ఫోర్ల వర్షం: టీ20 అంటే భారీ షాట్లు, స్టేడియంలో సందడి, ప్రేక్షకుల అరుపులు. హై స్కోరింగ్ మ్యాచ్‌లు ఈ ఫార్మాట్‌లో కామన్.




# బోడియా తండా స్కూల్లో ఫుడ్ పాయిజన్

- 32 మంది విద్యార్థులకు అస్వస్థత
- ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స
- వరుస ఘటనపై రాష్ట్ర హెచ్ ఆర్ సి సీరియస్
- సుమోటోగా కేసు విచారణ

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

సర్కారీ స్కూళ్లు.. గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు కలకలం రేపుతున్నాయి. ఈ నెల 29న సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం వెంకటాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఇది మరువకముందే శుక్రవారం ఖమ్మంలో ఇలాంటి మరో ఘటన వెలుగుచూసింది. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం బోడియా తండా ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో శుక్రవారం ఫుడ్ పాయిజన్ జరిగింది. మధ్యాహ్న భోజనం తర్వాత సుమారు 32 మంది విద్యార్థులకు వాంతులు, విరోచనాలు, కడుపు నొప్పి మొదలయ్యాయి. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు చికిత్స కోసం వారిని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అందరూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వరుసగా జరుగుతోన్న ఈ ఘటనలపై అన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత మొదలైంది. మెస్ నిర్వహణ, ఆహార నాణ్యతపై అధికారులు కఠినమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.



**సంగారెడ్డి ఘటనపై నివేదిక ఇవ్వండి**

పాఠశాల విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో తీవ్ర నిర్లక్ష్యం వహించడంపై రాష్ట్ర మానవ హక్కుల ఆగ్రహం వ్యక్తం చేసింది. సంగారెడ్డి జిల్లాలో 22 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనను కమిషన్ సుమోటోగా విచారణకు స్వీకరించింది. మీడియాలో వచ్చిన కథనంపై కమిషన్ జ్యుడిషియల్ సభ్యులు శివాది ప్రవీణ స్పందించారు. వెంకటాపూర్ గ్రామంలో జరిగిన ఒక ప్రైవేట్ విందులో మిగిలిపోయిన ఆహార పదార్థాలను తీసుకొచ్చి, పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంగా పెట్టడంతోనే ఈ అనర్థం జరిగిందన్న ఆరోపణలతో కమిషన్ ఆందోళన వ్యక్తం చేసింది. తక్షణమే దీనిపై సమగ్ర విచారణ జరపాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. ఫిబ్రవరి 24లోగా నివేదికను కమిషన్‌కు సమర్పించాలని శివాది ప్రవీణ ఆదేశాలు జారీ చేశారు.



## ఎన్నికల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

- భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**

మున్సిపాలిటీ ఎన్నికల విధుల పట్ల ప్రిసైడింగ్ అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ తరగతులలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు తో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో పారదర్శకంగా, స్వేచ్ఛాయుతంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహించేందుకు ప్రిసైడింగ్ అధికారుల పాత్ర చాలా కీలకమైనదన్నారు. ఎన్నికల విధులకు డ్యూటీలు వేసిన ప్రతి ఒక్కరు విధుల్లో చేరాలని ఎవ్వరికీ కూడా మినహాయింపు ఉండదన్నారు. ఎన్నికల నియమ నిబంధనలను పాటిస్తూ ఎన్నికల ప్రక్రియ మొత్తం నిక్ష్పాక్షకంగా ఉండాలని తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో జిల్లా విద్య శాఖ అధికారి సత్యనారాయణ, మాస్టర్ ట్రైనర్ నర్సిరెడ్డి,ప్రిసైడింగ్ అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఎల్ఎన్ఎస్ విద్యార్థులకు బహుమతులు

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

ఉస్మానియా గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్, ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర కళాశాలల క్రీడా పోటీలలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కళాశాలకు చెందిన విద్యార్థులు పలు బహుమతులు గెలుచుకున్నారు. 85వ ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ ను పురస్కరించుకొని సికింద్రాబాద్ ఎస్వీ కళాశాలలో నిర్వహించిన ఇండోర్, అవుట్డోర్ క్రీడలలో మూడు మొదటి, ఒక ద్వితీయ బహుమతితో ఓవరాల్ ఛాంపియన్షిప్ రన్నర్ అప్ గా నిలిచింది. ఈ నెల 29న సుమారు 17 కళాశాలలు పోటీ పడగా శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కళాశాల కు వాలీబాల్ లో ప్రథమ స్థానం, టెన్నికోయిట్ లో ప్రథమ స్థానం, షాట్ పట్ లో ప్రథమ, ద్వితీయ స్థానం పొంది, పతకాలతో పాటు, క్రీడలలో పాల్గొన్న విద్యార్థులకు ఎగ్జిబిషన్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ ఆర్.సుఖేష్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. కళాశాల కార్యదర్శి డాక్టర్ టి.ఎన్. వంశ తిలక్, స్పోర్ట్స్ కన్వీనర్ ఆనంద్ బొల్ల ఇతర పాలక వర్గం గెలుపొందిన క్రీడాకారులను ఉస్మానియా గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్, ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు, కళాశాల వ్యాయామ అధ్యాపకులు బి. పాండురంగం ని పాలకవర్గం అభినందించారు. పథకాలు సాధించినందుకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ గంజి, అధ్యాపకులు పి. బాల్ రెడ్డి, కె. కిష్టయ్య, ఎన్. సుధ ఆనందం వ్యక్తం చేశారు.



### ఫిబ్రవరి1 టెన్త్ విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

**చిలుకూరు, ముద్ర:**

ఎఐఎస్ఎఫ్ ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1న జిల్లా స్థాయిలో పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నాని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చేపూరి కొండలు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తమ్మనబోయిన నరేష్ లు తెలిపారు. వార్షిక పరీక్షలకు హాజర్యే విద్యార్థులకు అవగాహన కల్పించేందుకే ఈ టాలెంట్ టెస్ట్ ను నిర్వహించబోతున్నాని అన్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు కవిత జూనియర్ కళాశాలలో పరీక్ష ఉంటుందని తెలిపారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేస్తామని తెలిపారు.

## మీడియా సెంటర్ ప్రారంభం

**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**

రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకుని జిల్లా కలెక్టరేట్ లోని ఎన్.ఐ.సి వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎం.సీ.ఎం.సీ)ను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు తో కలసి కలెక్టర్ శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో డి.పి.ఆర్.ఓ శ్రీమతి అరుంధతి,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## సమానత్వంతో మెలగాలి

- నడిగూడెం సర్పంచ్ దున్నా శ్రీనివాస్

**ముద్ర నడిగూడెం:**

గ్రామస్తులందరూ సమానత్వంతో మెలగాలని నడిగూడెం గ్రామ సర్పంచ్ దున్నా శ్రీనివాస్ కోరారు. శుక్రవారం నడిగూడెం మండల కేంద్రంలో ఎస్సీ కాలనీలో తహశీల్దార్ రామకృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సివిల్స్ రైట్ డే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ.. పౌర హక్కులకు భంగం కలిగించవద్దని, కుల మతాలకు అతీతంగా అందరూ ఒకటేనని భావనతో మెలగాలని కోరారు. ఎస్సై జి అజయ్ కుమార్ మాట్లాడుతూ పౌర హక్కులకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ లు గోపాలరావు, మల్సూర్, పంచాయతీ కార్యదర్శి యలక ఉమారాణి, జిపిఓ కోటయ్య, సిపిఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ, గుండు విజయ రామారావు ,వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## దేవేందర్ రెడ్డి ఆశయాలను సాధించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి

**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**

కందాడి దేవేందర్ రెడ్డి ఆశయ సాధన కోసం కృషి చేస్తామని, ఆయన బాంబినో ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తూ కార్మికుల సమస్యలపై ఎనలేని కృషి చేశారని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి కొనియాడారు. శుక్రవారం సిఐటీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో పాల్గొని చంద్రారెడ్డి మాట్లాడుతూ... ఆయన భౌతికంగా మన మధ్యన లేకపోయినా ఆయన ఆశయాలు మన మధ్యన ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శులు తుర్కపల్లి సురేందర్, పొట్ట యాదమ్మ నాయకులు ఓవల్దాస్ సతీష్, బండారు శ్రవణ్, బాలబోయిన జంగయ్య, సయ్యద్ ఉమర్, మేకల బాబు, వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.





## సమ్మెను జయప్రదం చేయండి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి

**ముద్ర ప్రతినిధి భువనగిరి:**

కేంద్ర బిజెపి ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్స్, విబి జి రామ్ జి ఉపాధి చట్టం, జాతీయ విత్తన బిల్లు, విద్యుత్ సవరణ బిల్లులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 12న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి పిలుపునిచ్చారు.

శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన మండల సదస్సులో చంద్రారెడ్డి పాల్గొని మాట్లాడారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని, దీనికోసం గ్రామపంచాయతీ, అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్నం భోజనం, వివోఏ, ఫీల్డ్ అసిస్టెంట్లు, స్కావెంజర్స్, మిషన్ భగీరథ, భవన నిర్మాణం, ట్రాన్స్పోర్ట్ డ్రైవర్స్, హమాలీలతో పాటు పరిశ్రమల కార్మికులు సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శులు తుర్కపల్లి సురేందర్, పొట్ట యాదమ్మ, నాయకులు సిహెచ్ శ్రీనివాస్, మంద యాదగిరి, సయ్యద్ ఉమర్, ఎస్కే షాహెద, నాంపల్లి భాస్కర్, ఓవల్దాస్ సతీష్, బండారు శ్రావణ్, బాలబోయిన జంగయ్య, మేకల బాబు, సిల్వేరు రమేష్, ఎడ్ల పద్మ, సరస్వతి, ధనమ్మ, సుజాత, లావణ్య, కనకదుర్గ, అనూష, హేమలత, పాశం బాలయ్య, తొర్రి యాదగిరి, మార్కండేయ, పావని, నాన్కి, జగదీశ్, హరిబాబు, గోవింద్, మధు పాల్గొన్నారు.

## ఎల్ హెచ్ పీఎస్ ఆధ్వర్యంలో సర్పంచ్‌లకు సన్మానం

**ముద్ర, తుర్కపల్లి:**

తుర్కపల్లి మండలంలో లంబాడి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన బంజారా సర్పంచ్‌లతో పాటు, ఎన్నికల్లో ఓడిపోయిన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లకు కమిటీ తరపున ఘనంగా సన్మానం చేశారు. అనంతరం ఫిబ్రవరి 15న నిర్వహించనున్న సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవ కమిటీని ఎన్నుకున్నారు. ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు.



## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీజీ వర్ధంతి

**ముద్ర, నడిగూడెం:**

ఆర్యవైశ్య సంఘం, నడిగూడెం వారి ఆధ్వర్యంలో శుక్రవారం గాంధీ 78వ వర్ధంతిని మండల కేంద్రంలోని గాంధీ పార్కులో నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఆ సంఘం నాయకులు బోనగిరి ఉపేందర్ మాట్లాడారు. గాంధీజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. శాంతి అహింస ద్వారానే దేశానికి స్వతంత్రం తీసుకొచ్చిన గొప్ప వ్యక్తి గాంధీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల నాయకులు గజ్జి అప్పారావు, దివ్వేల శ్రీనివాసరావు, కొండా వెంకన్న, వందనపు కృష్ణమూర్తి తోట శీను, కొత్తూరు శ్రీనివాస్, వందనపు మోహన్, వందనపు విజయ్, చల్లారత్నం, సిరంగి దుర్గారావు చిల్లం చర్ల ఉపేందర్ కారంశెట్టి యుగంధర్, మైనార్టీ నాయకులు ఎస్కే జలీల్, ఎండీ.రఫీ తదితరులు పాల్గొన్నారు.



## దాడి చేసినవారిని శిక్షించాలి

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

గ్రామ పాలన అధికారిపై దాడి చేసినవారిని శిక్షించాలని గ్రామ పాలన ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ రాష్ట్ర అధ్యక్షులు గరికె ఉపేందర్ రావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గ్రామ పాలన ఆఫీసర్ షేక్ అబ్బాస్ పై ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారు విధి నిర్వహణలో భాగంగా ప్రభుత్వ భూమిని కాపాడటకై తహసీల్దార్ ఆదేశానుసారం ఫీల్డ్ మీదికి వెళ్లిన గ్రామ పాలన అధికారి, సిబ్బందిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు మల్లారం అర్జున్, విజయ్ కోశాధికారి గుర్రాల బాలకృష్ణలున్నారు.



## ఎంపీఓకు సమ్మె నోటీసు అందజేత

**ముద్ర, తుర్కపల్లి:**

ఫిబ్రవరి 12న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు పోతరాజు జహంగీర్ పిలుపునిచ్చారు. శుక్రవారం గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఫెడరేషన్ సిఐటియు యూనియన్ ఆధ్వర్యంలో ఎంపీవో వెంకటేశ్వర్లుకు సమ్మె నోటీసును అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ ఫెడరేషన్ సిఐటియు యూనియన్ మండల అధ్యక్షుడు ఎరుకల స్వామి గౌడ్, మండల నాయకులు పోతరాజు సత్యనారాయణ, కోట ఆంజనేయులు, మహేష్, తోటి మల్లయ్య, గడ్డమీది లక్ష్మి, ఈదులకంటి పోచమ్మ, తలారి మాధవి, సుశీల తదితరులు పాల్గొన్నారు.



**టీ20 వరల్డ్ కప్ 2026 ప్రత్యేకతలు**




**ఉత్కంఠ భరిత నాక్ అవుట్స్:** సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు చివరి ఓవర్ వరకు టెన్షన్ కలిగిస్తాయి. ఒక్క బంతితో మ్యాచ్ తేలిపోవడం టీ 20లో సాధారణం.

# హామీల అమలులో ప్రభుత్వం విఫలం

**మాజీ మంత్రి హరీష్ రావు**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ మెదక్ నియోజకవర్గంలోని రామాయంపేటలో కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చౌదరి సుప్రభాత్ రావు ఆ పార్టీకి గుడ్ బై చెప్పి బీఆర్ఎస్ లో చేరారు. సుప్రభాత్ రావు 25 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో ఎన్ ఎస్ యూ ఐ నుంచి పీసీసీ సెక్రటరీ వరకు వివిధ హోదాల్లో పనిచేశారు. శుక్రవారం డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు నివాసంలో చేరారు. మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి, మెదక్ సీనియర్ నాయకులు కంఠారెడ్డి తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో సుప్రభాత్ రావు తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్ లో చేరారు. వారికి హరీష్ రావు గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ప్రజల్లోనే కాదు, ఆ పార్టీ సొంత నాయకుల్లోనూ తీవ్ర అసంతృప్తి నెల కొందని విమర్శించారు. రేవంత్ రెడ్డి రెండేళ్ల పాలనలో ప్రజలకు చేసింది శూన్యమని, ఇచ్చిన హామీలు నెరవేర్చలేక చేతులెత్తేశారని విమర్శించారు. అందుకే అభివృద్ధిని కాంక్షించే కరుడుగట్టిన కాంగ్రెస్ వాది సుప్రభాత్ రావు లాంటి సీనియర్ నాయకులు కాంగ్రెస్ ను వీడి బీఆర్ఎస్ లో చేరుతున్నారని పేర్కొన్నారు.

రామాయంపేటలో సుప్రభాత్ రావు చేరికతో పార్టీ మరింత బలోపేతం అయ్యిందని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో రామాయంపేటలో ఎగిరేది గులాబీ జెండానే అని హరీష్ రావు ధీమా వ్యక్తం చేశారు. పార్టీని నమ్ముకుని వచ్చిన వారికి సముచిత స్థానం, గౌరవం ఉంటాయని హామీ ఇచ్చారు.

కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను, బీఆర్ఎస్ చేసి న అభివృద్ధిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.కేసీఆర్ హయాంలో పట్టణ ప్రగతితో మన పట్టణాలు, మున్సిపాలిటీలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని గుర్తు చేశారు. పచ్చదనం, పరిశుభ్రత, మెరుగైన సౌకర్యాలతో కళకళలాడిన పట్టణాలు నేడు కాంగ్రెస్ పాలనలో నిధులు లేక, నిర్వహణ లేక పూర్తిగా నిర్వీర్యం అయిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ వచ్చాక ప్రగతి పూర్తిగా పడకేసిందని, మళ్ళీ మంచినీటి సమస్యలు, పారిశుధ్య సమస్యలు మొదలయ్యాయని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని హరీష్ రావు అన్నారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీల పేరిట రేవంత్ రెడ్డి అన్ని వర్గాలను మోసం చేశారన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలు గమనిస్తున్నారని, ఉమ్మడి మెదక్ జిల్లాలో జరగబోయే అన్ని మున్సిపాలిటీ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయబోయేది, విజయ ఢంకా మోగించేది బీఆర్ఎస్ పార్టీనే అని హరీష్ రావు ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ కు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను, వైఫల్యాలను గడప గడపకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సుప్రభాత్ రావు రాకతో రామాయంపేటలో బీఆర్ఎస్ తిరుగులేని శక్తిగా మారిందని, కార్యకర్తలంతా ఐకమత్యంతో పనిచేసి మున్సిపల్ ఎన్నికల్లో ఘన విజయం సాధించి కేసీఆర్ కు కానుకగా ఇవ్వాలని కోరారు. పార్టీని నమ్ముకుని వచ్చిన ప్రతి కార్యకర్తకు, నాయకుడికి బీఆర్ఎస్ కుటుంబం అండగా ఉంటుందని, ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని హరీష్ రావు భరోసా ఇచ్చారు.

పార్టీలో చేరిన సుప్రభాత్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తలకు, నాయకులకు సరైన గుర్తింపు లేదని, కేవలం గ్రూపు రాజకీయాలకే పరిమితమైందని ఆవేదన వ్యక్తం చేశారు. మెదక్ జిల్లా అభివృద్ధి కేవలం బీఆర్ఎస్ తోనే సాధ్యమని, కేసీఆర్, హరీష్ రావు నాయకత్వంపై నమ్మకంతోనే తాను బీఆర్ఎస్ లో చేరానని స్పష్టం చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో రామాయంపేటలో గులాబీ జెండా ఎగురవేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట మున్సిపల్ మాజీ చైర్మన్ జితేందర్ గౌడ్, కౌన్సిలర్లు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్ లో పలువురి చేరిక..**

మెదక్ పట్టణం వార్డ్ నంబర్ 10 నుండి కాంగ్రెస్ నాయకులు చింతల శ్రీను, కిషన్, మంద శేఖర్ తో పాటు 20 మంది కార్యకర్తలు బీఆర్ ఎస్లో చేరారు. వార్డు నం. 27 నుంచి పల్లె రాణి బాలరాజ్, 20 మంది, వార్డ్ నెంబర్ 31 నుండి ఆర్కే శ్రీనివాస్ ఆధ్వ ర్యంలో కాంగ్రెస్ నాయకులు వరాల రాము లు, రణధీర్, కంచర్ల శ్రీధర్, యాదగిరి, నరేష్ మంగలి మహేష్, ఆకుల రాహుల్, 30 మంది కార్యకర్తలు జిల్లా పార్టీ అధ్య క్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ లో చేరారు. వీరిని పద్మ దేవేందర్ రెడ్డి, మెదక్ మున్సిపల్ ఎన్నికల ఇంచార్జి రుక్ హుస్సేన్ ఆహ్వానించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల మల్లిఖార్జున్ గౌడ్, పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ళ. ఆంజ నేయులు, మాజీ కౌన్సిలర్ ఆర్కే శ్రీని వాస్, నాయకులు లింగా రెడ్డి, కం దేల నర్సింలు, కాసాపురం మధు, శ్రీనివాస్ గౌడ్, కృష్ణ, కిరణ్, రవి భువన్, చంద్ పాషా పాల్గొన్నారు.

## విద్యార్థుల భోజనంపై నిర్లక్ష్యం చేయొద్దు



**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:** విద్యార్థులకు భోజనం విషయం నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి హెచ్చరించారు. శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలోని వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ, బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో మెనూ పాటించకుండా నాణ్యతలేని ఆహారం అందిస్తున్నారంటూ గురువారం విద్యార్థులు ధర్నా నిర్వహించిన ఘటనపై స్పందించిన కలెక్టర్, సమస్యకు గల కారణాలను క్షేత్రస్థాయిలో ఆరా తీశారు. విధి నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని హెచ్చరించారు. ధర్నాపై విద్యార్థుల ద్వారా విచారణ చేపట్టి నివేదిక సమర్పించాలని తహసీల్దార్ ను ఆదేశించారు. అలాగే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వసతి గృహాన్ని తరచుగా తనిఖీ చేయాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. అనంతరం వంటగదిని పరిశీలించిన కలెక్టర్, ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. కూరలు నాణ్యతతో ఉండాలని, కామన్ డైట్ మెనూ ప్రకారం తప్పనిసరిగా భోజనం తయారు చేయాలని ఆదేశించారు. వసతి గృహం లోపల, బయట పరిశుభ్రత పాటించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి విద్యార్థుల స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని హాస్టల్ వెల్ఫేర్ అధికారి జి. మల్లేశంకు సూచించారు.విద్యార్థులకు భోజనం, వసతి విషయంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి, తహసీల్దార్ లక్ష్మీరెడ్డి, హాస్టల్ వెల్ఫేర్ అధికారి జి. మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షల కోసం విద్యార్థులను సన్నద్దం చేయాలి



**ముద్ర ప్రతినిధి, మెదక్:** వార్షిక పరీక్షల కోసం విద్యార్థులను సన్నద్దం చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ ఉపాధ్యాయులకు సూచించారు. నిజాంపేట్ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ హై స్కూల్ లో 10వ తరగతి ప్రత్యేక తరగతులను కలెక్టర్ పరిశీలించారు. వార్షిక పరీక్షల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచే లక్ష్యంతో, వెనుకబడిన విద్యా ర్థులపై ప్రత్యేక దృష్టి సారించి, వారికి అదనపు తరగతులు నిర్వహించలని తెలిపారు. ప్రత్యేక తరగతుల నిర్వహణ వల్ల నాణ్యమైన విద్యను అందించడం ద్వారా మెరుగైన ఫలితాలు ఉంటాయన్నారు. అనంతరం కలెక్టర్ ఉపాధ్యాయుల బోధన శైలిని పరిశీలిస్తూ విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. గణితం, సైన్స్, ఇంగ్లీష్ వంటి ముఖ్యమైన సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు పెట్టాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థి మంచి మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు చొరవ తీసు కోవాలని సూచించారు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## శాంతియుత పోరాటానికి ప్రతీక గాంధీ



**సిద్దిపేట,, ముద్ర ప్రతినిధి:** శాంతియుత పోరాటం ద్వారా దేశానికి స్వాతంత్ర్యం సాధించిన మహనీయులు మహాత్మాగాంధీ అని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ సిద్ది పేట జిల్లా అధ్యక్షులు రాగుల రాజిరెడ్డి అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీ చౌక్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరంఈ హెచ్ ఎస్ , పీఆర్సీ లపై కార్యవర్గ సమావేశంలో జిల్లా కార్యాలయంలో శుక్రవారం జిల్లా అధ్యక్షులు రాగుల రాజిరెడ్డి అధ్యక్షతన జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశం నిర్వహించి పలు తీర్మానాలు చేశారు. . ఈ కార్యక్ర మంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జైన సత్యం, జిల్లా కార్యవర్గ సభ్యులు కృపాసాగర్, మల్లారెడ్డి, దేవేందర్ రెడ్డి, రాజగోపాల్, దావూద్ అలీ, రాఘవరెడ్డి, గోపాల్, మల్ల య్యతో పాటు మండలాల బాధ్యులు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## ఎడ్ల బండి పై వచ్చి నామినేషన్



**ఆందోల్, ముద్ర ప్రతినిధి:** ఆందోల్–జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో 12వ వార్డు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి కోరబోయిన సరస్వతీ పోచయ్య 12వ పరిధిలో ఉన్నటువంటి శ్రీ రాజరాజేశ్వర మందిరంలో నామినేషన్ పత్రాలను పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడి నుంచి భారీ ఊరేగింపుగా కాలనీకి చెందిన ప్రజలు, కార్యకర్తలు, యువ నాయకులు, మహ ళలతో అక్కడి నుంచి బయలుదేరి బ్యాండ్ మేళాలు,టపాసులు కాల్చుతూ యువకులు నృత్యాలు నడుమ ఊరేగింపు జోగిపేట క్లాక్ టవర్ మీదుగా హనుమాన్ చౌరస్తా వరకు ఈ ర్యాలీ కొనసాగింది. అనంతరం నామినేషన్ పత్రాలను మున్సిపాలిటీ ఆఫీసులో దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వులువల సత్తయ్య, వులువల రాజు, శ్రీనివాస్, మల్లేశం, దుర్గేష్, దశరథ్, పాపయ్య, ప్రభు, భీమ్ రాజ్, రాకేష్, మహేందర్, లింగ లక్ష్మణ్, పోచయ్య, రమేష్, తదితర కాలనీ కి చెందిన ప్రజలు ,మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రచార ఖర్చులపై పకడ్బందీ నియంత్రణ

**జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు రాకేష్**

**సంగారెడ్డి, ముద్ర ప్రతినిధి:** జిల్లాలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఎన్నికల ప్రచార ఖర్చులపై పకడ్బందీగా నియంత్రణ చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు రాకేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి, ఏఈఓల బృందాలు అన్నివేళలా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏం.సి.సి., ఎం.సి.ఎం.సి. నోడల్ అధికారులు, ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి బృందాలు, ఏఈఓలు తదితరులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల వ్యయ నియంత్రణలో అసిస్టెంట్ ఎక్స్పెండిచర్ అబ్జర్వర్లు (AEOలు) కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు.ఎన్నికల ప్రచార ఖర్చులు ప్రతి అభ్యర్థి ఖాతాలో ఖచ్చితంగా నమోదు చేయాలని, ఎన్నికలను ప్రభావితం చేసే ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ముఖ్యంగా డబ్బు, మద్యం, విలువైన వస్తువులు తదితరాలను అక్రమంగా పంపిణీ చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదే శించారు. అనుమానాస్పద లావాదేవీలు, బల్క్‌గా సరఫరా అవుతున్న వస్తువులు, నగదు కదలి కలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. వ్యయ నియంత్రణలో భాగంగా ఎస్ఎస్‌టి, ఎఫ్ఎస్‌టి బృందాలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ గట్టి నిఘా కొనసాగించాలన్నారు.

ఎన్నికల ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను పకడ్బందీగా అమలు చేయాలని, ఏ చిన్న ఉల్లంఘ నకైనా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయా అధికారులు సమిష్టిగా పని చేసి నప్పుడే ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా సాగుతుందని తెలిపారు.

ఈ సమావేశంలో జడ్పీ సీఈవో జానకి రెడ్డి, ఎక్సైజ్ శాఖ అడిషనల్ సూపరింటెండెంట్, డీసీఓ కిరణ్ కుమార్, ఎం.సి.సి నోడల్ అధికారి జగదీష్, ఎం.సి.ఎం.సి నోడల్ అధికారి విజయలక్ష్మి , ఎల్‌డిఎం నర్సింగ్ రావు ,అసిస్టెంట్ ఎక్స్పెండిచర్ అబ్జర్వర్లు, ఎస్ఎస్‌టి, ఎఫ్ఎస్‌టి బృందాలు, ఎన్నికల విభాగపు అధికారులు, సిబ్బంది తదితరులు తదితరులు పాల్గొన్నారు.




## ముగిసిన నామినేషన్ల పర్వం



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ మున్సిపల్ కార్యాలయంలో చివరి రోజు 156 నామినేషన్లు దాఖలయ్యాయి. అందులో 7 బీఎస్పీ, 31 బీజేపీ, 43 కాంగ్రెస్, 6 ఎంఐఎం, 49 బీఆర్ఎస్ తరపున, 20 స్వతంత్రులు తమ నామినేషన్ సమర్పించినట్లు కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మూడు రోజుల్లో మొత్తం 271 నామినేషన్లు వివిధ పార్టీలు, ఇండిపెండెంట్లు నామినేషన్లు దాఖలు చేసినట్లు పేర్కొన్నారు.

**కలెక్టర్, పరిశీలకుల సందర్శన..**

రామాయంపేటలో నామినేషన్ ప్రక్రియను శుక్రవారం కలెక్టర్ రాహుల్ రాజ్, సాధారణ పరిశీలకులు రవి కిరణ్ సందర్శించారు. నామినేషన్ పత్రాలు, వివిధ రిజిస్టర్లను పరిశీలించారు. ఎన్నికల సంఘం నియమా నిబంధనను తూచా తప్పకుండా అనుసరించి నామినేషన్ ప్రక్రియ కొనసాగాలన్నారు. నామినేషన్ పత్రాలతో పాటు జతచేసే జిరాక్సులను సరిచూసి తీసుకోవాలని అధికారులను ఆదే శించారు. ఎన్నకల నిబంధనలను తూచా తప్ప కుండా పాటించాలన్నారు. వారి వెంట నర్సాపూర్ ఆర్డీవో మైపాల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ కోర్టులో పోలింగ్ ప్రశాంతం




**ముద్ర ప్రతినిధి, మెదక్:** తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికలు మెదక్ జిల్లా కోర్టు ప్రాంగణంలో ప్రశాంతంగా జరిగాయి. మెదక్ పోలింగ్ స్టేషనునందు మొత్త ము 92 ఓట్లు ఉండగా 86 ఓట్లు పోలయినట్లు ఎన్నికల అధి కారి శిరిగ ప్రభాకర్ తెలిపారు. ప్రశాంత వాతవరణంలో ఎన్నికలు జరిగాయి. ఓటింగ్ సరళిని రాష్ట్ర హైకోర్టు ఉత్తర్యులను అనుసరించి సీనియ సివిల్ జడ్జి రుబినా ఫాతిమ పరిశీలించారు. సీనియర్ సూపరింటెండెట్ సునిత ఎన్నికల పరిశీలకులుగా వ్యవవగిరించారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
31.01.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**టీ20 వరల్డ్ కప్ 2026 ప్రత్యేకతలు**

టైటిల్ రేస్ : డిఫెండింగ్ చాంపియన్ జట్టు టైటిల్ నిలబెట్టుకోవడానికి కఠిన పోరాటం చేస్తుంది. ఇతర జట్లు కప్ దక్కించుకోవాలనే పట్టుదలతో ఆడతాయి.




# సర్కారు స్కూళ్ల విద్యార్థులకు అల్పాహారం

- ఆర్థిక వనరులు సమకూరితే త్వరలోనే అమలు
- ఇప్పటికే సీఎం రేవంత్ సెగ్మెంట్లో ప్రారంభం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**ముద్ర, రంగారెడ్డి :**





రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అనుకూలిస్తే సర్కారు పాఠశాలల్లో ఉచితంగా అల్పాహారం ఏర్పాటు చేసే ఆలోచన ఉన్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా మొగిలిగిద్ద ఉన్నత పాఠశాల 150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు డిప్యూటీ సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని ఇప్పటికే ఈ పథకాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. ఆర్థిక వనరులు సమకూరితే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం పథకం ప్రవేశపెడతామని తెలిపారు. ఎదిగే వయసులో పిల్లలకు సరైన ఆహారం లేక పరిపూర్ణంగా ఎదగలేకపోతున్నారనే ఆలోచనతో ప్రభుత్వం ఈ దిశగా ఆలోచన చేస్తుందని తెలిపారు.

కామన్ స్కూల్ విధానం ఉంటేనే సమాజం ఉమ్మడి కుటుంబం గా ఎదుగుతుందని అభిప్రాయపడ్డారు. చిన్ననాటి నుంచే అందరం కలిసిపోయామనే భావన కులం, మతం, ధనిక, పేద తేడా లేదన్న నిర్మాణాత్మక ఆలోచన సమాజంలో పెరుగుతుందనే ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు నిర్మిస్తుందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మొట్టమొదటిసారి ఒక్కో పాఠశాలను 25 ఎకరాలు విస్తీర్ణంలో రూ. 200 కోట్ల బడ్జెట్ తో రాష్ట్రవ్యాప్తంగా 100 నియోజకవర్గాల్లో 20వేల కోట్లు వెచ్చిస్తూ ఒకేసారి నిర్మాణాలు ప్రారంభించామని వివరించారు. రాష్ట్రం ప్రపంచంతో పోటీ పడాలంటే గొప్ప మానవ వనరులు అవసరమని చెప్పారు. మానవ వనరులకు సానపడితేనే రాష్ట్రం ఆర్థికంగా బలపడుతుందన్నారు. అందుకు అందరికీ విద్య, వైద్యం ప్రజా ప్రభుత్వం ఉచితంగా అందాలన్నారు. అందుకే ఈ రెండు అంశాలపైనే దృష్టి సారించి ముందుకు పోతుందన్నారు. ఈ ఆలోచనలో భాగంగానే పాఠశాల నిర్వాహకులు పిలవగానే గతేడాది జనవరి లో సీఎం రేవంత్ రెడ్డి మొగిలిగిద్ద పాఠశాలకు వచ్చి రూ. పది కోట్లు కేటాయించారని వివరించారు. ఆ నిధులతో పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. గత పాలకులు ఐటీఐలను అనాథలుగా వదిలేశారని ఆరోపించారు. మారిన కాలానికి అనుగుణంగా వాటిలో శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న పారిశ్రామికవేత్తలను తీసుకువచ్చి ఉపాధి పొందేందుకు అవసరమైన సిలబస్ రూపొందించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోని ఐటీఐలను అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్లుగా మారుస్తున్నామని వివరించారు. హైదరాబాద్ రాష్ట్ర తొలి సీఎం బూర్గుల రామకృష్ణారావు తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలు ఈ తరానికి తెలియవన్నారు. ఈ దేశంలో భూ సంస్కరణలకు ఆధ్యుడు బూర్గుల రామకృష్ణారావు అని వివరించారు. బూర్గుల రామకృష్ణారావు, మర్రి చెన్నారెడ్డి తో పాటు ఉత్తరప్రదేశ్ మాజీ గవర్నర్ సత్యనారాయణ రెడ్డి, ప్రముఖ ప్రొఫెసర్ హరగోపాల్ వంటి అనేక మంది ప్రముఖులను మొగిలిగిద్ద ప్రభుత్వ పాఠశాల దేశానికి, సమాజానికి అందించిందని గుర్తు చేశారు. కాగా ఆయన అంతకుముందు విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

## ఏపీ న్యూస్

# ప్రవాసాంధ్రుల సేవలు స్ఫూర్తిదాయకం

- ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**ముద్ర, గుంటూరు:**



ఎంత ఎదిగినా జన్మభూమిని మర్చిపోకుండా ప్రవాసాంధ్రులు చేస్తున్న సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. సంపాదించిన దాంట్లో కొంత సమాజసేవకు వినియోగిస్తే వచ్చే తృప్తి మాటల్లో చెప్పలేనిదని సీఎం అన్నారు. గుంటూరు జీజీహెచ్ లో మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. కానూరిజింఖానా మాతా శిశు సంరక్షణ కేంద్ర నిర్మాణం కోసం కాలేజీ పూర్వ విద్యార్థులు రూ.100 కోట్ల విరాళాలను సమకూర్చగా.. ఎక్విప్మెంట్, ఫర్నిచర్ కోసం రూ. 27 కోట్లు ప్రభుత్వం వెచ్చించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ 'సమాజంలో ఇంకా మంచి మిగిలే ఉందని ప్రవాసాంధ్రులు నిరూపించారన్నారు. సాధారణంగా నలభై, యాభై ఏళ్ల క్రితం విదేశాలకు వెళ్లి స్థిరపడినవాళ్లు జన్మభూమిని మర్చిపోతారని, కానీ మీరంతా చదువుకున్న కాలేజీని గుర్తు పెట్టుకుని 1981లోనే జింఖానా సంస్థ ఏర్పాటు చేసి ఇంత పెద్ద ఎత్తున సాయం చేస్తుండటం గొప్ప విషయమన్నారు.

తాను పేదల అభ్యున్నతి కోసం పీ4 తీసుకొచ్చానని చెప్పారు. పేదలు సంపాదించే స్థాయికి చేరితేనే సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గుతాయన్నారు. పీ4 కార్యక్రమం లక్ష్య సాధనలో 50 శాతం సాధించమన్నారు. ప్రవాసాంధ్రులు కూడా పేదలకు ఆర్థిక చేయూత అందించేందుకు ముందుకు రావాలని సీఎం పిలుపునిచ్చారు.

**మేటి నగరంగా అమరావతి..**

అమరావతి నూతన గ్రీన్ ఫీల్డ్ నగరంగా అవతరిస్తోందని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన 202526 ఆర్థిక సర్వేలో స్పష్టం చేసిందన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో 2038 నాటికి ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మన దేశం తయారవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 2047 నాటికి స్వర్ణాంధ్ర లక్ష్య సాధనతో మనం ముందుకెళ్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి సత్యకుమార్ సహా పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

**టీచర్ల ట్రైనింగ్ సెంటర్ ప్రారంభం..**

కుప్పం: తిరుపతి జిల్లా గుడిపల్లి ఆగస్త్య విద్యాచల్ అకాడెమీ ప్రాంగణంలోని టీచర్ల ట్రైనింగ్ సెంటర్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. అకాడెమీలోని శిక్షణా కేంద్రాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు ట్రైనింగ్ తీసుకుంటున్న టీచర్లను పలకరించారు

# ఆంధ్రప్రదేశ్ ను అగ్రగామిగా చేస్తాం

- పాదయాత్రతో సమాజం నుంచి ఎంతో నేర్చుకున్నా
- మంత్రి నారా లోకేష్

**ముద్ర, కాకినాడ:**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా చేయడమే తమ లక్ష్యమని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. శుక్రవారం కాకినాడ జేఎన్టీయూలో హలో లోకేష్ పేరిట నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి లోకేష్ సమాధానాలిచ్చారు. ఈ కార్యక్రమానికి జేఎన్టీయూ ఈసీఈ మూడో సంవత్సరం విద్యార్థి ప్రాప్తి సంధానకర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నదే తన ధ్యేయమన్నారు. ఇందుకోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో మనం కొన్ని నిర్ణయాలు తీసుకుంటామని, ఆ నిర్ణయాలే మన జీవితాన్ని మారుస్తాయని చెప్పారు. పాదయాత్ర నిర్ణయం తన జీవితాన్ని మార్చేసిందన్నారు. రాష్ట్రంలో కోట్లాది ప్రజలు, యువత ఆశలు, ఆకాంక్షలు, సమస్యలను తెలుసుకునే అవకాశం లభించిందని గుర్తు చేశారు. పాదయాత్రలో ఎంతో నేర్చుకున్నట్లు చెప్పారు. నాటి అనుభవాలనే ఇప్పుడు ప్రభుత్వంలో అమలు చేస్తుమని పేర్కొన్నారు. ప్రభుత్వంలోకి రావడంతోనే తమ పని పూర్తికాలేదన్నారు. అసలు పని ఇప్పుడే మొదలైందన్నారు. ఇకపై నెలకు ఒకసారి విద్యార్థులను కలవాలని భావిస్తున్నట్లు చెప్పారు. దీనిద్వారా విద్యార్థుల ఆకాంక్షలు, మనోగతాన్ని తెలుసుకునే అవకాశం కలుగుతుందన్నారు. మీరు అద్భుతమైన ఫీడ్ బ్యాక్ ఇచ్చారనిచ సమస్యలు చెప్పారన్నారు. మీ సలహాలు కరిక్యులమ్ ఇంప్రూవ్ మెంట్ కు దోహదపడతాయన్నారు. నైతిక విలువలు నేర్పించేందుకు చాగంటి కోటేశ్వరరావును ప్రభుత్వ సలహాదారుగా నియమించమన్నారు. ఆయనకు కేబినెట్ ర్యాంకు ఇస్తే ప్రభుత్వం నుంచి ఎటువంటి సదుపాయాలు తీసుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మంత్రి పొంగూరి నారాయణ, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), (కాకినాడ), పంతం నానాజీ (కాకినాడ రూరల్), ఆదిరెడ్డి శ్రీనివాస్ (రాజమండ్రి), యనమల దివ్య (తుని), ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కాకినాడ జేఎన్టీయూ వైస్ చాన్స్ లర్ చేకూరి శివరామకృష్ణ ప్రసాద్, ఇంచార్జి ఆర్. శ్రీనివాసరావు, రెక్టార్ పి.సుబ్బారావు, ప్రిన్సిపాల్ ఎన్. మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధుడి సజీవ దహనం

- చిగురుమామిడిలో హృదయ విదారక ఘటన

**ముద్ర, చిగురుమామిడి:**

కరీంనగర్ జిల్లా గురుమామిడి మండల కేంద్రంలో బుధవారం అర్ధ రాత్రి హృదయాన్ని కలిచివేసే విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పొన్నం ఆగయ్య (80) ప్రమాదవశాత్తు సజీవదహనమై అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన స్థానికంగా తీవ్ర విషాదం నింపింది.

వివరాల ప్రకారం.. పొన్నం ఆగయ్య వృద్ధాప్యంతో ఏడేళ్లుగా పని చేయకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఆయనకు బీడీలు తాగే అలవాటు ఉంది. ఆయన భార్య కనకవ్వ జీవనోపాధి కోసం కరీంనగర్ లో కూరగాయలు అమ్ముతూ కుటుంబాన్ని పోషిస్తోంది. గురువారం సాయంత్రం కూడా ఆమె కూరగాయలు అమ్మేందుకు కరీంనగర్‌కు వెళ్లింది. అదే సమయంలో ఆగయ్య తన ఇంట్లోని ఓ గదిలో ఒంటరిగా నిద్రిస్తున్నాడు. పక్కగదిలో ఆయన కుమారుడు సమ్మయ్య నిద్రించగా, అర్ధరాత్రి సుమారు 12:30 గంటల సమయంలో ఆగయ్య నుంచి మూలుగులు వినిపించడంతో సమ్మయ్య ఉలిక్కిపడి లేచాడు. తలుపుకు గడి ఉండటంతో కిటికి నుంచి చూడగా ఆగయ్య శరీరం మంటలతో కాలిపోవడం చూసి భయాందోళనకు గురయ్యాడు. వెంటనే చుట్టుపక్కల వారిని లేపి గడ్డపార సహాయంతో తలుపును బలవంతంగా తెరిచారు. అయితే అప్పటికే ఆగయ్య తీవ్రంగా కాలిపోయి ప్రాణాలు కోల్పోయి నట్లు గుర్తించారు.

**ప్రాథమిక విచారణలో..**

ఆగయ్య రాత్రి బీడీ తాగేందుకు అగ్గిపుల్ల గీసే క్రమంలో అనుకోకుండా మంచంపై ఉన్న బొంతపై పడ్డట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మంటలు చెలరేగి, అవి శరీరానికి అంటుకుని ఈ దుర్ఘటన చోటుచేసుకున్నట్లు భావిస్తున్నారు.ఈ ఘటనపై మృతుని కుమారుడు సమ్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడు ఆగయ్యకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

# రైతు సంక్షేమానికే పెద్దపీట

- ఐటీ ఆదారిత సేవలతోనే ఎరువులు
- సీఎస్ కె.రామకృష్ణారావు

**ముద్ర న్యూస్:**



ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాల మేరకు అన్ని ప్రభుత్వ విభాగాలకు దిశానిర్దేశం చేసేందుకు మూడు రోజులుగా విభాగాల వారీగా ఆయన సమీక్ష నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు శుక్రవారం వ్యవసాయం, సహకార, పశుసంవర్ధక, డెయిరీ అభివృద్ధి, మత్స్య, అటవీ, పర్యావరణం, శాస్త్ర సాంకేతిక, ఆహార, పౌర సరఫరాల, కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీలు, జీఏడీ సర్వీసెస్ శాఖలపై సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ విజన్ 2047 కార్యాచరణ ప్రణాళికను దృష్టిలో పెట్టుకొని నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు. అదే విధంగా భవిష్యత్ లో యూరియా, ఎరువుల పంపిణీ ఐటీ ఆధారిత సేవల ద్వారా పటిష్టంగా పంపిణీ చేయాలని సూచించారు. వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, హార్టికల్చర్ శాఖల్లో అమలవుతున్న పథకాలపై సమీక్షించారు. ఆయిల్ పామ్ ప్లాంటేషన్, ప్రజల అవసరాల మేరకు పండ్లు, కూరగాయల పెంపకం విస్తృతంగా ప్రోత్సహించాలని సీఎస్ అధికారులకు సూచించారు. ప్రభుత్వం హైబ్రిడ్ మోడ్ లో భాగంగా చేపట్టిన రంగారెడ్డి జిల్లా కోహెడ మార్కెట్ నిర్మాణ పనులపై సమీక్ష చేశారు. అదే విధంగా రాష్ట్రంలో రైతుల సంక్షేమం, పంటల దిగుబడి, రైతు సమస్యల పట్ల వ్యవసాయ శాఖ నిరంతర మానిటరింగ్ చేయాలన్నారు. డిజిటల్ క్రాప్ సర్వే కూడా నిర్వహించాలని సూచించారు.

రాష్ట్రంలో వ్యవసాయ రంగం ప్రస్తుత స్థితిగతులు, రైతులకు అందుతున్న సేవలు, సాగునీటి లభ్యత, విత్తనాలు -ఎరువుల సరఫరా, పంటల దిగుబడి, అలాగే సహకార శాఖ ద్వారా అమలవుతున్న వివిధ పథకాల పురోగతిపై సమగ్రంగా చర్చించారు. రాబోయే సాగు కాలానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు తగినంతగా అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా స్థాయిలో పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని సూచించారు.

సహకార సంఘాల పనితీరు, రైతు సహకార సంఘాల ఆర్థిక స్థితి, రుణాల పంపిణీ పై సమీక్ష చేశారు. సహకార సంఘాలను మరింత పటిష్టం చేసి రైతులకు మెరుగైన సేవలు అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పారదర్శకతతో కూడిన వ్యవస్థను అమలు చేయాలని, రైతుల విశ్వాసాన్ని పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలవుతున్నాయా లేదో నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. సమస్యలు ఎదురైన చోట వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు.

**ఇతర శాఖలపై సమీక్ష..**

పశుసంవర్ధక, డెయిరీ అభివృద్ధి, మత్స్యశాఖలపై సీఎస్ సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పశుసంవర్ధక రంగం అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, డెయిరీ రంగంలో ఉత్పత్తి పెంపు, రైతులకు మెరుగైన ఆదాయం కల్పించడంపై చేపట్టిన కార్యక్రమాలు, మత్స్యశాఖ ద్వారా మత్స్యకారుల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాల పురోగతిని ప్రధాన కార్యదర్శి సమీక్షించారు. అనంతరం పర్యావరణం, అటవీ, కాలుష్య నియంత్రణపై సమీక్షించారు. ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణ, అటవీ విస్తీర్ణం పెంపు, జీవ వైవిధ్య సంరక్షణ, వాతావరణ మార్పుల ప్రభావం తగ్గింపు దిశగా చేపడుతున్న చర్యలపై అధికారులు సి.ఎస్ కు వివరించారు. పౌర సరఫరాల శాఖపై సీఎస్ సమీక్షిస్తూ శాఖ పరిధిలో అమలవుతున్న వివిధ పథకాలు, ప్రజలకు అందుతున్న సేవలు, సరఫరా వ్యవస్థ పనితీరు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రధానంగా ప్రజా పంపిణీ వ్యవస్థ, లబ్ధిదారులకు సన్న బియ్యం, గోదాముల్లో నిల్వలు తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. ఆ తర్వాత ఉపాధి శిక్షణ, ఫ్యాక్టరీల శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శాఖల వారీగా అమలవుతున్న పథకాల గురించి ఆరా తీశారు. కార్మికుల సంక్షేమానికి సంబంధించిన పథకాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ఉపాధి కల్పన లక్ష్యంగా చేపడుతున్న శిక్షణ కార్యక్రమాలు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఉండాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు దాన కిషోర్, బీఎండీ ఎక్కా, అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్ సువర్ణ, వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పశుసంవర్ధక శాఖ కార్యదర్శి ఇలంబర్తి, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, మత్స్యశాఖ కమిషనర్ నిఖిల, హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి ఇ.శ్రీధర్, డైరెక్టర్ సెన్సెస్ భారతీ హోళికేరి, ఐటీ శాఖ ప్రత్యేక కార్యదర్శి భవేష్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

# చీకటి గదిలో నిజాం నగలు వెల వెల...!

- ఎందుకు దాచేస్తున్నారు..?

**ముద్ర న్యూస్:**





హైదరాబాద్ రాజ్య వైభవానికి ఎంతో కీర్తి ప్రతిష్టలు తెచ్చిన నిజాం నగల కథ కేవలం ధనవంతుల ఆభరణాల ముచ్చట కాదు. అది ఒక రాజ్య చరిత్రకు, శిల్పకళా నైపుణ్యానికి సజీవ సాక్ష్యం. ప్రపంచ ప్రసిద్ధ గోల్కొండ వజ్రాల నుంచి సముద్రపు ముత్యాల వరకు ఈ నిధిలో ఉన్న ప్రతి రత్నం ఒక వీరగాథను వినిపిస్తుంది. అయితే, దశాబ్దాలుగా ఈ నిధులు సామాన్య ప్రజల కంటికి కనబడకుండా రిజర్వ్ బ్యాంక్ చీకటి గదుల్లో బందీలుగా ఉండటం చర్చనీయాంశంగా మారింది.

**కళాఖండాల వారసత్వం..**

నిజాం నగల విశిష్టతను కేవలం క్యారెట్లలో కొలవలేం. ప్రపంచంలోనే ఐదవ అతిపెద్ద వజ్రమైన జాకబ్ డైమండ్ మొదలుకొని, పచ్చల హారాలు, ముత్యాల జేబు గడియారాల వరకు ఈ సేకరణలో 173 అపురూప వస్తువులు ఉన్నాయి. వీటి విలువ నేడు వేల కోట్ల రూపాయల్లో ఉండవచ్చు. కానీ వాటి చారిత్రక విలువ వెలకట్టలేనిది. నిజాం నవాబులు కళలకు ఇచ్చిన ప్రాధాన్యత, వారి జీవనశైలిలోని విలాసం ఈ ఆభరణాల్లో స్పష్టంగా కనిపిస్తుంది.

**న్యాయపోరాటం - భద్రత..**

1948లో హైదరాబాద్ విలీనం తర్వాత, ఈ నగల యాజమాన్యంపై సుదీర్ఘ కాలం పాటు చట్టపరమైన సందిగ్ధత కొనసాగింది. చివరికి 1995లో భారత ప్రభుత్వం సుమారు ₹218 కోట్లు చెల్లించి వీటిని నిజాం ట్రస్ట్ నుంచి స్వాధీనం చేసుకుంది. అప్పటి నుంచి ఇవి ముంబైలోని ఆర్బీఐ భద్రతలో ఉన్నాయి. అప్పుడప్పుడు ఢిల్లీ లేదా హైదరాబాద్‌లోని సాలార్ జంగ్ మ్యూజియంలో ప్రదర్శించినప్పటికీ అవి స్వల్ప కాలానికే పరిమితమయ్యాయి.

**హైదరాబాద్‌కే దక్కాలి.. ఎందుకు?**

ఈ ఆభరణాలను శాశ్వతంగా హైదరాబాద్‌లో ప్రదర్శించాలనే డిమాండ్ సమంజసమైనదే. ఈ నగలు పుట్టింది, పెరిగింది, వాడబడింది హైదరాబాద్ గడ్డపైనే. ఇక్కడి సంస్కృతిలో ఇవి అంతర్భాగం. వీటిని ఇక్కడ ప్రదర్శించడం వల్ల తెలంగాణ పర్యాటక రంగానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వస్తుంది. వారసత్వ సంపద అనేది ప్రజలందరూ చూసి గర్వపడటానికి ఉండాలి తప్ప, ఇనుప పెట్టెల్లో దాచడానికి కాదు. ప్రభుత్వం పేర్కొంటున్నట్లు భద్రత అనేది అతిపెద్ద సవాలు. అల్ట్రామోడ్రన్ సెక్యూరిటీ సిస్టమ్స్‌తో కూడిన ప్రత్యేక మ్యూజియంను హైదరాబాద్‌లో నిర్మించడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చు. రాజ్యసభలో ఇటీవల కేంద్ర మంత్రి ఇచ్చిన సమాధానం కొంత ఆశను కల్పించినప్పటికీ తుది నిర్ణయం తీసుకోలేదనే మాట ప్రజల్లో అసహనాన్ని కలిగిస్తోంది. నిజాం నగలు కేవలం లోహపు ముక్కలు కావు, అవి తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీకలు. వీటిని ఢిల్లీ లేదా ముంబై వాల్ట్స్‌లో ఉంచడం కంటే, వాటి అసలు నివాసమైన హైదరాబాద్‌లో ప్రదర్శనకు ఉంచడమే ఆ కళాఖండాలకు మనం ఇచ్చే నిజమైన గౌరవం. కేంద్ర ప్రభుత్వం భద్రతా కారణాలను సాకుగా చూపకుండా త్వరితగతిన కార్యాచరణను రూపొందించాల్సిన అవసరం ఉంది.

# రేవంత్ రెడ్డికి హార్వర్డ్ సర్టిఫికెట్

- - వర్సిటీలో పొలిటికల్ కోర్సు పూర్తిచేసిన సీఎం
-- ఐదు రోజులపాటు తరగతులకు హాజరు
- శిక్షణ మెరుగైన పాలనకు ఉపయోగమన్న సీఎం

**ముద్ర న్యూస్ :**



తెలంగాణ సీఎం ఏ.రేవంత్‌రెడ్డి ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయంలోని కెన్నెడీ స్కూల్‌లో నిర్వహించిన కార్యనిర్వాహక విద్య కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేశారు. ఇరవై ఒకటవ శతాబ్దంలో నాయకత్వం – అవ్యవస్థ, సంఘర్షణలు, ధైర్యం అనే అంశంపై నిర్వహించిన ఈ రాజకీయ నాయకత్వ కోర్సును పూర్తిచేసి ఆయన ధ్రువీకరణ పత్రాన్ని పొందారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో 62 మంది అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఐదు రోజులపాటు తరగతులకు హాజరు..జనవరి 25న ప్రారంభమైన ఈ కోర్సు జనవరి 30 వరకు ఐదు రోజుల పాటు కొనసాగింది. ప్రపంచంలోని ఇరవైకి పైగా దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు ఈ శిక్షణలో భాగస్వాములయ్యారు. అమెరికాలోని కేంబ్రిడ్జ్ నగరంలో మైనస్ 24 డిగ్రీల తీవ్ర చలిలోనూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తరగతులకు హాజరై శిక్షణ పొందారు. ఈ కోర్సులో భాగంగా నాయకత్వ నైపుణ్యాలు, పరిపాలనా విధానాలు, అధికార నిర్వహణ, సంఘర్షణల పరిష్కారం, అనిశ్చిత పరిస్థితుల్లో నిర్ణయాలు తీసుకోవడం వంటి అంశాలపై లోతైన అవగాహన కల్పించారు. కేసు అధ్యయనాలు, సమూహ చర్చలు, పరస్పర సంప్రదింపుల ఆధారిత కార్యక్రమాల ద్వారా శిక్షణ అందించారు. రేవంత్ రెడ్డికి హార్వర్డ్ సర్టిఫికెట్ ప్రదానం..ఈ శిక్షణ అనుభవం రాష్ట్ర పాలనను మరింత సమర్ధవంతంగా, ప్రజాహితంగా నిర్వహించేందుకు దోహదపడుతుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అంతర్జాతీయస్థాయి నాయకత్వ పాఠాలు తెలంగాణ అభివృద్ధికి ఉపయోగపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రోగ్రామ్ ముగిసిన సందర్భంగా హార్వర్డ్ అధ్యాపకులు రేవంత్ రెడ్డితోపాటు మిగిలిన 62మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అయితే భారతదేశ చరిత్రలో అధికారంలో ఉండగానే హార్వర్డ్ నుంచి ఈ రకమైన సర్టిఫికెట్ పొందిన తొలి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి రికార్డ్ సృష్టించారు.

# రూ. 8 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

## పీఏసీ ఛైర్మన్ అరికెపూడి గాంధీ శంకుస్థాపనలు

**ముద్ర, శేరిలింగంపల్లి :**

పీఏసీ ఛైర్మన్ అరికెపూడి గాంధీ శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పలు డివిజన్లలో సుమారు రూ.8 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మియాపూర్, చందానగర్, ఆల్విన్ కాలనీ, హైదర్‌నగర్ డివిజన్ల పరిధిలో భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు.

**మియాపూర్ డివిజన్‌లో భూగర్భ డ్రైనేజీ పనులు..**

మియాపూర్ డివిజన్ పరిధిలోని దోవా కాలనీ, శ్రీల గార్డెన్, న్యూ కాలనీ, శ్రీలక్ష్మీ నగర్, ఎఫ్‌సీఐ కాలనీ, టీఎన్ నగర్, ఎంఏ నగర్, ప్రశాంత్ నగర్, నాగార్జున ఎన్క్లేవ్, బీకే ఎన్క్లేవ్, రెడ్డి కాలనీ, మక్త మహబూబ్‌పేట్ గ్రామం, కృష్ణ సాయి, జనప్రియ వెస్ట్ సిటీ కాలనీలలో రూ.4 కోట్ల 70లక్షల 35వేల అంచనా వ్యయంతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, జలమండలి అధికారులతో కలిసి అరికెపూడి గాంధీ శంకుస్థాపన చేశారు.

**చందానగర్, ఆల్విన్ కాలనీల్లో అభివృద్ధి పనులు..**

చందానగర్ డివిజన్ పరిధిలోని శుభోదయ కాలనీ, సత్య ఎన్క్లేవ్, శంకర్ నగర్ కాలనీలలో రూ.84 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు కార్పొరేటర్లు మంజుల రఘునాథ్ రెడ్డి, నార్నె శ్రీనివాసరావు పాల్గొన్నారు. అలాగే ఆల్విన్ కాలనీ డివిజన్‌లోని తులసి నగర్ ఫేజ్-2, పీజేఆర్ నగర్ కాలనీలలో రూ.57 లక్షల 25 వేల అంచనా వ్యయంతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు కూడా శంకుస్థాపన చేశారు.

**హైదర్‌నగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణం..**

హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌ఎమ్‌టీలోని శాతవాహన నగర్, అడ్డగుట్ట కాలనీల్లో రూ.62 లక్షల 50 వేల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావుతో కలిసి పీఏసీ ఛైర్మన్ అరికెపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో అధికారులు, పార్టీ సీనియర్ నాయకులు, మహిళలు, యువకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# భారత్‌పై దాడికి కుట్ర..!

- పాక్ సైన్యంలో అసంతృప్తి ప్రభావం
-పాక్ ప్రజల్లో అసంతృప్తిని చల్లార్చేందుకు భారత్‌పై కుయుక్తులు
- నిఘా వర్గాల అంచనా?

**ముద్ర న్యూస్ :**

భారత్‌పై త్వరలో పాకిస్తాన్ దాడి చేయబోతోందా..? పుల్వామా తరహా దాడిని మించి దాడి చేయాలని కుట్ర చేస్తోందా..? దాడి ఎక్కడ చేయాలో ప్రణాళిక వేస్తోందా అంటే అవుననే అంటున్నారు పాకిస్తాన్ సైన్యంలో జరుగుతున్న పరిణామాలను గమనిస్తున్న విశ్లేషకులు. పాక్ సైన్యంలో తీవ్ర అస్థిరత పెరుగుతోంది. ఇందుకు ప్రధాన కారణం ఇజ్రాయెల్ తరపున పాలస్తీనాకు వెళ్లి హమాస్ ఉగ్రవాదులను మట్టుపెట్టాలని ఒత్తిడి చేయడమే. అమెరికా ఆదేశాలతో ఇంటర్నేషనల్ స్టెబిలైజేషన్ ఫోర్స్‌లో పాల్గొనాలని, హమాస్‌పై చర్యలు తీసుకోవాలని ఒత్తిడి పెరుగుతోంది. సౌదీతో కలిసి పనిచేస్తామని మొదట చెప్పి, హమాస్‌కు వ్యతిరేకంగా పనిచేయించే ఆలోచన ఆరణంగా సైనికుల్లో ఆగ్రహం, అసంతృప్తి చెలరేగుతున్నాయి. ప్రతినెలా సైనికుల మనోభావాలు సేకరించే నివేదికలు, దర్బార్ సమావేశాల్లో ఈ ఆందోళనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పాలస్తీనియన్లకు వ్యతిరేకంగా పనిచేయడం తమ సంస్కృతికి విరుద్ధమని సైనికులు భావిస్తున్నారు.

**భారత్‌ను రెచ్చగొట్టేందుకు దాడి ప్రణాళిక..**

పహల్గాం దాడిని మించే స్థాయి ఉగ్రవాద చర్యలు భారత్‌పై జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. కశ్మీర్, పంజాబ్ సరిహద్దు ప్రాంతాలు ప్రధాన లక్ష్యాలు. మధ్య ప్రాంతాల్లో కూడా దాడి చేసే అవకాశం ఉంది. పాక్ ఆర్మీ అంతర్జాతీయ కట్టుబాట్ల నుంచి తప్పించుకోవడానికి భారత్‌ను రెచ్చగొట్టే ఉద్దేశంతో ఉందని అంచనా. ఆఫ్ఘానిస్తాన్ సరిహద్దు ఉద్రిక్తతలు, ఖైబర్-పఖ్తూన్‌ఖ్వా, బలూచిస్తాన్‌లో అల్లర్లను సాకుగా చూపి సైన్యాన్ని ఉధృతం చేయాలని ప్రణాళిక రూపొందిస్తోంది. పుల్వామా తరహా దాడి జరిగితే, భారత ప్రతిస్పందనలో సైనికులను వినియోగించి గాజాకు వెళ్లే ఆలోచన నుంచి తప్పించుకోవాలని పాక్ భావిస్తోంది.

**అంతర్గత సమస్యలతో భారత్‌పై ప్రభావం**

సైనికుల ఆగ్రహాన్ని చల్లార్చేందుకు బాహ్య శత్రువును సృష్టించాలని పాక్ నాయకత్వం భావిస్తోంది. ఇది భారత్‌కు ప్రత్యక్ష ముప్పుగా మారే అవకాశం ఉంది. పాకిస్తాన్‌కు వాగ్దానాలు ఇచ్చి వాటి నుంచి తప్పించుకోవడం అలవాటేనని విశ్లేషకులు చెబుతున్నారు. ఇప్పటికే చైనా, యూఏఈ, అమెరికాకు ఇచ్చిన హామీలను ఉల్లంఘించిన చరిత్ర పాక్‌కు ఉంది. ఇప్పుడు ఇజ్రాయెల్ కట్టుబాట్ల నుంచి తప్పించుకోవడానికి భారత్‌ను లక్ష్యంగా చేసుకునే ఆలోచనలో ఉందని నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. భారత్, ఆఫ్ఘానిస్తాన్‌పై దాడులు జరిపించి, అనంతరం ప్రతిదాడులను ఎదుర్కొనేందుకు సైన్యం అవసరమని పేర్కొంటూ గాజాకు వెళ్లలేమని చెప్పేందుకు పాక్ ప్రణాళిక రచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో భారత్, ఆఫ్ఘానిస్తాన్ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# తెలంగాణలో ప్రవేశ పరీక్షల షెడ్యూల్ ఖరారు

## టీజీ ఈఏపీసీఈటీ, పీజీఈసీఈటీ, టెట్ తేదీల అధికారిక ప్రకటన

**ముద్ర, హైదరాబాద్ :**

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో నిర్వహించే వివిధ ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌ను అధికారులు అధికారికంగా విడుదల చేశారు. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ, పీజీ కోర్సుల ప్రవేశాలకు సంబంధించిన తేదీలను ఖరారు చేశారు.

**టీజీ ఈఏపీసీఈటీ- 2026 షెడ్యూల్**

ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే టీజీ ఈఏపీసీఈటీ2026 నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 14, 2026న విడుదల చేయనున్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభమవుతుంది. ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా ఏప్రిల్ 4 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. పరీక్షల విషయానికి వస్తే అగ్రికల్చర్ మరియు ఫార్మసీ విభాగాల పరీక్షలు మే 4, 5 తేదీల్లో, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించిన పరీక్షలు మే 9 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ ఏడాది కూడా జేఎన్టీయూ-హైదరాబాద్ ఆధ్వర్యంలోనే ఈ పరీక్షలు జరగనున్నాయి.

**- టీజీ పీజీఈసీఈటీ-2026 వివరాలు**

జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ (జేఎన్టీయూహెచ్) మరియు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సంయుక్తంగా టీజీ పీజీఈసీఈటీ2026 షెడ్యూల్‌ను ఖరారు చేశాయి. ఈ పరీక్షకు సంబంధించిన నోటిఫికేషన్ జనవరి 30న విడుదల కానుంది. ఫిబ్రవరి 23 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభమై, ఫిబ్రవరి 27 వరకు ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా స్వీకరిస్తారు. మే 6న హాల్‌టికెట్లు విడుదల చేయనుండగా, మే 28 నుంచి 31 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.

**- తెలంగాణ టెట్ అప్‌డేట్..**

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు సంబంధించి కూడా అధికారులు కీలక అప్‌డేట్ ఇచ్చారు. ఈ నెల 3 నుంచి 20 వరకు నిర్వహించిన టెట్ పరీక్షల ప్రాథమిక కీని విడుదల చేశారు. అభ్యర్థులు ప్రాథమిక కీపై అభ్యంతరాలు ఉంటే మార్చి 31 వరకు ఫిర్యాదు చేసుకునే అవకాశం కల్పించారు.

# మూడేళ్ల యుద్ధానికి ముగింపు సంకేతాలా?

## రష్యా–ఉక్రెయిన్ శాంతికి అడుగులు

**ముద్ర న్యూస్ :**

రష్యా-ఉక్రెయిన్ మధ్య మూడేళ్లకు పైగా కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు సంకేతాలు కనిపిస్తున్నాయా అన్న చర్చ అంతర్జాతీయంగా ఊపందుకుంది. ఇటీవల యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో జనవరి 23-24 తేదీల్లో అమెరికా, రష్యా, ఉక్రెయిన్ దేశాల మధ్య తొలి త్రైపాక్షిక సమావేశం జరిగింది. ఈ భేటీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ, ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న యుద్ధం ముగియాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలొదిమిర్ జెలెన్‌స్కీని శాంతి చర్చల కోసం మాస్కోకు రావాలని రష్యా ఆహ్వానించింది. జెలెన్‌స్కీ భద్రతకు పూర్తి హామీ ఇస్తామని రష్యా స్పష్టం చేసింది. ఈ విషయాన్ని రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ వెల్లడించారు. మూడున్నరేళ్లుగా కొనసాగుతున్న యుద్ధాన్ని ముగించేందుకు ఇరు దేశాలు సమాయత్తం అవుతున్నట్లు ఆయన వ్యాఖ్యలు సంకేతాలిచ్చాయి.

**- శాంతి చర్చలపై రష్యా ఆసక్తి..**

శాంతి చర్చలపై రష్యా ఆసక్తి వ్యక్తం చేస్తోందని, అయితే జెలెన్‌స్కీ సమావేశానికి సిద్ధమైతేనే చర్చలు ముందుకు సాగుతాయని పుతిన్ సన్నిహితుడు యూరీ ఉషాకోవ్ తెలిపారు. జెలెన్‌స్కీ భద్రతపై ఎలాంటి సందేహాలు అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. త్రైపాక్షిక సమావేశం అనంతరం ఈ ఆహ్వానం రావడం అంతర్జాతీయ రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. 2022 ఫిబ్రవరిలో ప్రారంభమైన రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఇప్పటికీ కొనసాగుతుండగా, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత యుద్ధ విరమణకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో జరిగిన తొలి త్రైపాక్షిక సమావేశం, ఆపై జెలెన్‌స్కీకి రష్యా నుంచి వచ్చిన ఆహ్వానం శాంతి ప్రక్రియకు దారితీసే కీలక మలుపుగా మారుతుందా అన్నది వేచి చూడాల్సి ఉంది.

# ఎడ్ సెట్ పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి

**ముద్ర, శేరిలింగంపల్లి :**

టిసాట్ నెట్వర్క్ ఛానళ్లు ప్రసారం చేసే ఎడ్ సెట్ ప్రసారాల షెడ్యూల్ పోస్టర్‌ను రాష్ట్ర ఐటి, పరిశ్రమలు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆవిష్కరించారు. సచివాలయంలోని తన ఛాంబర్ లో టిసాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డితో కలిసి ప్రసారాల వివరాలు తెలిపే షెడ్యూల్ పోస్టర్ ను ఆవిష్కరించి మాట్లాడుతూ.. ఎడ్యుకేషన్ కామన్ ఎంటెన్ట్ టెస్ట్‌లో ఉన్నతమైన ర్యాంకులు సాధించేందుకు టిసాట్ అందించే డిజిటల్ కంటెంట్ ను సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా బీఈడీ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్యకు ప్రత్యేక ప్రధాన్యత నిస్తుందని, ప్రభుత్వం భర్తీ చేసే ఉపాధ్యాయ పోస్టులకు అర్హత సాధించేందుకు ప్రాథమిక స్థాయిలో నిర్వహించే పోటీ పరీక్షలకు డిజిటల్ కంటెంట్ జిందా తిలస్మాత్ వలె పనిచేస్తుందని మంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మే నెలలో జరిగే ఎడ్ సెట్ పరీక్ష కోసం తెలంగాణ నిరుద్యోగ యువతను సిద్ధం చేసేందుకు ఫిబ్రవరి రెండవ తేది నుండి మే 11వ తేది వరకూ రోజుకు నాలుగు గంటల పాటు 392 ఎపిసోడ్స్ ప్రసారం చేస్తున్నామన్నారు. బయాలజీ, ఫిజికల్ సైన్స్, మాథమేటిక్స్, సోషల్ స్టడీస్, ఇంగ్లీష్, తెలుగు సబ్జెక్టులతో 98 రోజుల పాటు టిసాట్ విద్య, నిపుణ ఛానళ్లతో పాటు టిసాట్ యాప్, యూట్యుబ్ లో ప్రసారాలు కొనసాగుతాయన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో టిసాట్ ఎగ్జుక్యూటీవ్ డైరెక్టర్ ఎం.డి సాధిక్ పాల్గొన్నారు.



# వారంలోగా అజెండాలు సిద్ధం చేయండి

- ఏపీ, తెలంగాణకు కేంద్ర జల వివాదాల పరిష్కార కమిటీ ఆదేశాలు?
- తెలుగు రాష్ట్రాల నదీ జల వివాదాలపై కమిటీ భేటీ
-చుక్క నీటిని వదులుకోమన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**ముద్ర, న్యూఢిల్లీ :**

తెలుగు రాష్ట్రాల మధ్య నదీ జల వివాదాలపై ఏర్పాటైన కేంద్ర జల వివాదాల పరిష్కార కమిటీ సమావేశం శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. న్యూఢిల్లీ కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) కార్యాలయంలో సీడబ్ల్యూసీ ఛైర్మన్ అధ్యక్షతన దాదాపు రెండు గంటల పాటు ఈ సమావేశం కొనసాగింది. ఈ భేటీలో సీడబ్ల్యూసీ అధికారులు, కృష్ణా నది యాజమాన్య మండలి (కేఆర్‌ఎంబీ), గోదావరి నది యాజమాన్య మండలి (జీఆర్‌ఎంబీ), నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యూడీఏ) ప్రతినిధులు, తెలుగు రాష్ట్రాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం తెలంగాణ ఇరిగేషన్ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జ మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం తరపున 12 అంశాలను చర్చకు ప్రతిపాదించినట్లు తెలిపారు. పోలవరం, నల్లమల సాగర్ ప్రాజెక్టులను అజెండాలో చేర్చవద్దని స్పష్టం చేసినట్లు చెప్పారు. కృష్ణా, గోదావరి నదులకు సంబంధించిన అనేక సమస్యలు, వివాదాలు కొనసాగుతున్నప్పటికీ, ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన అజెండాను వెల్లడించలేదని పేర్కొన్నారు. ట్రైబ్యునల్ తీర్పు వచ్చే వరకు 50 శాతం నీటిని వినియోగించుకునే అవకాశం ఇవ్వాలని తెలంగాణ కోరిందన్నారు. తెలంగాణ అధికారులు ప్రతిపాదించిన పలు అంశాలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేయగా, ఇరు రాష్ట్రాల వాదనలు విన్న సీడబ్ల్యూసీ ఛైర్మన్ వారంలోగా అజెండా అంశాలను ఖరారు చేసి లిఖితపూర్వకంగా సమర్పించాలని ఆదేశించారు. రెండు రాష్ట్రాల అజెండాలు ఖరారైన అనంతరం తదుపరి సమావేశం తేదీని నిర్ణయిస్తామని వెల్లడించారు.

**చుక్క నీటినీ వదులుకోం : మంత్రి ఉత్తమ్**

కృష్ణా, గోదావరి నదీ జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటాలో ఒక్క చుక్క నీటినీ వదులుకునే ప్రసక్తే లేదని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఢిల్లీలో జరిగిన సమావేశంలో చర్చించిన అంశాలను తెలుసుకుని మాట్లాడాలని బీఆర్ఎస్ నేత హరీష్ రావుకు సూచించారు. నల్లమల సాగర్, పోలవరం ప్రాజెక్టులకు కేంద్రం అనుమతి లేదని కేంద్ర మంత్రి ఇటీవలే లేఖ ద్వారా తెలియజేశారని అన్నారు. పదేళ్ల పాలనలో కాళేశ్వరం ప్రాజెక్టు పరిస్థితికి బాధ్యులెవరో ప్రజలకు తెలుసన్నారు. నదీ జల హక్కుల సాధన కోసం పోరాడుతున్న కాంగ్రెస్ నాయకులపై విమర్శలు చేయడం మానుకోవాలని బీఆర్ఎస్ నేతలను మంత్రి హెచ్చరించారు.

# ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా అల్పాహారం

-- కామన్ స్కూల్ ఉంటేనే సమాజం ఉమ్మడి కుటుంబంగా ఎదుగుతుంది
- నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణం
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వెల్లడి

**ముద్ర ప్రతినిధి - ఉమ్మడి రంగారెడ్డిజిల్లా :**

కామన్ స్కూల్ విధానం అమలులోకి వస్తేనే సమాజం ఉమ్మడి కుటుంబంలా ఎదుగుతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. చిన్ననాటి నుంచే అందరూ ఒకే పాఠశాలలో చదువుకుంటే కులం, మతం, ధనిక-పేద అనే భేదాలు తొలగి సామాజిక సమానత్వం పెరుగుతుందని తెలిపారు. రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండలం మొగిలిగిద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 150వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కామన్ స్కూల్ భావనకు అనుగుణంగా ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను నిర్మిస్తున్నట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఒక్కో పాఠశాలను 25 ఎకరాల విస్తీర్ణంలో, ఒక్కొక్కదానికి రూ.200 కోట్ల వ్యయంతో 100 నియోజకవర్గాల్లో ఒకేసారి నిర్మిస్తున్నామని చెప్పారు. మొత్తం రూ.20 వేల కోట్లతో ఈ పాఠశాలల నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. ఆర్థిక పరిస్థితులు అనుకూలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత అల్పాహారం అందించే దిశగా సీఎం రేవంత్ రెడ్డి, కేబినెట్‌తో కలిసి ఆలోచన చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే సీఎం నియోజకవర్గంలో ఈ పథకాన్ని పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించామని గుర్తు చేశారు. రాష్ట్రం ప్రపంచంతో పోటీ పడాలంటే నాణ్యమైన మానవ వనరులు అవసరమని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అందుకే ఉచిత విద్య, ఉచిత వైద్యం ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని చెప్పారు. గత ఏడాది జనవరిలో సీఎం రేవంత్ రెడ్డి మొగిలిగిద్ద పాఠశాలను సందర్శించి రూ.10 కోట్ల నిధులు కేటాయించారని, ఆ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఐటీఐలను ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తూ, పరిశ్రమలకు అనుగుణంగా సిలబస్ రూపొందించామని వివరించారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం వడ్డీ లేని రుణాలు అందిస్తూ మొదటి ఏడాదిలోనే రూ.26 వేల కోట్ల చెక్కులు మహిళా సంఘాలకు పంపిణీ చేసినట్లు చెప్పారు.

**టీ20 వరల్డ్ కప్ 2026 ప్రత్యేకతలు**

స్టేడియంల ఉత్సాహం : రాత్రి మ్యాచ్‌లు, లైట్లు, మ్యూజిక్, ప్రేక్షకుల హర్షధ్వానాలు – ఇవన్నీ టీ20 వరల్డ్ కప్‌ను ఒక ఫెస్టివల్‌లా మార్చేస్తాయి.




# డబ్ల్యూపీఎల్‌కు కొత్త స్టార్...
## ఇండియన్ ఫ్యాన్స్ ఫేవరెట్‌గా లారెన్ బెల్




**ముద్ర, స్పోర్ట్స్**

ఈ ఏడాది డబ్ల్యూపీఎల్ ఆరంభానికి ముందు పెద్దగా పరిచయం లేని ఇంగ్లండ్ ఫాస్ట్ బౌలర్ లారెన్ బెల్, కొద్ది రోజుల్లోనే భారత అభిమానుల మనసు దోచుకుంది. వేగం, కచ్చితత్వం, డాట్ బాల్స్‌తో బ్యాటర్లపై ఒత్తిడి పెంచుతూ ఈ సీజన్‌లో లీగ్‌లోనే హాట్ టాపిక్‌గా మారింది. ఎనిమిది మ్యాచ్‌ల్లో 192 బంతులు వేస్తే 116 డాట్ బాల్స్ వేయడం, నాలుగు మెయిడెన్లలో రెండు ఆమె ఖాతాలో ఉండటం విశేషం. ఎకానమీ కేవలం 5.62తో 12 వికెట్లు తీసి అగ్ర బౌలర్లలో నిలిచింది. ఆర్సీబీ 8 మ్యాచ్‌ల్లో 6 విజయాలతో నేరుగా ఫైనల్ చేరడంలో ఆమె పాత్ర కీలకం.

అంతర్జాతీయంగా ఇప్పటికే తన సత్తా చాటిన బెల్, డబ్ల్యూపీఎల్‌లో మాత్రం ఈ సీజన్‌తోనే అడుగుపెట్టింది. గతంలో యూపీ వారియర్స్ ఆమెను కొనుగోలు చేసినా అవకాశాలు ఇవ్వలేదు. ఈసారి వేలంలో ఆర్సీబీ రూ.90 లక్షలకు కొనుగోలు చేయగా, ఆ ధరను మించిన ప్రదర్శనతో విమర్శలకు చెక్ పెట్టింది. ఆటతో పాటు ఆకర్షణీయమైన లుక్స్‌తో సోషల్ మీడియాలోనూ ఆమె హవా నడుస్తోంది. డబ్ల్యూపీఎల్ ముందు లక్షల్లోనే ఉన్న ఆమె ఫాలోవర్లు ఇప్పుడు మిలియన్లకు చేరడం, లారెన్ బెల్ క్రేజ్‌కు నిదర్శనంగా నిలుస్తోంది

# సంజూకు బాడీగార్డ్ గా మారిన సూర్య...

పొట్టి ప్రపంచకప్‌కు ముందు సన్నాహకాలను జోరుగా కొనసాగిస్తున్న భారత జట్టు, ప్రిపరేషన్ సిరీస్‌ను విజయంతో ముగించాలనే ధీమాతో ఉంది. ఇప్పటికే వరుసగా మూడు మ్యాచ్‌లు గెలిచి సిరీస్‌ను ఖరారు చేసుకున్న టీమిండియా, చివరి టీ20లోనూ విజయం సాధించాలని భావిస్తోంది. ఈ క్రమంలో శుక్రవారం కేరళకు చేరుకున్న కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, కోచ్ గౌతం గంభీర్ బృందానికి అభిమానులు ఘన స్వాగతం పలికారు.

తిరువనంతపురం విమానాశ్రయంలో సూర్య చేసిన సరదా హడావిడి ఇప్పుడు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. లోకల్ హీరో సంజూ శాంసన్ కోసం 'దారి ఇవ్వండి.. చేటా వస్తున్నాడు' అంటూ అభిమానులను పక్కకు జరిపిన సూర్య, అతడికి బాడీగార్డ్‌లా మారిపోయాడు. ఈ సరదా దృశ్యాలు చూసి సంజూ చిరునవ్వులు చిందించగా, అక్కడున్న భద్రతా సిబ్బంది కూడా నవ్వులు ఆపుకోలేకపోయారు.

మరోవైపు ఐదు టీ20ల సిరీస్‌లో సంజూ ప్రదర్శన నిరాశపరిచింది. విశాఖ మ్యాచ్‌లో చేసిన 24 పరుగులే అతడి అత్యధిక స్కోర్. త్రివేండ్రంలో శనివారం జరిగే చివరి మ్యాచ్‌లో సొంతగడ్డపై సంజూ రాణించాలని అభిమానులు, మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది. వరల్డ్‌కప్ అవకాశాలు దక్కాలంటే ఈ మ్యాచ్‌లో అతడు తన సత్తా చాటాల్సిందే.



# టీమిండియాకు గుడ్ న్యూస్

- **ఫిట్‌నెస్ సాధించిన తిలక్ వర్మ... రీఎంట్రీపై ఆశలు**

**ముద్ర, స్పోర్ట్స్**

టీ20 ప్రపంచకప్-2026కు ముందు భారత జట్టుకు ఊరటనిచ్చే సమాచారం అందింది. గాయం కారణంగా న్యూజిలాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌కు దూరమైన హైదరాబాదీ స్టార్ బ్యాటర్ తిలక్ వర్మ పూర్తి ఫిట్‌నెస్ దిశగా కీలక అడుగు వేసినట్లు తెలుస్తోంది. అబ్డోమినల్ సర్జరీ అనంతరం బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో పునరావాస శిక్షణ పొందుతున్న తిలక్, శుక్రవారం నిర్వహించే సిమ్యులేషన్ మ్యాచ్‌లో పాల్గొననున్నాడు. ఈ మ్యాచ్‌లో తన ఫిట్‌నెస్‌ను నిరూపిస్తే బీసీసీఐ నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చే అవకాశం ఉంది. క్లియరెన్స్ లభిస్తే ఫిబ్రవరి 3న భారత జట్టుతో అతడు కలిసే ఛాన్స్ ఉందని వర్గాలు చెబుతున్నాయి. తిలక్ రీఎంట్రీతో టీమిండియా మిడిల్ ఆర్డర్ మరింత బలపడనుంది.

ఇదిలా ఉండగా, వెన్నునొప్పితో దాదాపు ఏడాది పాటు ఆటకు దూరమైన యువ పేసర్ మయాంక్ యాదవ్ కూడా పూర్తిగా కోలుకున్నాడు. ప్రపంచకప్ సన్నాహకాలలో భాగంగా జరిగే వార్మప్ మ్యాచ్‌లలో ఇండియాఏ తరఫున అతడు ఆడనున్నాడు. మరోవైపు భుజం గాయం నుంచి కోలుకున్న అస్సాం ఆటగాడు రియాన్ పరాగ్ యోయో టెస్ట్‌ను విజయవంతంగా పూర్తి చేసి, తిలక్‌తో కలిసి సిమ్యులేషన్ మ్యాచ్‌లో పాల్గొననున్నాడు. అయితే వన్డే సిరీస్‌లో గాయపడిన ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ ఇంకా పూర్తిగా కోలుకోలేదని, అతడికి ఫిబ్రవరి 4న ఫిట్‌నెస్ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. టీ20 వరల్డ్‌కప్ లీగ్ మ్యాచ్‌లకు వాషీ దూరమయ్యే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

# ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్‌కు అల్కరాజ్

- **గాయం భయాన్ని దాటుకుని జ్వెరెవ్‌పై అద్భుత విజయం**

**ముద్ర, స్పోర్ట్స్**

ఆస్ట్రేలియన్ ఓపెన్-2026లో స్పెయిన్ యువ సంచలనం, ప్రపంచ నంబర్ వన్ కార్లోస్ అల్కరాజ్ తన ఆధిపత్యాన్ని మరోసారి చాటాడు. శుక్రవారం జరిగిన ఉత్కంఠభరిత సెమీఫైనల్‌లో అలెగ్జాండర్ జ్వెరెవ్‌ను ఓడించి ఫైనల్ బెర్త్ ఖాయం చేసుకున్నాడు. ఐదు సెట్ల పాటు సాగిన ఈ హోరాహోరీ పోరులో అల్కరాజ్ 64, 76(5), 67(3), 67(4), 75తో విజయం సాధించాడు. తొలి రెండు సెట్లలో పైచేయి సాధించిన అల్కరాజ్, ఆపై జ్వెరెవ్ నుంచి గట్టి సవాల్ ఎదుర్కొన్నాడు. వరుసగా రెండు టైబ్రేక్ సెట్లు కోల్పోయినా, నిర్ణయాత్మక ఐదో సెట్‌లో అసాధారణ పోరాటంతో మ్యాచ్‌ను తనవైపు తిప్పుకున్నాడు. మూడో సెట్‌లో కుడికాలికి గాయం కావడంతో అల్కరాజ్ కొనసాగుతాడా అనే సందేహాలు నెలకొన్నాయి. మెడికల్ టైమ్ అవుట్ అనంతరం తిరిగి కోర్టులోకి వచ్చిన అతడు, కీలక ఘట్టంలో తన అసలైన ఆటను బయటపెట్టాడు. ఐదో సెట్‌లో 35తో వెనుకబడిన స్థితి నుంచి పుంజుకుని వరుసగా గేమ్‌లు గెలిచి ఫైనల్‌కు దూసుకెళ్లాడు. ఆదివారం జరిగే ఫైనల్లో అల్కరాజ్, డిఫెండింగ్ ఛాంపియన్ జానిక్ సినర్ లేదా అనుభవజ్ఞుడు నోవాక్ జోకోవిచ్‌లలో ఒకరితో తలపడే అవకాశం ఉంది. రెండో సెమీఫైనల్‌లో శనివారం సినర్, జోకోవిచ్‌లు తలపడనున్నారు.



# సెమీస్ ఆశలు నిలిపిన శ్రీలంక

- **సౌతాఫ్రికాపై ఐదు వికెట్ల కీలక విజయం**

**ముద్ర, స్పోర్ట్స్**

అండర్-19 పురుషుల వన్డే వరల్డ్‌కప్‌లో శ్రీలంక జట్టు కీలక విజయాన్ని అందుకుంది. సౌతాఫ్రికాతో జరిగిన సూపర్-6 మ్యాచ్‌లో ఐదు వికెట్ల తేడాతో గెలిచిన శ్రీలంక, సెమీఫైనల్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 261 పరుగులు చేసింది. ఓపెనర్ జోరిచ్ వాన్ షాల్క్విక్ అద్భుత సెంచరీతో (116) ఆకట్టుకోగా, అద్నాన్ లగాడియన్ (46), జేమ్స్ (47) విలువైన పరుగులు జోడించారు. శ్రీలంక బౌలింగ్‌లో విఘ్నేశ్వరన్ ఆకాశ్ నాలుగు వికెట్లు తీసి ప్రత్యర్థిని కట్టడి చేశాడు.

లక్ష్య ఛేదనలో శ్రీలంక 46 ఓవర్లలోనే ఐదు వికెట్లు మాత్రమే కోల్పోయి 265 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. ఓపెనర్ విరాన్ చముదిత సెంచరీతో (110) జట్టును గెలుపు దిశగా నడిపించాడు. ఇక సెమీఫైనల్ చేరాలంటే ఐర్లాండ్‌తో జరిగే సూపర్ సిక్స్ మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్ ఓడిపోవాల్సిన పరిస్థితి ఉంది. అఫ్గానిస్తాన్ గెలిస్తే సెమీఫైనల్ బెర్త్ ఖరారు అవుతుంది. ఇప్పటికే గ్రూప్-1 నుంచి ఆస్ట్రేలియా సెమీఫైనల్‌కు చేరింది.

ఈ పరాజయంతో సౌతాఫ్రికా వరల్డ్‌కప్ నుంచి నిష్క్రమించింది. సూపర్-6 దశలో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ ఓటమి పాలైన ప్రొటీస్, గ్రూప్-1 నుంచి ఐర్లాండ్‌తో కలిసి టోర్నీ నుంచి బయటపడ్డాయి. మొత్తం టోర్నీ అంతటా దక్షిణాఫ్రికా జట్టు నిరాశాజనక ప్రదర్శనతో అభిమానులను నిరుత్సాహపరిచింది.



# పాక్ వైఖరిపై ఇర్ఫాన్ పఠాన్ ఆగ్రహం

- **టీ20 వరల్డ్ కప్ ముందు అనిశ్చితి సృష్టించడమేంటని మండిపాటు**

**ముద్ర, స్పోర్ట్స్**

టీ20 వరల్డ్ కప్ విషయంలో పాకిస్తాన్ వ్యవహరిస్తున్న తీరుపై భారత మాజీ స్టార్ బౌలర్ ఇర్ఫాన్ పఠాన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. టోర్నీలో పాల్గొంటామని ముందే అంగీకరించి, ఒప్పందాలకు సంతకాలు చేసిన తర్వాత కూడా చివరి నిమిషంలో వెనక్కు తగ్గే సంకేతాలు ఇవ్వడం ఏంటని ఆయన ప్రశ్నించారు. ఇది అనవసర గందరగోళాన్ని సృష్టించడమేనని వ్యాఖ్యానించారు.

వచ్చే వారం నుంచే టీ20 వరల్డ్ కప్ ప్రారంభం కానుండగా, పాకిస్తాన్ తాజాగా మెలిక పెట్టడం చర్చనీయాంశంగా మారింది. బంగ్లాదేశ్‌ను టోర్నీ నుంచి తప్పిస్తూ ఐసీసీ తీసుకున్న నిర్ణయాన్ని పాక్ వ్యతిరేకిస్తోంది. ఈ క్రమంలో బంగ్లాదేశ్‌కు మద్దతుగా తాము కూడా టోర్నీలో ఆడాలా వద్దా అన్న విషయాన్ని పునరాలోచిస్తామని పాక్ ప్రకటించింది. ఈ అంశంపై తమ దేశ ప్రధాని తుది నిర్ణయం తీసుకుంటారని, ఈ నెల 30 లేదా వచ్చే నెల 2న స్పష్టత ఇస్తామని తెలిపింది. దీంతో టోర్నీలో పాకిస్తాన్ పాల్గొంటుందా లేదా అన్నదానిపై ఇంకా అనిశ్చితి కొనసాగుతోంది.

ఈ వ్యవహారంపై స్పందించిన ఇర్ఫాన్ పఠాన్, పాక్ వైఖరిని తీవ్రంగా తప్పుబట్టారు. తటస్థ వేదికల్లో టోర్నీ నిర్వహణకు అంగీకారం తెలిపిన తర్వాత కూడా ఇలాంటి ప్రకటనలు చేయడం తెలివితక్కువ చర్యగా ఆయన అభివర్ణించారు. మాట ఇచ్చిన తర్వాత చివరి క్షణంలో వెనక్కు తగ్గడం సరికాదని, ఇలాంటి అయోమయాన్ని సృష్టించడం ద్వారా పాకిస్తాన్ తన విశ్వసనీయతను తానే దెబ్బతీసుకుంటోందని వ్యాఖ్యానించారు.

ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభమయ్యే ఈ టీ20 వరల్డ్ కప్‌లో మొత్తం 20 జట్లు పాల్గొననున్నాయి. భారత్-పాకిస్తాన్ మధ్య హై వోల్టేజ్ మ్యాచ్ ఫిబ్రవరి 15న కొలంబోలో జరగనుంది. ఈ రెండు జట్లు ఉన్న గ్రూప్-ఏలో నమీబియా, నెదర్లాండ్స్, యూఎస్ఏ కూడా ఉన్నాయి.



# ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సంచలనం.. 37 ఏళ్ల రికార్డు బద్దలు

**ముద్ర, స్పోర్ట్స్**

ఆస్ట్రేలియన్ ఓపెన్ 2026లో మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో స్థానిక జోడీ ఒలివియా గడెకీ-జాన్ పియర్స్ సంచలన విజయం నమోదు చేసింది. వరుసగా రెండో ఏడాది కూడా టైటిల్‌ను కైవసం చేసుకున్న ఈ జోడీ, 37 ఏళ్లుగా నిలిచిన రికార్డును చెరిపేసింది. చివరిసారిగా 1988-89లో యానా నవోత్నా-జిమ్ పగ్ జోడీ వరుసగా రెండు ఎడిషన్లలో ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ కిరీటాన్ని గెలుచుకుంది.

ఈ తాజా విజయంతో గడెకీ-పియర్స్ మరో అరుదైన ఘనతను కూడా సాధించారు. 1963-64లో మార్గరెట్ కోర్ట్-కెన్ ఫ్లెచర్ జోడీ తర్వాత, స్వదేశంలో వరుసగా రెండు ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ టైటిళ్లు గెలిచిన జోడీగా వీరు చరిత్ర సృష్టించారు.రాడ్ లేవర్ ఎరీనాలో జరిగిన ఫైనల్లో గడెకీ-పియర్స్



జోడీ ఫ్రాన్స్‌కు చెందిన క్రిస్టినా మ్లాడెనోవిక్-మాన్యుయెల్ గినార్డ్‌లను 46, 63, 108తో ఓడించింది. ఉత్కంఠభరితంగా సాగిన సూపర్ టైబ్రేక్‌లో ఒక దశలో 57తో వెనుకబడినప్పటికీ, చివరి క్షణాల్లో ఐదు కీలక పాయింట్లు గెలుచుకుని టైటిల్‌ను తమ ఖాతాలో వేసుకుంది.

# టీ20 ప్రపంచకప్ హిస్టరీలోనే అత్యంత ఖరీదైన సీజన్ ఏదో తెలుసా?

**ముద్ర, స్పోర్ట్స్**

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 కోసం సర్వం సిద్ధమైంది. భారత్, శ్రీలంక సంయుక్తంగా నిర్వహించనున్న ఈ ఐసీసీ మెగా ఈవెంట్ కోసం అన్ని జట్లు సిద్ధమయ్యాయి. అయితే, ఇప్పటి వరకు జరిగిన టీ20 ప్రపంచకప్స్ లో మోస్ట్ ఎక్స్ పెన్సివ్ ఏదో ఓసారి చూద్దాం. 2007లో మొదలైన ఐసీసీ టీ20 ప్రపంచకప్ ఇప్పటి వరకు 9 ఎడిషన్స్ పూర్తి చేసుకుంది. 10 వ ఎడిషన్ ఫిబ్రవరి 7 నుంచి మొదలుకానుంది. ఈ క్రమంలో యూఎస్ఏ, వెస్టిండీస్‌లో జరిగిన 2024 టీ20 ప్రపంచ కప్ అత్యధిక ప్రైజ్ మనీ రికార్డ్ తో సంచలనం సృష్టించింది.

2024లో జరిగిన టీ20 ప్రపంచ కప్ కోసం ఐసీసీ రికార్డు స్థాయిలో $11.25 మిలియన్ల బహుమతిని అందించిన సంగతి తెలిసిందే.




దీంతో ఐసీసీ టీ20 ప్రపంచకప్ హిస్టరీలో 2024 అత్యంత ఖరీమైన ప్రపంచకప్‌గా స్థానం దక్కించుకుంది. ఈ మేరకు ఐసీసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ జియోఫ్ అలార్డిస్ మాట్లాడుతూ.. " ఈ ఈవెంట్ అనేక విధాలుగా చారిత్రాత్మకమైనది. కాబట్టి ఆటగాళ్లకు ఇచ్చే బహుమతి డబ్బు దానిని ప్రతిబింబించడం సముచితం" అంటూ చెప్పుకొచ్చారు. అలాగే, టోర్నమెంట్ మొదటి రౌండ్‌లో 40 మ్యాచ్‌లతో ప్రారంభమైంది. ఆ తరువాత సూపర్ 8లు జరిగాయి.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
31.01.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**టీ20 వరల్డ్ కప్ 2026 ప్రత్యేకతలు**

ప్రపంచవ్యాప్త వీక్షణ : కోట్లాది మంది టీవీలు, మొబైల్‌లలో ఈ టోర్నీని వీక్షిస్తారు. సోషల్ మీడియాలో కూడా భారీ చర్చలు, ట్రెండ్స్ కనిపిస్తాయి.




# దర్శకధీరుడు మాట నిలబెట్టుకుంటాడా?

**వారణాసి విడుదల తేదీని ప్రకటించిన రాజమౌళి**

సూపర్‌స్టార్ మహేశ్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ పాన్‌వరల్డ్ చిత్రం 'వారణాసి' విడుదల తేదీపై అధికారిక స్పష్టత వచ్చింది. రాజమౌళి తన ఎక్స్ ఖాతా ద్వారా ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా ఏప్రిల్ 7, 2027న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు ప్రకటించాడు. ఎన్నో రోజులుగా వినిపించిన ఊహాగానాలకు ఈ ప్రకటనతో ముగింపు పలికినట్టైంది.

**పండుగలు, సెలవుల్ని దృష్టిలో పెట్టుకున్న రిలీజ్ ప్లాన్**

ఉగాది, గుడి పడ్వా వంటి సంప్రదాయ పండుగలతో పాటు అంబేద్కర్ జయంతి, శ్రీరామనవమి సందర్భంగా వచ్చే వరుస సెలవులు బాక్సాఫీస్‌కు కలిసి వచ్చేలా ఈ తేదీని ఎంపిక చేసినట్లు సమాచారం. భారీ అంచనాలున్న సినిమాకు అనుకూలమైన విండోగా ఈ కాలాన్ని మేకర్స్ భావిస్తున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి.

**'రుద్ర'గా మహేశ్... ఐమ్యాక్స్‌లో టైమ్ ట్రావెల్ అనుభవం**

ఈ చిత్రంలో మహేశ్ బాబు 'రుద్ర' అనే శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నాడు. గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తుండగా, మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన ప్రతినాయకుడి పాత్రలో దర్శనమివ్వనున్నాడు. పురాణాల నేపథ్యంతో టైమ్ ట్రావెల్ అంశాన్ని మేళవిస్తూ తెరకెక్కుతున్న ఈ సినిమాకు ఆస్కార్ అవార్డు గ్రహీత ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్నాడు. భారతీయ సినిమా చరిత్రలోనే అరుదైన ప్రయత్నంగా 1.43:1 ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో చిత్రీకరణ జరుగుతోంది. రాజమౌళి శైలిలో ప్రమోషన్లు ముందుగానే మొదలవ్వడంతో 'వారణాసి' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందోనన్న ఆసక్తి ఇప్పుడు గట్టిగా నెలకొంది.








# పిల్లల భవిష్యత్తుపై సోనూ సూద్ హెచ్చరిక

**16 ఏళ్లలోపు వారికి సోషల్ మీడియా నిషేధం కావాలంటూ పిలుపు**

పిల్లల భవిష్యత్తు, పెరుగుతున్న డిజిటల్ వ్యసనంపై బాలీవుడ్ నటుడు సోనూ సూద్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విస్తృత చర్చకు దారితీశాయి. 16 ఏళ్లలోపు పిల్లలను సోషల్ మీడియా నుంచి దూరంగా ఉంచాల్సిన అవసరం ఉందంటూ ఆయన చేసిన పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. నేటి పరిస్థితుల్లో పిల్లలు భోజనం చేస్తూనే మొబైల్ ఫోన్లలో మునిగిపోతున్నారని, దీనిని తల్లిదండ్రులు కూడా పట్టించుకోవడం లేదని సోనూ సూద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇది సమాజం వెళ్లాల్సిన దారి కాదని ఆయన హెచ్చరించారు.

ఈ నేపథ్యంలోనే మైనర్లకు సోషల్ మీడియా పరిమితులు తక్షణ అవసరమని పేర్కొన్న సోనూ సూద్, ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ దిశగా చర్యలు ప్రారంభించిందని గుర్తు చేశారు. త్వరలో గోవా ప్రభుత్వం కూడా ఇదే విధానాన్ని అమలు చేసే అవకాశం ఉందని తెలిపారు. ఈ అంశాన్ని ఒక జాతీయ ఉద్యమంగా తీసుకెళ్లాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరిన ఆయన, పిల్లల మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం సమాజం మొత్తం బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలతో ఆయన చేసిన పోస్ట్ ప్రస్తుతం విస్తృతంగా షేర్ అవుతోంది.

# జై భీమ్ కు తమిళనాడు అగ్రస్థానం

- **నేషనల్ అవార్డుకు కౌంటర్ అంటున్న సినీ విమర్శకులు**

జాతీయ సినీ అవార్డుల జాబితా వెలువడిన ప్రతిసారీ అభిప్రాయ భేదాలు సహజమే. కొన్ని సినిమాలు, కొన్ని పాత్రలు న్యాయానికి దూరమయ్యాయనే భావన ప్రేక్షకుల్లోనూ, సినీ వర్గాల్లోనూ వినిపిస్తుంటుంది. 2021కి సంబంధించిన జాతీయ అవార్డులు ప్రకటించినప్పుడు ఇదే తరహా చర్చ ఎక్కువగా జరిగిన చిత్రం 'జై భీమ్'.

సూర్య కథానాయకుడిగా నటించిన ఈ చిత్రానికి దర్శకుడు టీజీ జ్ఞానవేల్. కొత్త దర్శకుడైనా, సామాజిక బాధ్యత కలిగిన అంశాన్ని బలమైన కథనంతో తెరపైకి తీసుకొచ్చాడు. నేరం చేయకపోయినా పోలీసు కేసులో ఇరుక్కుని కస్టడీలో ప్రాణాలు కోల్పోయిన ఓ వ్యక్తి కుటుంబానికి న్యాయం చేయాలంటూ పోరాడే న్యాయవాది కథే 'జై భీమ్'. నిజ జీవిత సంఘటనల ఆధారంగా రూపొందిన ఈ సినిమా థియేటర్లకు రాకుండానే ఓటీటీలో విడుదలై విస్తృత ఆదరణ పొందింది.

సూర్య తన పాత్రకు ప్రాణం పోసిన తీరు, లిజోమోల్ జోస్ చేసిన బాధ్యతాయుతమైన నటన, మణికందన్ వంటి నటుల సహజమైన అభినయం సినిమాకు ప్రత్యేక బలం అయ్యాయి. కథ, కథనం, నటన అన్నింటిలోనూ సినిమా ప్రభావం చూపడంతో జాతీయ అవార్డుల్లో ముఖ్యమైన విభాగాల్లో నిలుస్తుందని చాలామంది అంచనా వేశారు. కానీ అవార్డుల ప్రకటనలో 'జై భీమ్' పేరు ఒక్క చోట కూడా కనిపించకపోవడం ఆశ్చర్యానికి గురి చేసింది. దీనిపై విమర్శలు వెల్లువెత్తాయి. నటుడు నాని వంటి వారు కూడా ఈ సినిమాకు అవార్డు రాకపోవడం పట్ల తమ అసంతృప్తిని బహిరంగంగా వ్యక్తం చేశారు. అదే సమయంలో, సినిమాలో కొంత రాజకీయ కోణం ఉందన్న వాదనలూ వినిపించాయి.




జాతీయ అవార్డుల్లో దక్కని గుర్తింపుకు ప్రత్యామ్నాయంగా ఇప్పుడు తమిళనాడు ప్రభుత్వం 'జై భీమ్'ను ఘనంగా సత్కరించింది. 2016 నుంచి 2022 వరకు ఏడు సంవత్సరాలకు సంబంధించిన రాష్ట్ర సినిమా అవార్డులను ఒకేసారి ప్రకటించిన తమిళనాడు ప్రభుత్వం, 2021 సంవత్సరానికి గానూ ఈ చిత్రాన్ని అవార్డుల వర్షంతో ముంచెత్తింది. ఒకే ఏడాదికి ఏడు పురస్కారాలు దక్కడం విశేషంగా నిలిచింది. ఉత్తమ చిత్రంగా 'జై భీమ్' ఎంపిక కావడంతో పాటు, ఉత్తమ నటిగా లిజోమోల్ జోస్‌కు అవార్డు దక్కింది. అదనంగా ఉత్తమ విలన్, ఉత్తమ సహాయ నటుడు, ఉత్తమ సంగీత దర్శకుడు, ఉత్తమ నేపథ్య గాయకుడు వంటి కీలక విభాగాల్లోనూ అదే సినిమా అవార్డులు సాధించింది. జాతీయ స్థాయిలో దక్కని గుర్తింపును రాష్ట్ర స్థాయిలో భారీగా అందుకోవడంతో 'జై భీమ్' మరోసారి వార్తల్లో నిలిచింది.

# రాజాసాబ్ ఓటీటీ అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చేసింది




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, మారుతి దర్శకత్వంలో తెరకెక్కిన భారీ చిత్రం 'రాజా సాబ్' ఓటీటీ బాట పట్టింది. సంక్రాంతి కానుకగా జనవరి 9న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా, భారీ అంచనాల మధ్య వచ్చినప్పటికీ బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో నిలవలేకపోయింది. థియేటర్ రన్ ముగింపు దశకు చేరుకోవడంతో ఇప్పుడు డిజిటల్ విడుదలకు సిద్ధమైంది.

'రాజా సాబ్' ఫిబ్రవరి 6 నుంచి జియో హాట్‌స్టార్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమా అందుబాటులోకి రానుండగా, హిందీ వెర్షన్ మాత్రం ప్రస్తుతానికి ఓటీటీలోకి రాలేదు. సుమారు 450 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ హారర్ కామెడీ, విడుదలైన నెల రోజులు కూడా కాకుండానే డిజిటల్ ఎంట్రీ ఇవ్వడం గమనార్హం.

మహాశివరాత్రిని దృష్టిలో పెట్టుకుని ఫిబ్రవరి 13న స్ట్రీమింగ్ ఉంటుందని అంచనాలు వినిపించినా, మేకర్స్ వారం ముందుగానే ఓటీటీ విడుదలను ఖరారు చేశారు. థియేటర్లలో పెద్దగా ప్రభావం చూపలేకపోయినప్పటికీ, ప్రభాస్ సినిమా కావడంతో డిజిటల్ ప్రేక్షకుల్లో మాత్రం మంచి ఆదరణ దక్కుతుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

# ది కేరళ స్టోరీ సీక్వెల్ సిద్ధం

ఆదా శర్మ ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'ది కేరళ స్టోరీ' బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని సాధించింది. సుదీప్తో సేన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం వాణిజ్య విజయం మాత్రమే కాకుండా జాతీయ స్థాయిలోనూ గుర్తింపు తెచ్చుకుంది. ఈ సినిమాకు రెండు జాతీయ చలనచిత్ర అవార్డులు దక్కగా, ఉత్తమ దర్శకుడిగా సుదీప్తో సేన్‌కు, ఉత్తమ సినిమాటోగ్రఫీ విభాగంలో మరో పురస్కారం లభించింది. ఇప్పుడు అదే చిత్రానికి కొనసాగింపుగా 'ది కేరళ స్టోరీ-2: గోస్ బియాండ్' ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ సీక్వెల్ టీజర్‌ను విడుదల చేశారు. పార్ట్-2కు కామాఖ్య నారాయణ్ సింగ్ దర్శకత్వం వహించగా, ఉల్కా గుప్తా, ఐశ్వర్య ఓజా, అదితి భాటియా కీలక పాత్రల్లో నటించారు. టీజర్‌ను బట్టి ముగ్గురు హిందూ యువతుల జీవితాలను కేంద్రంగా తీసుకుని, వారు ఎలా మోసపోయారన్న కోణంలో కథ నడుస్తున్నట్లు తెలుస్తోంది.




ఫిబ్రవరి 27న థియేటర్లలో విడుదలకానున్న ఈ చిత్రాన్ని విపుల్ అమృత్‌లాల్ షా నిర్మించారు. 2023లో వచ్చిన మొదటి భాగం కేరళకు చెందిన కొంతమంది మహిళల అదృశ్యం, మతమార్పిడుల అంశాల చుట్టూ తెరకెక్కి పెద్ద చర్చకు దారి తీసింది. ఇప్పుడు అదే నేపథ్యాన్ని మరింత విస్తృతంగా చూపించనున్న సీక్వెల్‌పై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరుగుతోంది.

# బ్లాక్‌బస్టర్ హీరోయిన్‌కు కలిసి రావడం లేదా

గత ఏడాది టాలీవుడ్‌లో అంచనాలకు మించి వసూళ్లు సాధించిన చిత్రాల్లో 'సంక్రాంతికి వస్తున్నాం' ముందువరుసలో నిలిచింది. సంక్రాంతి కానుకగా విడుదలైన ఈ మిడ్‌రేంజ్ సినిమా, పవన్ కళ్యాణ్ 'ఓజీ' వచ్చే వరకు ఏడాదిలోనే హైయెస్ట్ గ్రాసర్‌గా కొనసాగింది. అలాంటి బ్లాక్‌బస్టర్‌లో కథానాయికగా నటించిన ఐశ్వర్య రాజేష్‌కు ఆ తర్వాత తెలుగులో పెద్ద అవకాశాలు రాకపోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

వెంకటేశ్ సరసన కీలక పాత్రలో ఆమె నటన, ముఖ్యంగా కామెడీ టైమింగ్‌కు మంచి పేరు వచ్చింది. అయినప్పటికీ, ఆ విజయం ఆమె కెరీర్‌కు ఆశించిన ఊపు ఇవ్వలేకపోయింది. ప్రస్తుతం ఐశ్వర్య యువ నటుడు తిరువీర్‌తో 'ఓ సుకుమారి' అనే చిన్న చిత్రంలో మాత్రమే కనిపిస్తోంది.

ఈ విషయంపై స్పందించిన ఐశ్వర్య, బ్లాక్‌బస్టర్ తర్వాత పెద్ద హీరోల సరసన నటిస్తానని ఆశించానని చెప్పింది. అవకాశాలు అనుకున్నట్టుగా రాకపోయినా, కథా బలం ఉన్న పాత్రలతో సంతోషంగా ఉన్నానని పేర్కొంది. ఎలాంటి పాత్రకైనా సిద్ధమేనని స్పష్టం చేస్తూ, టాలీవుడ్‌లో తనకు సరైన గుర్తింపు దక్కుతుందన్న ఆశను వ్యక్తం చేసింది.



## తెల్ల చీరలో హీట్ పుట్టిస్తున్న
# అనైరా గుప్తా

ఇండియన్ సినిమాల్లో క్రమంగా గుర్తింపు పెంచుకుంటున్న నటి, మోడల్ అనైరా గుప్తా మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో తాజాగా షేర్ చేసిన ఫోటోకు మంచి స్పందన లభిస్తోంది. తెల్ల చీరకు ఎరుపు ప్రింటెడ్ బ్లౌజ్‌ను జోడించిన లుక్‌లో అనైరా ఆకట్టుకుంటోంది. తమిళ, తెలుగు చిత్రాల్లో నటిస్తూ అనైరా తనదైన గుర్తింపును ఏర్పరుచుకుంది. థలపతి విజయ్‌తో కలిసి నటించిన 'సర్కార్' చిత్రం ఆమెకు విస్తృత గుర్తింపు తీసుకొచ్చింది. అలాగే 'విత్తైక్కారన్' తమిళ సినిమాలోనూ ఆమె నటన ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. తెలుగులో 'అన్వేషి'తో మెప్పించిన అనైరా, తాజాగా హరీష్ గాధగాని దర్శకత్వంలో తెరకెక్కిన రొమాంటిక్ లవ్ స్టోరీ 'SMV'లోనూ నటించింది. సినిమాలతో పాటు, 2026లో విడుదలైన 'మజా లే లే' మ్యూజిక్ వీడియోలో పూనమ్ ఝా, దేవ్ నేగితో కలిసి కనిపించి మరోసారి వార్తల్లో నిలిచింది.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013. Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com